thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 131 కరీంనగర్ ఆదివారం, 20 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌పై 15 లక్షల సైబర్ అటాక్స్ చేసిన పాక్..

భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ అన్ని రకాలుగా కుట్రలు చేస్తూనే ఉంది. ఓ వైపు పాకిస్తాన్ ఆర్మీ కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తూ .. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడుతూ ఉంది. మరో వైపు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమయాక భారతీయుల్ని పొట్టనపెట్టుకుంటూ ఉన్నారు. ఈ రెండు రకాలుగానే కాకుండా .. మూడో రకంగా కూడా భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ కుట్రలు చేస్తూనే ఉంది. ఎవ్వరూ ఊహించని విధంగా భారీ స్థాయిలో సైబర్ అటాక్స్‌కు పాల్పడుతోంది. పహల్గామ్ టెర్రర్ అటాక్ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన హ్యాకర్లు దేశ వ్యాప్తంగా 15 లక్షల సైబర్ అటాక్స్ జరిపినట్లు తేలింది.

# మోడీ మాస్టర్ ప్లాన్..



## ప్రక్షాళనకు రంగం సిద్ధం..!


## కమలంలో కొత్త టెన్షన్..!!

దేశ రాజకీయాల్లో పెను మార్పులకు రంగం సిద్ధమవుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ద్వయం కమలదళాన్ని సరికొత్త వ్యూహాలతో పదును పెడుతున్నారు. రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పార్టీలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. త్వరలో జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, రాబోయే సార్వత్రిక సమరాన్ని దృష్టిలో ఉంచుకుని బీజేపీ అగ్రనాయకత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది.

ఈ పరిణామాలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుండగా, కొందరు నేతల్లో మాత్రం టెన్షన్ మొదలైంది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల నియామకం ఈ ప్రక్షాళనలో కీలక ఘట్టం. ఆంధ్రప్రదేశ్‌లో ఊహించని విధంగా దగ్గుబాటి పురందేశ్వరి స్థానంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌కు పార్టీ పగ్గాలు అప్పగించారు. అటు తెలంగాణలోనూ బండి సంజయ్ స్థానంలో మాజీ ఎమ్మెల్సీ, న్యాయవాది ఎన్. రామచందర్ రావును నూతన అధ్యక్షుడిగా నియమించారు. ఈ మార్పులు కేవలం రెండు రాష్ట్రాలకే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్షులను మారుస్తూ అధిష్ఠానం తనదైన మార్క్ చూపిస్తోంది. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలకు అనుగుణంగా, యువతకు, కొత్త ముఖాలకు అవకాశం కల్పిస్తూ ఈ మార్పులు చేపడుతున్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రాల్లో మార్పుల పర్వం ముగింపు దశకు చేరుకోవడంతో ఇప్పుడు అందరి దృష్టి బీజేపీ జాతీయ అధ్యక్ష పీఠంపై పడింది.

ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగియనుండటంతో కొత్త సారథి ఎవరనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ పదవి కోసం పలువురు సీనియర్ నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే, ప్రధానిమోదీ, అమిత్ షాల మదిలో ఏముందోనన్నది అంతుచిక్కడం లేదు. పార్టీని రాబోయే దశాబ్దకాలం పాటు నడిపించగల సమర్థుడైన, బలమైన నేత కోసం ఆరెస్సెస్ కూడా తన వంతు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జాతీయ అధ్యక్షుడి ఎంపిక ఆసక్తికరంగా మారింది. కేవలం పార్టీ పదవులే కాదు, ప్రభుత్వంలోని కీలక నామినేటెడ్ పోస్టుల భర్తీపైనా కేంద్రం దృష్టి సారించింది. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వివిధ రంగాలకు చెందిన నలుగురు ప్రముఖులను రాజ్యసభకు నామినేట్ చేశారు. అలాగే, గోవా, హర్యానా, లడఖ్ వంటి ప్రాంతాలకు కొత్త గవర్నర్లను నియమించారు. ఈ నియామకాలన్నీ కూడా పక్కా రాజకీయ, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని చేసినవేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రక్షాళన ప్రక్రియలో అత్యంత కీలకమైన అంకం మోదీ మంత్రివర్గ విస్తరణ. త్వరలోనే కేబినెట్‌లో మార్పులు చేర్పులు ఉండబోతున్నాయని, కొందరికి ఉద్వాసన పలికి, కొత్తవారికి అవకాశం కల్పించనున్నారని ప్రచారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, మిత్రపక్షాలకు పెద్దపీట వేయడంతో పాటు, ప్రాంతీయ సమతుల్యతను పాటించేలా ఈ విస్తరణ ఉండబోతోందని తెలుస్తోంది.

ఈ విస్తరణలో ఎవరికి చోటు దక్కుతుంది, ఎవరు పదవులు కోల్పోతారనేది ఇప్పుడు బీజేపీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.




తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా జస్టిస్ ఏకే సింగ్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. గతంలో ఆయన త్రిపుర హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. ఈ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. నూతన సీజేగా ప్రమాణం చేసిన ఏకే సింగ్ కు అభినందనలు తెలియజేశారు. కాగా ఇటీవల దేశంలో ఐదుగురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేస్తూ, ఐదు హైకోర్టులకు కొత్త సీజేలను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణతో పాటు త్రిపుర, మద్రాస్, రాజస్థాన్ హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులు బదిలీ అవ్వగా.. మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, కర్ణాటక, గువాహటి, పట్నా హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులు నియమితులయ్యారు.

**ఏకే సింగ్ గురించి క్లుప్తంగా...** న్యాయకోవిదుల కుటుంబంలో మూడో తరానికి చెందిన జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ 1965 జూలై 7న డాక్టర్ రాంగోపాల్‌సింగ్, డాక్టర్ శ్రద్ధ సింగ్ దంపతులకు జన్మించారు. ఆయన తల్లివైపు కుటుంబానికి చెందిన తాత జస్టిస్ బీపీ సిన్హా సుప్రీంకోర్టు ఆరో ప్రధాన న్యాయమూర్తిగా, మరో తాత అయిన జస్టిస్ శంభుప్రసాద్ సింగ్ పట్నా హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సమీప బంధువులైన జస్టిస్ బిశ్వేశ్వర్ ప్రసాద్, జస్టిస్ శివకీర్తి సింగ్ సుప్రీంకోర్టు జడ్జీలుగా పనిచేశారు.

## బీసీ రిజర్వేషన్లపై చెరో దారి!

### ఆమెకేమో ఆనందమట... ఈయనమో పోరాటమట!!




హైదరాబాద్: స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటా అమలు దిశగా రేవంత్ సర్కార్ ముందడుగు వేసింది . బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని, ఇందుకోసం 2018 నాటి పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. 42 శాతం కోటా కల్పిస్తూ జీవో విడుదల చేయడానికి సిద్ధమవుతోంది. దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. కేబినెట్ నిర్ణయం వెలువడిన వెంటనే జాగృతి కార్యాలయానికి కార్యకర్తలు, కవిత, ఇతర నాయకులు చేరుకొని ఇది తాము సాధించిన విజయమని పేర్కొంటూ సంబురాలు చేసుకున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ భారత జాగృతి పోరాటం చేసిందని ఈ సందర్భంగా కవిత చెప్పుకొచ్చారు. తెలంగాణ భవన్ లో బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలు ప్రెస్ మీట్ పెట్టి సర్కారు తీరును తప్పు పట్టారు. ఆర్డినెన్స్ తో రిజర్వేషన్లు సాధ్యం కావని చెబుతున్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్డినెన్స్ పేరుతో మంత్రి వర్గం చేతులు దులుపుకుంటుందని ఆరోపిస్తున్నారు. ఆర్డినెన్స్ లు చట్ట బద్దత కాదు, కోర్టులో నిలబడవని అంటున్నారు. తమిళనాడు తరహా కాకుండా బిసిలకు 42 శాతం రిజర్వేషన్ చట్ట బద్దత ఇవ్వాలని మేము అసెంబ్లీ సాక్షిగా చెప్పామంటున్నారు. ఇదే అంశంపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ బీసీ నేతలు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో భేటీ కానున్నారు. 42% రిజర్వేషన్లకు చట్టబద్ధత తెచ్చేందుకు ప్రభుత్వంపై ఎలా ఒత్తిడి తేవాలన్న? అంశంపై కార్యాచరణ ప్రకటించనున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని చెప్పుకొంటున్న భారత జాగృతి అధ్యక్షురాలు సంబురాలు చేసుకోవడం, బీఆర్ఎస్ పార్టీ పోరాటానికి సిద్ధమవుతుండటం హాట్ టాపిక్ గా మారింది. నిన్న మరో అడుగు ముందుకేసి కవిత సీఎం రేవంత్‌రెడ్డిపై పొగడ్తల వర్షం కురిపించారు. బీసీ రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి కరెక్ట డెసిషన్ తీసుకుందని, బీసీ రిజర్వేషన్‌ను వ్యతిరేకించే బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకత తప్పదన్నారు. ఏ నాటికైనా రిజర్వేషన్ల అంశంలో బీఆర్ఎస్ నేతలు తననే ఫాలో అవుతారంటూ చలోక్తులు విసిరారు.

**కవిత పక్కా ప్లాన్.. కేసీఆర్‌కు సవాలే!...** బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత.. పక్కా ప్లాన్‌తోనే ముందుకు సాగుతున్నారు. రెండు రోజులు కిందట అర్ధరాత్రి సొంత నాయకులతో భేటీ అయిన ఆమె.. ఆ సమావేశంలో వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నట్టుగా వార్తలు వచ్చాయి. అదే.. బీఆర్ఎస్‌ను సాధ్యమైనంతగా రెచ్చగొట్టడం. ఈ క్రమంలోనే ఆమె బీఆర్ఎస్‌ను వేరు చేస్తూ.. తాజాగా వ్యాఖ్యలు చేయడం వెనుక మర్మమని తెలుస్తోంది. బీఆర్ఎస్ నాయకులు అందరూ తన వెనుక రావాల్సిందేనని ఆమె వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఆమె బీఆర్ ఎస్‌లో ఉన్నానని అనుకుంటే.. ఇలా ఎవరో వచ్చి తన వెనుక జాయిన్ కావాల్సిన అవసరం లేదు. అంటే.. తాను బీఆర్ఎస్‌లో వేరుగా ఉన్నానని, మిగిలిన వారంతా మరో పక్షంగా ఉన్నారని ఆమె పరోక్షంగా చెబుతున్నట్టుగా అర్థమవుతోంది. దీనిని బట్టి.. కవిత.. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని తెలుస్తోంది. బీఆర్ ఎస్ నాయకులు అందరూ.. తన వెంట రావాలని చెప్పడం ద్వారా.. తనకు ప్రత్యేక అజెండా ఉందని కూడా ఆమె పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్టు అయింది. అంటే.. మనసులో ఒకటి.. బయటకు మరొకటి అన్నది కవిత రాజకీయాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనిని బట్టి.. ఇక, %-%డియర్ డాడీ.. కేసీఆర్.. ఏదో ఒకటి తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అంటున్నారు పరిశీలకులు. తీన్మార్ మల్లన్న వ్యవహారంలో బీఆర్ఎస్ మౌనంగా ఉన్న విషయాన్ని కవిత శిబిరం జీర్ణించుకోలేకపోతోంది. తన అన్న కేటీఆర్ కు ఏసీబీ అధికారులు ఫార్ములా ఈ రేస్ కేసులో నోటీసులు ఇచ్చినప్పుడు కవిత స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్‌కు కమిషన్ నోటీసులు ఇచ్చినప్పుడు ఏకంగా ధర్నా కూడా చేశారు. కానీ.. తన వరకు వచ్చేసరికి అంటే.. తీన్మార్ మల్లన్న మంచం-కంచం అంటూ.. చేసిన వ్యాఖ్యలపై మాత్రం బీఆర్ఎస్ నాయకులు ఒక్కరు కూడా స్పందించకపోవడాన్ని కవిత జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ క్రమంలోనే రెండు రోజుల కిందట అర్ధరాత్రి సమావేశం ఏర్పాటు చేశారన్నది వార్తల్లోనే వచ్చింది. వ్యూహాత్మకంగా వేడి పెంచి.. బీఆర్ఎస్ ముల్లును బీఆర్ ఎస్‌తోనే తీయించేలా.. ఆమె అడుగులు వేస్తున్నారని స్పష్టమవుతోంది. మరి కేసీఆర్ సత్వరమే నిర్ణయం తీసుకుంటారో.. వేచి చూస్తారో చూడాలి.




## రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీలో...

# తొలి తిరుగుబాటు

### రచ్చ చేస్తున్న రాజగోపాల్ రెడ్డి ట్వీట్!

హైదరాబాద్ : ఎక్కడో ఏదో పత్రికలో 'సీఎం గా పదేళ్లు నేనే..' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లుగా వచ్చిన వార్తకు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చేసిన ట్వీట్ తెలంగాణ రాజకీయాల్లో రచ్చ లేపుతోంది. అయితే రాజగోపాల్ రెడ్డి చేసిన కామెంట్స్‌లో కొంత అర్థమున్నా దాన్ని పెద్ద సీరియస్ గా తీసుకోవాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

ముఖ్యమంత్రి, మంత్రుల పదవులు ఎవరికయ్యాలో, అధిష్టానం తుది నిర్ణయం అనే విషయం సీఎం రేవంత్ రెడ్డికి రాజగోపాల్ రెడ్డి కంటే ఎక్కువ తెలుసు అందుకే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అధిష్టానం అందరి అభిప్రాయాలను తీసుకొని మాత్రమే రేవంత్ రెడ్డికి ఆ పదవి ఇచ్చారనేది నిర్వివాదాంశం. అయినా అలా మాట్లాడడం తప్పని రాజగోపాల్ రెడ్డి ట్వీట్ చేయడం వెనుక స్వప్రయోజనం ఉందని అనుకునే అవకాశముందని ప్రజలు భావిస్తారు. ప్రస్తుతం మంత్రి పదవి కావాలని ఢిల్లీకి చక్కర్లు కొడుతున్న రాజగోపాల్ రెడ్డి మొదట ఆ పదవి దక్కించుకునేందుకు చేయాల్సిన పని పక్కన పెట్టి రేవంత్ రెడ్డి కి వ్యతిరేకంగా అనిపించేలా కామెంట్స్ చేయడం వల్ల మంత్రి పదవి దక్కే అవకాశాలు కూడా జారవిడుచుకుంటున్నాడని ఆయన శ్రేయోభిలాషులే అంటున్నారు.

**పార్టీ మారడం మైనస్ పాయింటే..** ఎన్నికలకు కొన్ని నెలల ముందు కాంగ్రెస్ పని అయిపోయిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాదని భావించి బీజేపీ లో చేరిన ఆయన బై ఎలక్షన్లలో పరాజయం పాలైన తర్వాత, ఎన్నికలకు కొద్ది రోజుల ముందే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తున్నట్లు సర్వేలో తేలడంతో తిరిగి సొంత గూటికి చేరుకున్నాడు. మునుగోడు నుంచి పోటీచేసి గెలిచాడు. కానీ మీడియా గన్ (ఛానల్ మైక్) పెట్టగానే పూనకం వచ్చినట్లు, ఏం మాట్లాడుతున్నారో తెలిసో, తెలియకనో మాటలు జారడం వల్ల ఆయన రాజకీయంగా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

**ఇన్ని రోజులు బాగానే ఉన్నారు...** అవకాశం దొరికితే రేవంత్ రెడ్డి పై విరుచుకుపడే ఆయన ఈ మధ్య కాలంలో కొంత సంయమనం పాటిస్తున్నట్లు కనిపించింది. ఈ మధ్య మునుగోడు లో మీడియాతో మాట్లాడినప్పుడు కూడా ఆచితూచి మాట్లాడారు. తనకు ఎందుకు మంత్రి పదవి రాలేదో చెప్పుకుంటూ, ఈ ప్రాంతం అభివృద్ధి చెందేందుకు మంత్రి పదవి దోహదపడుతుందని అర్థం వచ్చేలా మాట్లాడడం గమనార్హం.

**ఆకస్మాత్తుగా ఏమైంది..?...** ఇన్ని రోజులు సంయమనం పాటించిన ఆయన ఒక్క ట్వీట్ తో మళ్లీ రాజకీయ రచ్చ లేపారు. ఇదే అవకాశంగా తీసుకొని సోషల్ మీడియా తమకు తోచినవిధంగా ఎవరికివారే విశ్లేషణలు చేస్తుండగా మళ్ళీ వార్తలకు ఎక్కారు. దారిన పోయే కంపను తగిలించున్నట్లు అధిష్టానం చేయాల్సిన కామెంట్స్ తాను చేసి సీఎం తో ఉన్న మంచి సంబంధాలను చెడగొట్టుకున్నాడని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు..

చురకలు






హైదరాబాద్: హుజూరాబాద్ అనేక త్యాగాలకు అడ్డా అని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో హుజూరాబాద్ భాజపా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూరాబాద్ నుంచే అనేక పోరాటాలు చేశామన్నారు. కొందరు సామాజిక మధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి నుంచి బయటికి రావడానికి అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. తాను పదవుల కోసం పార్టీ మారలేదన్నారు. మనకు మనం భారత రాష్ట్ర సమితి నుంచి బయటకు రాలేదని.. వెళ్లగొట్టారని వ్యాఖ్యానించారు. 2021 నుంచి ఆ పార్టీలో నరకం అనుభవించానన్నారు. "గతంలో సీఎంగా ఉన్న కేసీఆర్‌కు నా నిర్ణయాలు మొహమాటం లేకుండా చెప్పాను. గతంలో హుజూరాబాద్ ఉపఎన్నికల్లో ప్రజల ఆత్మగౌరవం గెలిచింది. నేను అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా. గతంలో హుజూరాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో నా ఓటమికి చాలా మంది కుట్రలు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నా అడుగు పడని గ్రామాలు లేవు. నేను పోరాటాలు చేస్తే కరీంనగర్ ప్రజలు అండగా ఉండేవారు. హుజూరాబాద్ గడ్డలో ప్రతి గ్రామంలోని వార్డు సభ్యుడిని గెలిపిస్తాం.

**అప్పుడు కేసీఆర్.. ఇప్పుడు రేవంత్ కుట్రలు...** రాజకీయాల్లో అవమానాలు, అవహేళనలు ఉంటాయని.. వాటిని తట్టుకున్నాం. నాకు స్ట్రయిట్ ఫైట్ తప్ప స్ట్రీట్ ఫైట్ రాదు. కడుపులో కత్తులు పెట్టుకుని రాజకీయం చేయడం మాకు చేతకాదు. పైకి ఒక మాట.. లోపల మరో మాట మాట్లాడటం తెలియదు. శత్రువుతో నేరుగా కొట్లాడతా. స్వరాష్ట్రం కోసం ఉద్యమం చేసిన చరిత్ర నాది. నాపై గతంలో కేసీఆర్.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారు. రాజకీయాల్లో అబద్ధాల పునాదులపై కొందరు బతుకుతున్నారు. నిజాయతీగా పార్టీ కోసం కష్టపడటం తప్ప నాకు మరొకటి తెలియదు. కాలం చాలా గొప్పది.

**ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదు...** హుజూరాబాద్ చైతన్యానికి మారుపేరు. క్యాడర్‌కు అందుబాటులో ఉంటా. ప్రజలు ఎప్పుడూ మోసం చేయరు. నా చరిత్రేంటో వారికి తెలుసు. ధీరుడు వెనుదిరగడు.. ఎంత వరకు ఓపిక పట్టాలో తెలుసు. వ్యక్తులు ఎదగకుండా పార్టీ బలపడదు. కార్యకర్తల ఆవేదన అర్థమైంది. వారి రాజకీయ అవసరాలు తీర్చలేనంత నిస్సహాయంగా లేను. నా అనుభవం వాడుకుంటే పార్టీకి ఉపయోగపడుతుంది. పదవులే పరమావధిగా భావించేవాడిని కాదు. ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి అంకితభావంతో పనిచేస్తా. ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదు. రాజకీయాల్లోనే కాదు.. అన్నింట్లోనో కోవర్టులు ఉంటారు. వారి గురించి ఆలోచించొద్దు. హుజూరాబాద్ వస్తా.. మీ వెంటే ఉంటా.. స్థానిక ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపించుకుంటా. కార్యకర్తలు కుంగిపోవద్దు"అని ఈటల అన్నారు.




## కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో 2026లో ఉత్పత్తి ప్రారంభం: రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

హనుమకొండ: కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ వరంగల్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని.. ఆ కోరికను ప్రధాని నరేంద్ర మోదీ నెరవేర్చారని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు.

నిర్మాణ పనుల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రులకు వివరించారు. అనంతరం అశ్వినీ వైష్ణవ్ మీడియాతో మాట్లాడారు. కాజీపేటలో మెగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కేంద్రం నిర్మిస్తోందని.. పనులు వేగంగా సాగుతున్నాయని అన్నారు. 2026లో కాజీపేటలో రైల్వే కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభం అవుతుందన్నారు. కాజీపేట నుంచి త్వరలోనే 150 లోకోమోటివ్‌లు కూడా ఎగుమతి అవుతాయన్నారు. భవిష్యత్తులో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో మెట్రో కోచ్‌లు కూడా తయావుతాయని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ 40 ఏళ్ల పోరాటమని చెప్పారు.

"ఇక్కడ రైల్వే వ్యాగన్లు, కోచ్‌లు, ఇంజిన్ల తయారీ పరిశ్రమను ప్రధాని మోదీ మంజూరు చేశారు. రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నాం. వరంగల్‌కు ఇప్పటికే విమానాశ్రయం రావాల్సి ఉంది. ఎయిర్‌పోర్టుకు భూములు ఇవ్వాలని గతంలో కేసీఆర్‌ను ఎన్నోసార్లు అడిగాం. భూసేకరణ గురించి ఈ ప్రభుత్వాన్ని కూడా అడుగుతున్నాం" అని పేర్కొన్నారు.




హైదరాబాద్: హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 25 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జాప్యం లేకుండా త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్‌లో వర్షాలపై స్వయంగా ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో ఎక్కడైనా ఇబ్బందుల ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్, పోలీస్ కమిషనర్, వాటర్ వర్క్, ఇతర అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు.




## తెలంగాణలో భారీ వర్షం.. ఆ జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు

నైరుతి రుతు పవనాల ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండ్రోజులు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణకేంద్రం సంచాలకురాలు కె.నాగరత్న తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరో ఐదురోజులపాటు మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఈ ఐదు రోజులు ఎల్లో అలర్ట్, మూడో రోజు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ రోజు తెలంగాణలోని వికారాబాద్, రంగారెడ్డి, ములుగు, భద్రాద్రి, జయశంకర్, జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌దే విజయం: మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బనకచర్ల విషయంలో హరీశ్‌రావు అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ప్రజల ఆకాంక్షల మేరకే తెలంగాణలో పాలన జరుగుతోందని వివరించారు. అంతకుముందు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మురళీగౌడ్, సంజయ్‌గౌడ్ పార్టీలో చేరారు. వారికి మహేశ్‌కుమార్ గౌడ్ కండువా కప్పి ఆహ్వానించారు.




హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. "పదేళ్లు తానే సీఎం అని రేవంత్ చెప్పడం కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో అధిష్ఠానం ఆదేశాలతోనే ఎన్నిక ఉంటుంది. ప్రజాస్వామ్యబద్ధంగా సీఎం ఎన్నిక జరుగుతుంది. తెలంగాణలోని పార్టీని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలు సహించం. నిఖార్సయిన నేతలు, కార్యకర్తలు ఎవరూ ఇలాంటివి సహించరు" అని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆర్ఎస్ ప్రవీణ్‌కు నోటీసులు!



హైదరాబాద్, జులై 19: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో విచారణలో భాగంగా మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు సిట్ అధికారులు నోటీసులు అందించారు. నోటీసు అందుకున్న రెండు రోజుల్లో ఉదయం 11 నుండి సాయంత్రం 6 గంటల్లోపు వాగ్మూలం ఇచ్చేందుకు తమ కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు.

కాగా సిట్ నోటీసులపై ప్రవీణ్ కుమార్ స్పందించలేదు. వాగ్మూలం ఇచ్చేందుకు ఆయన నిరాకరించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాల్సి వస్తుందనే స్టేట్మెంట్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్లు సమాచారం. అయితే జులై 14 న ప్రవీణ్ కుమార్‌కు సిట్ నోటీసులు ఇవ్వగా ఆయన ఇంకా స్పందించలేదు. గతంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు హోదాలో.. బీఆర్ఎస్ ప్రభుత్వం తన ఫోన్ ను హ్యాక్ చేస్తుందని, ఫోన్ ట్యాపింగ్ కి పాల్పడుతుందని కేంద్ర ఎన్నికల సంఘంతో డీజీపీకి ఆయన ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

## సీపీఐ నేత చందునాయక్ హత్య కేసు.. ఐదుగురి అరెస్ట్

**హైదరాబాద్: సీపీఐ నేత కేతావత్ చందునాయక్ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ ఘటనలో ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈనెల 15న మలక్‌పేట పరిధిలోని శాలివాహననగర్ పార్కులో చందునాయక్‌ను దుండగులు తుపాకీతో కాల్చి చంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఐదుగురిని ఇవాళ అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.**

## కేటీఆర్‌కు జైలు జీవితం తప్పదు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల స్ట్రాంగ్ వార్నింగ్

హనుమకొండ: మాజీమంత్రి కేటీఆర్‌కు జైలు జీవితం తప్పదని కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. వరంగల్‌కు ఇచ్చిన హామీలను మరిచిన దొంగ కేటీఆర్ అని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసే అభివృద్ధి కేటీఆర్‌కి కనిపించడం లేదా... కళ్లు కనిపించకపోతే డాక్టర్ వద్దకు తీసుకుపోతానని ఎద్దేవా చేశారు నాయిని రాజేందర్ రెడ్డి. ఇవాళ(శనివారం) హనుమకొండలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పదేళ్లలో తెలంగాణకు ఏం చేశారని ప్రశ్నించారు. పదిమంది లంపెన్ గ్యాంగులతో కేటీఆర్.. కాంగ్రెస్ నేతలపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు నాయిని రాజేందర్ రెడ్డి. తాము తలచుకుంటే రోడ్లపై కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు తిరగలేరని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే చూస్తు ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి రాకముందు దూకుడుగా ఉండేవాళ్లమని... ఇప్పుడు తమ చేతులని హై కమాండ్ కట్టేస్తోందని చెప్పుకొచ్చారు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తుపై మీ చెల్లె కవిత చెప్పింది నిజం కాదా అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

**శవాలపై పేలాలు ఏరుకునే రకం కేటీఆర్: ఎమ్మెల్యే నాగరాజు...**



మాజీమంత్రి కేటీఆర్ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని కాంగ్రెస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. శవాలపై పేలాలు ఏరుకునే రకం కేటీఆర్ అని ఎద్దేవా చేశారు. ఇవాళ(శనివారం) హన్మకొండలో మీడియాతో నాగరాజు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు. కేటీఆర్ ఆర్థిక నేరస్తుడని.. ఆయన కుటుంబం అంతా నేరపూరితమైందని ఆరోపించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా రొయ్యల పులుసుకు మీ నాన్న కేసీఆర్ అలవాటు పడితే.. నువ్వు లెగ్గులు,పెగ్గులకు అలవాటు పడ్డావని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రజల్లోకి రాకుండా ఫాంహౌస్‌లో ఏం చేస్తున్నారని ఎమ్మెల్యే నాగరాజు ప్రశ్నించారు.




కీవ్: కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు కొనసాగుతున్నప్పటికీ.. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా మాస్కో.. కీవ్‌పై 300కి పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో విరుచుకుపడినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. దాడిలో అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. భవనాల శిథిలాల కింద అనేక మంది ప్రజలు చిక్కుకున్నారని.. వారిని బయటకు తీసుకొచ్చేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. రష్యన్ దళాలు ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులు ప్రయోగించడంతో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్ర గాయాలపాలైనట్లు ఆ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ పేర్కొన్నారు. భారీ ఆస్తి నష్టం సంభవించిందని.. ఈశాన్య సుమీ ప్రాంతంలో కీలకమైన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని తెలిపారు. యుద్ధం సమయంలో తమకు అండగా ఉంటూ.. ఆయుధాలను సరఫరా చేస్తున్న మిత్ర దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు.

**కీవ్‌కు ఆయుధాలను పంపిన ఆస్ట్రేలియా...** రష్యాతో జరుగుతున్న యుద్ధాన్ని ఎదుర్కోవడానికి ఉక్రెయిన్‌కు..ఆస్ట్రేలియా ఆయుధ సహాయం చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం కీవ్‌కు M1A1 అబ్రమ్స్ ట్యాంకులను అందజేసింది.

ఇతర సామగ్రిని రాబోయే నెలల్లో పంపనున్నట్లు ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ పేర్కొన్నారు. మాస్కో, కీవ్‌పై చేస్తున్న చట్టవిరుద్ధమైన, అనైతిక దండయాత్రకు వ్యతిరేకంగా తాము ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

చురకలు



# "వ్యూహాల వేదిక - చెస్ ఆటకు అంతర్జాతీయ ఘనత"

## "ఆలోచనల యుద్ధానికి అంకితం - అంతర్జాతీయ చెస్ దినోత్సవం" - జూలై 20... అంతర్జాతీయ చెస్ దినోత్సవం




ప్రపంచ మేధో క్రీడలలో అగ్రస్థానంలో నిలిచిన చెస్ ఆటకు అంకితంగా ప్రతి సంవత్సరం జూలై 20న అంతర్జాతీయ చెస్ దినోత్సవం జరుపు కుంటారు. ఇది కేవలం ఆట మాత్రమే కాకుండా మానవ మేధస్సు, వ్యూహాత్మక ఆలోచన, బుద్ధి వికాసానికి మార్గదర్శకంగా నిలిచే ఒక అద్భుతమైన మేధో ప్రయోగశాల. చెస్ ఆటకు భారత దేశమే జన్మస్థలం. గుప్త వంశపు కాలంలో ఆవిర్భవించిన చతురంగం అనే ఆటే ప్రస్తుతం చెస్‌గా పరిణామమైంది. నలుగురు ఆటగాళ్లతో ఆరంభమైన ఈ వ్యూహాత్మక క్రీడ, కాలక్రమేణా పర్షియన్ల వద్ద షత్రంజ్‌గా మారింది. అక్కడి నుంచి అరబ్ దేశాల గుండా యూరోపుకు చేరి చివరికి 'చెస్'గా అభివృద్ధి చెందింది. 1924 జూలై 20న ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో అంతర్జాతీయ చెస్ సమాఖ్య - ఫిడే స్థాపించబడింది. దీని గుర్తుగా 1966లో ఫిడే ఈ రోజును అంతర్జాతీయ చెస్ దినోత్సవంగా ప్రకటించింది. తరువాత 2019లో ఐక్యరాజ్య సమితి కూడా దీనిని అధికారికంగా గుర్తించింది. అప్పటి నుంచీ ఈ దినం ప్రపంచ వ్యాప్తంగా చెస్ ఔత్సాహికులు, నిపుణులు, శిక్షణ సంస్థలు జరుపు కుంటున్నాయి. చెస్ అనేది కేవలం ఆట కాదు - ఇది మానసిక శక్తిని పెంపొందించే సాధన. ఇందులో ప్రతిదీ వ్యూహాత్మకత. ప్రతి కదలిక ముందే ఊహిస్తూ నిర్ణయం తీసుకోవాలి. ఇది వ్యూహాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యం, ఏకాగ్రత, జ్ఞాపక శక్తి, ఆత్మ నియంత్రణ, సహనం వంటి అంశాలను అభివృద్ధి చేస్తుంది. సహనంతో కూడిన దీర్ఘ దృష్టిని పెంపొందిస్తుంది. చిన్న పిల్లలలో ఆలోచనా సామర్థ్యం పెరుగుతుంది. పెద్దవారికి ఒత్తిడిని నియంత్రించే ఒక మానసిక వ్యాయామంగా చెస్ సేవలందిస్తోంది. దీని వల్ల అభ్యాసకునిలో విశ్లేషణాత్మక దృష్టి, సృజనాత్మకత పెరుగుతుంది. ఇది భౌతిక శ్రమను కాకుండా మేధస్సును పరీక్షించే ఆట. భారత దేశం చెస్ క్రీడలో అనూహ్య ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తున్నది. విశ్వనాథన్ ఆనంద్ వంటి ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన మేధావిని ఈ దేశం ప్రపంచానికి అందించింది. ఆయన ప్రభావంతో దేశంలో చెస్ ఉద్యమంగా మారింది. ప్రగ్యానంద, డి గుకేష్, అర్జున్ ఎరిగైసీ, లియోన్ మెండోన్సా వంటి అనేకమంది యువ గ్రాండ్ మాస్టర్లు అంతర్జాతీయ స్థాయిలో ఘనతలను నమోదు చేస్తూ భారత ప్రతిష్ఠను నిలబెడుతున్నారు. ఇటీవల డి గుకేష్ పిన్న వయసులోనే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత పొందడం చరిత్ర సృష్టించిన ఘట్టం. భారత యువత చెస్ పట్ల చూపుతున్న ఆసక్తి భవిష్యత్ తరాలకు మేధో మార్గాన్ని చూపుతోంది. కరోనా సమయంలో చెస్ గేమ్‌కి విపరీతంగా ఆన్‌లైన్ ప్రాచుర్యం లభించింది. "చెస్ డాట్ కామ్", "లిచెస్", "చెస్24" వంటి డిజిటల్ ప్లాట్‌ఫార్ములు ప్రపంచం నలుమూలల ఆటగాళ్లను కలిపాయి. ఇంటి నుంచే వందలాది ఆటగాళ్లతో పోటీలు, శిక్షణలు, సిమల్టేనియస్ ఎగ్జిబిషన్లు నిర్వహించగలిగే అవకాశం కల్పించాయి. డిజిటల్ టోర్నమెంట్లు, వీర్చువల్ చెస్ క్లాస్‌లు, బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా చెస్ ఆట ప్రపంచ యువతకు మరింత చేరువైంది. ఈ గేమ్‌కి భౌగోళిక, భాషా అవరోధాలేమీ ఉండవు. అందుకే చెస్ అంతర్జాతీయ స్నేహసూక్తికి మారుపేరు. ప్రపంచ వ్యాప్తంగా జూలై 20న అనేక దేశాలలో చెస్ టోర్నమెంట్లు, ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, గ్రాండ్ మాస్టర్లతో ప్రత్యక్ష గేమ్‌లు, బుక్ లాంచ్‌లు, చరిత్రపై డాక్యుమెంటరీలు, యువత కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. భారతదేశంలోనూ పాఠశాలల స్థాయిలో టోర్నీలు, చెస్ శిక్షణా శిబిరాలు, గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం వంటి పాఠ్యాంశాలతో చెస్ గేమ్‌ను అనుసంధానం చేయాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. భవిష్యత్ దిశలో చెస్ ఆటను పాఠశాలల విద్యలో భాగం చేయడం అత్యవసరం. ఇది విద్యార్థులలో స్వావలంబన, లోతైన ఆలోచన, సరైన నిర్ణయం తీసుకునే సామర్థ్యం వంటి జీవన నైపుణ్యాలను అలవర్చగలదు. చాలా దేశాలలో, ముఖ్యంగా రష్యా, చైనాలలో చెస్ చదువుతో అనుసంధానమై ఉంది. భారత్‌లోనూ అదే మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం, క్రీడా సంస్థలు, సమాజం చెస్ ఆటకు మరింత ప్రోత్సాహం అందించాలి. చెస్ ఆట అనేది శరీరాన్ని కదిలించని పోరాటం, కానీ మనసును మెలికలు తిరిగించే యుద్ధరంగం. ఇది మానవ మేధస్సుకు, ఓర్పుకు, తత్వ చింతనకు, విజ్ఞాన వికాసానికి మార్గాన్ని చూపుతుంది. అంతర్జాతీయ చెస్ దినోత్సవం మానవ జ్ఞానాన్ని సాక్షాత్కరించే ఒక రోజు మాత్రమే కాదు, మానవుడు తాను ఎదుర్కొంటున్న సమస్యలను ఎంత వ్యూహాత్మకంగా పరిష్కరించ గలడో గుర్తు చేసే మహోన్నత సందర్భం. ఒక మంచి చెస్ కదలిక జీవితాన్నే మార్చ గలదు అనే మాట యథార్థం. ప్రపంచాన్ని సమర్థంగా ఆలోచించే దిశగా మనమంతా ఆ కదలికలు మొదలెట్టాల్సిన అవసరం ఇప్పుడు మరింత స్పష్టంగా ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

# ఇక యూకేలో భారతీయులకు కష్టమే..



బ్రిటన్ ప్రభుత్వం వలసలను తగ్గించడానికి వీసా, వలస చట్టాలలో గణనీయమైన మార్పులు తీసుకురావాలని యోచిస్తోంది. ఈ ప్రతిపాదిత మార్పులు యూకేలో పనిచేయాలని, స్థిరనివాసం పొందాలని ఆశిస్తున్న వేలాది మంది వలసదారులపై, ముఖ్యంగా భారతీయులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఇమ్మిగ్రేషన్ శ్వేతపత్రం ఈ మార్పులకు సంబంధించిన వివరాలను వెల్లడించింది.

**- వలసల తగ్గింపు లక్ష్యం:** వలస కార్మికుల సంఖ్యను తగ్గించడం, ఇమ్మిగ్రేషన్ వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణను బలోపేతం చేయడం ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పేర్కొంది. బ్రిటన్‌లో పెరుగుతున్న వలస వ్యతిరేక సెంటిమెంట్, రిఫార్మ్ యూకే వంటి పార్టీలకు పెరుగుతున్న ప్రజాదరణ వంటి అంశాలు ఈ కఠినతరం చర్యలకు దారితీశాయి. దేశానికి అర్థవంతమైన సహకారం అందించేవారికి మాత్రమే యూకేలో ఉండేందుకు అనుమతి ఉంటుందని ప్రధానమంత్రి స్టార్మర్ స్పష్టం చేశారు.

**-భారతీయులపై ప్రభావం - గణాంకాలు ఏం చెబుతున్నాయి?**
2024లో యూకే ప్రభుత్వం విదేశీయులకు జారీ చేసిన వర్క్ వీసాల సంఖ్య 2,10,098గా ఉంది. ఇది 2023తో పోలిస్తే 37 శాతం తగ్గుదల. ఈ వర్క్ వీసాలలో అత్యధికంగా పొందినవారు భారతీయులే అయినప్పటికీ, వారి సంఖ్యలో కూడా తగ్గుదల నమోదైంది. 2024 జూన్‌తో ముగిసిన 12 నెలల కాలంలో సుమారు 1,16,000 మంది భారతీయులు పని నిమిత్తం యూకే వెళ్లారు, ఇది 2023లో 1,27,000గా ఉంది. ఈ తగ్గుదల పాక్షికంగా 2024 ప్రారంభంలో ప్రవేశపెట్టిన మునుపటి ప్రభుత్వ నిబంధనల వల్ల సంభవించింది, ఇందులో కేర్ వర్కర్లు తమ కుటుంబ సభ్యులను తీసుకెళ్లడంపై నిషేధం, స్కిల్డ్ వర్కర్లకు కనీస జీతం పరిమితిని పెంచడం వంటివి ఉన్నాయి. సాధారణంగా భారతీయులు వైద్యం, ఐటీ, ఇంజినీరింగ్, విద్య, ఆతిథ్యం, కేటరింగ్, ట్రేడ్ సెక్టార్‌లలో పనిచేసేందుకు వీసాలు పొందుతున్నారు. అయితే, కొత్త నిబంధనలు ఈ రంగాలలోకి వలసదారుల ప్రవేశాన్ని మరింత కష్టతరం చేయనున్నాయి.

**-ప్రతిపాదిత కీలక మార్పులు:**
**శ్వేతపత్రంలో ప్రతిపాదించిన ముఖ్యాంశాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:** స్కిల్డ్ వర్కర్ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా కనీసం యూనివర్సిటీ డిగ్రీ కలిగి ఉండాలి. యూకేకు వచ్చే వ్యక్తులు సరైన అర్హత కలిగి ఉన్నారని నిర్ధారించుకోవడం ఈ నిబంధన ఉద్దేశ్యం. స్కిల్డ్ వర్కర్లకు అవసరమైన కనీస జీతం పరిమితి కూడా గణనీయంగా పెరిగింది. ఆంగ్ల భాషాపరమైన నియమాలను మరింత కఠినతరం చేయనున్నారు. ప్రధాన దరఖాస్తుదారులతో పాటు, వీసా హోల్డర్‌పై ఆధారపడిన వయోజనులు కూడా ప్రాథమిక స్థాయి ఆంగ్ల భాషా నైపుణ్యాలను (కనీసం %ూ%1 స్థాయి) కలిగి ఉండాలి. వీసా పొడిగింపు కోసం దరఖాస్తు చేసేటప్పుడు మరింత ఉన్నత స్థాయి ప్రావీణ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. విదేశాల నుండి కొత్త కేర్ వర్కర్ల నియామకాన్ని నిలిపివేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇప్పటికే యూకేలో ఉన్న కేర్ వర్కర్లు 2028 వరకు తమ వీసాలను పొడిగించుకోవడానికి లేదా దేశంలోనే వేరే వీసా మార్గాలకు మారడానికి అనుమతించబడతారు, అయితే ఈ విధానం సమీక్షలో ఉంటుంది. శాశ్వత నివాసం : యూకేలో శాశ్వత నివాస హోదా పొందడానికి అవసరమైన నివాస కాల వ్యవధిని పెంచనున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఐదు సంవత్సరాలు నివసించిన తర్వాత %×ూ=%కు దరఖాస్తు చేసుకోవచ్చు, అయితే కొత్త ప్రతిపాదనల ప్రకారం ఇది 10 సంవత్సరాలకు పెరగనుంది.

స్థిరనివాసం అనేది ఒక హక్కు కాదని, అది దేశానికి అందించే సహకారం ద్వారా "సంపాదించుకోవాల్సిన" ఒక హక్కు అని ప్రభుత్వం పేర్కొంది. కుటుంబ వీసాలు: కుటుంబ సభ్యుల కోసం వీసా దరఖాస్తులకు సంబంధించిన ఆర్థిక అవసరాలు కూడా పెరిగాయి. ఒక కుటుంబ సభ్యుడిని స్పాన్సర్ చేయడానికి అవసరమైన కనీస ఆదాయ పరిమితి గణనీయంగా పెరిగింది.

**విద్యార్థుల వీసాలు:** విద్యార్థుల వీసాలకు సంబంధించిన నియమాలను కూడా కఠినతరం చేయనున్నారు. అంతర్జాతీయ విద్యార్థులను స్పాన్సర్ చేసే విద్యా సంస్థలపై నిబంధనలు పటిష్టం అవుతాయి. గ్రాడ్యుయేట్లు యూకేలో చదువు పూర్తి చేసిన తర్వాత ఉండే కాల వ్యవధి రెండు సంవత్సరాల నుండి 18 నెలలకు తగ్గింది. బ్రిటన్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ వీసా నిబంధనల కఠినతరం చర్యలు వలసలను తగ్గించడంలో సహాయపడతాయని భావిస్తున్నారు. అయితే, ఈ మార్పులు యూకేకు వెళ్లాలని ఆశించే భారతీయ విద్యార్థులు.. నిపుణులపై గణనీయమైన ప్రభావాన్ని చూపనున్నాయి. ఉన్నత విద్యార్హతలు, బలమైన ఆంగ్ల భాషా నైపుణ్యాలు, ఎక్కువ కాలం యూకేలో నివసించాలనే నిబద్ధత శాశ్వత నివాసం పొందడానికి కీలకం కానున్నాయి. ఈ మార్పులు భారతీయ వలసదారులకు యూకేలో కొత్త అవకాశాలను అన్వేషించడాన్ని మరింత సవాలుగా మార్చనున్నాయి.

# ఒక తీపి అనుభూతికి అంకితమైన దినోత్సవం ు జాతీయ ఐస్‌క్రీమ్ దినం

## జూలై మూడవ ఆదివారం జాతీయ ఐస్‌క్రీమ్ దినం




వేసవి ఎండల్లో చల్లదనం కోరుకునే ప్రతి మనిషి హృదయంలో ఒకే ఒక్క మధురమైన ఆలోచన మెల్లగా ప్రవేశిస్తుంది ు ఐస్‌క్రీమ్. అది కేవలం రుచి కాదు%ొ% ఒక జ్ఞాపకం, ఒక చిరునవ్వు, ఒక తీపి అనుభూతి. చిన్నారుల కళ్లు మెరిపించే తీయదనం, యువత మధ్య మైత్రిని పెంపొందించే ఆహ్లాదకరమైన సందర్భం, కుటుంబాలలో ఒక అప్రతిమ బంధాన్ని నిర్మించే ఉత్సాహాన్నీ ఇది కలిగిస్తుంది. ఈ విశిష్టతకు గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై మూడవ ఆదివారం జాతీయ ఐస్‌క్రీమ్ దినోత్సవం ఘనంగా నిర్వహించ బడుతోంది. ఈ సంవత్సరం అది జూలై 20, 2025 న జరుపు కుంటున్నారు. ఐస్‌క్రీమ్ చరిత్రకు మనం గమనించే ప్రతి అడుగు విశేషమైనదే. క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దం నుంచే చైనాలో మంచుతో కలిపిన పండ్ల రసాన్ని ఆస్వాదించే సాంప్రదాయం ఉందని చరిత్ర చెబుతుంది. రోమన్ సామ్రాజ్యంలోనూ, పర్షియన్ రాజరికంలోనూ మంచుతో తీపి పదార్థాలను ఉపయోగించే వారట. అయితే ఆధునిక ఐస్‌క్రీమ్‌కు శాస్త్రీయ రూపం 16వ శతాబ్దం ఇటలీ నుంచే ఆవిర్భవించింది. చైనా నుంచి వచ్చిన తయారీ పద్ధతులను మార్కో పోలో ఇటలీకి పరిచయం చేశాడు. అక్కడి నుండి ఐస్‌క్రీమ్ రుచులు ఫ్రాన్స్, ఇంగ్లండ్ మీదుగా 18వ శతాబ్దంలో అమెరికా భూభాగంలోకి అడుగు పెట్టాయి. అమెరికాలో మొదటిసారిగా 1744లో ఐస్‌క్రీమ్ ప్రస్తావన లభించింది. 1790 నాటికి జార్జ్ వాషింగ్టన్ విందుల్లో దీన్ని ఉపయోగించాడన్న ఆధారాలు ఉన్నాయి. అయితే 1851లో జాకబ్ ఫస్సెల్ అనే వ్యాపారి వాణిజ్య పరంగా ఐస్‌క్రీమ్ తయారీ ప్రారంభించడంతో ఇది సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చింది. అప్పటివరకు రాజ కుటుంబాలకు మాత్రమే పరిమితమైన ఈ తీయదనం, ప్రజల జీవితాల్లో ఒక భాగంగా మారిపోయింది. ఈ నేపథ్యంతో, 1984లో అప్పటి అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రేగన్ జూలై మాసాన్ని "నేషనల్ ఐస్‌క్రీమ్ మంత్"గా ప్రకటించడమే కాదు, జూలై మూడవ ఆదివారం రోజున "నేషనల్ ఐస్‌క్రీమ్ డే"గా అధికారికంగా గుర్తింపు ఇచ్చారు. ఐస్‌క్రీమ్‌ను అమెరికన్ ప్రజల జీవనశైలిలో భాగమైన "సాంస్కృతిక మధురత"గా అభివర్ణించారు. ప్రస్తుతం ఈ దినోత్సవాన్ని అమెరికాతో పాటు అనేక దేశాలలో, భారత దేశంలో కూడా ఎంతో ఉత్సాహంగా జరుపు కుంటున్నారు. ప్రముఖ బ్రాండ్లు ప్రత్యేక రుచులు, ఆఫర్లు, "బయ్ వన్ గెట్ వన్", "రూ.1 లో స్కూప్", "ఫ్లేవర్ సర్‌ప్రైజ్" వంటి ఆఫర్లతో వినియోగ దారులను ఆకర్షిస్తున్నాయి. సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్‌తో వేలాది మంది తమ అనుభవాలను పంచు కుంటున్నారు. ఐస్‌క్రీమ్ రకాలు అనేకం ు ఇటలీ గలాటో నుండి భారతీయ కూల్ఫీ వరకుబీ సాఫ్ట్ సర్వ్ నుండి ఫ్రోజెన్ యోగర్ట్ వరకూబీ చాక్లెట్ బైట్ నుండి పచ్చిమామిడి మజ్జిగ వరకూ. వెగన్ ఐస్‌క్రీమ్‌లు, డైరీ-ఫ్రీ, షుగర్ ఫ్రీ, ప్రొటీన్ ఐస్‌క్రీమ్‌లు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తయారవు తున్నాయి. ఇది ఆరోగ్యానికి హానికరమని చెప్పడంలో వాస్తవం ఉండక పోయినా, సరిఅయిన పరిమితిలో తీసుకుంటే ఐస్‌క్రీమ్ మానసిక ఆనందాన్ని కలిగించే టానిక్‌లా పనిచేస్తుంది. ఇండియాలో ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. 2023 నాటికి భారత ఐస్‌క్రీమ్ మార్కెట్ ?6,200 కోట్లను దాటి పోయింది. 5,000కి పైగా బ్రాండ్లు ు అమూల్, మదర్ డైరీ, నాచురల్స్, క్రీమ్‌బెల్ల, హెవెన్స్, హావ్‌మోర్ వంటివి విస్తృత స్థాయిలో వ్యాపారాన్ని చేస్తున్నారు. ఇప్పుడు ఐస్‌క్రీమ్‌ను కేవలం వేసవిలో కాకుండా, పండుగల, వేడుకల భాగంగా, లేదా రోజువారీ డెజర్ట్‌గా కూడా తీసు కుంటున్నారు. పుట్టిన రోజులు, పెళ్లిళ్లు, ఫ్యామిలీ గెదరింగ్స్, పబ్లిక్ ఈవెంట్స్ ు ఏ సందర్భమైనా ఐస్‌క్రీమ్ లేకుండా పూర్తికాలేదు. ఇది చిన్నపిల్లల ముచ్చట్లలో ఆవిరైపోయే ఓ మజిలీ, ప్రేమికుల మధ్య పంచుకునే మధురత, వృద్ధుల నోట గుర్తొచ్చే బాల్యానుభూతి. ఒక్క స్కూప్ చల్లదనం మనసు లోనూ ఒక వెచ్చదనాన్ని కలిగించ గలదు. ఈ దినోత్సవాన్ని ప్రత్యేకంగా చేయడానికి మనం ఇంట్లోనే ఐస్‌క్రీమ్ తయారు చేయవచ్చు. పిల్లలతో కలిసి తీయదనాన్ని సృష్టించడం ద్వారా వారి మనో వైకల్యాలనూ పెంపొందించవచ్చు. స్వచ్ఛమైన పదార్థాలతో తయారైన ఐస్‌క్రీమ్‌లు ఆరోగ్యకరమై ఉంటాయి. యువత ఈ రంగంలో నూతన వ్యాపార అవకాశాలను పరిశీలించవచ్చు. ఈ నేపథ్యంలో చెప్పదగ్గ విషయం ఒక్కటే ు ఐస్‌క్రీమ్ అనేది కేవలం తీపి పదార్థం కాదుబీ అది ఒక అనుభూతి, ఒక జీవనశైలి, ఒక బంధాన్ని, ఒక నవ్వును, ఒక జ్ఞాపకాన్ని కలిగించే మధురత. మన జీవితాల్లోని చిన్న ఆనందాలను గుర్తు చేస్తూ, వాటిని గౌరవించు కోవడం అనేది ఈ దినోత్సవం ద్వారా మనం నేర్చుకోవాల్సిన ముఖ్యమైన సందేశం. ఈ జూలై 20న ు మనం చిన్నపిల్లలా నవ్వుతూ, కుటుంబంతో కలిసి ఒక స్కూప్ ఐస్‌క్రీమ్ తింటూ ు జీవితాన్ని మళ్లీ ఒకసారి తీపిగా ఆస్వాదిద్దాం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ %- 9440595494**

# వరుసగా దిగ్గజాల రిటైర్మెంట్లు..

## టీమ్ ఇండియాలో అసలు ఏం జరుగుతోంది?

ఆస్ట్రేలియాతో ఆస్ట్రేలియాలో బోర్డర్-గావస్కర్ టెస్టు సిరీస్ జరుగుతుండగానే సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్.. మరొక్క నెల రోజుల్లో ఇంగ్లండ్ తో ఇంగ్లండ్ లో కీలకమైన ఐదు టెస్టుల సిరీస్ ఉండనగా కెప్టెన్ రోహిత్ శర్మ వీడ్కోలు.. రోహిత్ లేని నేపథ్యంలో మరింత బాధ్యత మీద పడిన టీమ్ ఇండియా బ్యాటింగ్ మూల స్తంభం విరాట్ కోహ్లి కూడా రిటైర్మెంట్.. దీంతో అసలు టీమ్ ఇండియాలో ఏం జరుగుతోంది? అనే చర్చ మొదలైంది. వాస్తవానికి కోహ్లి ఫామ్, ఫిట్ నెస్ బాగున్నాయి. స్వదేశంలో న్యూజిలాండ్ లో విఫలమైనా ఆస్ట్రేలియాలో మోస్తరుగా ఆడిన కోహ్లి.. ఆ తర్వాత గాడినపడ్డాడు. ప్రస్తుత ఐపీఎల్ లో అదరగొడుతున్నాడు. టి20ల నుంచి ఏడాది కిందటే వైదొలగినందున.. వన్డేలు ఎలాగూ



చాలా తక్కువే కాబట్టి.. తాను ఎంతో టెస్టు క్రికెట్ కు కోహ్లి ఇంత త్వరగా రిటైర్మెంట్ ఇస్తాడని ఎవరూ భావించలేదు. కానీ, అనూహ్యంగా ప్రకటన చేసేశాడు. రిటైర్మెంట్ పై మూడు రోజుల కిందటే ఊహాగానాలు వచ్చినా.. సీనియర్లు, క్రికెట్ నిపుణులు వద్దని వారిస్తున్నా కోహ్లి నిర్ణయం తీసేసుకున్నాడు. ఈ రిటైర్మెంట్లనీ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వచ్చాకే జరగడం గమనార్హం.

**ఏమంటాడో గంభీర్..??** ఆటగాడిగా, వ్యక్తిగా గౌతమ్ గంభీర్ ను వంక పెట్టే పరిస్థితే లేదు. అయితే, టీమ్ ఇండియా హెడ్ కోచ్ గా అతడు వచ్చాక జరుగుతున్న పరిణామాలే గంభీర్ తీరును చర్చనీయాంశం చేస్తున్నాయి. వాస్తవానికి రోహిత్ సంగతి చెప్పలేకున్నా అశ్విన్ మరొక ఏడాది, కోహ్లి మరొక రెండేళ్లు అయినా ఆడేవారేమో..? కానీ, రిటైర్మెంట్ ఇచ్చేశారు. ఈ విషయంలో గంభీర్ ఒత్తిడి ఉందా? అనే ప్రశ్న వస్తోంది. ఒకవేళ గంభీర్ కోణంలోనే చూస్తే.. జూన్ లో ఇంగ్లండ్ తో సిరీస్ నుంచి మొదలయ్యే ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ మరో రెండేళ్లు జరుగుతుంది. దీనికోసం తనదైన మార్క్ జట్టును గంభీర్ సిద్ధం చేసుకుంటున్నాడా? అనిపిస్తోంది. ఒకవేల రోహిత్, అశ్విన్ వచ్చే టెస్టు చాంపియన్ షిప్ మొత్ కొనసాగడం కష్టమే. కోహ్లి మాత్రం ఆడే వీలుండేది. కానీ, గంభీర్ ఆలోచనలను పసిగట్టి.. ముందే రిటైర్మెంట్ ఇచ్చేస్తే పోలా? అనుకున్నారో ఏమో?

# టార్గెట్ ఇండియన్ జర్నలిస్ట్స్...

## పాక్ నిఘా నయా ప్లాన్ ఇదిగో!

ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నుంచి మొదలైన భారత్ - పాక్ మధ్య ఉద్రిక్తతలు.. మే 6, 7 తేదీల్లో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తో మరింత వేడెక్కాయి. అనంతరం మార్చి 8, 9, 10 మధ్య ప్రధానంగా రాత్రుల్లో సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమయంలో ఉద్రిక్తతలు తగ్గించాలనే ప్రయత్నాలు జరిగాయి. కట్ చేస్తే.. అమెరికా మధ్యవర్తిత్వంతో ఆ ప్రయత్నమూ జరిగింది, ట్రంప్ సఫలీకృతులయ్యారు. పాకిస్థాన్ లో సంబరాలు మొదలయ్యాయి. భారత్ లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో పాకిస్థాన్ గూఢచారులు మాత్రం భారత రహస్యాలను తెలుసుకోవడానికి జర్నలిస్టులను టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. అవును... ఓ పక్క ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించాలనే




ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటుంటే.. మరోపక్క రెచ్చగొట్టే మాటలతో పాక్ లోని పెద్దలు ప్రసంగిస్తున్నారు! ఇంకోవైపు.. భారత రహస్యాలను తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు పాక్ గూఢచారులు. ఇందులో భాగంగా.. తమను తాము ఇండియన్ డిఫెన్స్ అధికారులుగా పేర్కొంటున్నారని అంటున్నారు. ఇలా తమను తాము ఇండియన్ డిఫెన్స్ అధికారులుగా పేర్కొంటూ జర్నలిస్టులకు ఫోన్ చేసి "ఆపరేషన్ సింధూర్" కు సంబంధించి సైనిక అధికారులు చేసే బ్రీఫింగ్, పాక్ విషయంలో చేసే ప్రణాళికలు మొదలైన సమాచారాన్ని సేకరిస్తున్నారని భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో తాజా యుద్ధంలో భారత్ లో ఏయే ప్రాంతాలు దెబ్బతిన్నాయని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా స్పందించిన నిఘా వర్గాలు... భారతీయ అధికారులు ఎవరూ ఎవరికీ కాల్స్ చేయరని పేర్కొన్నాయి. అటువంటి కాల్స్ వస్తే ఆన్సర్ చేయొద్దని.. అనంతరం, తమకు సమాచారం ఇవ్వాలని సూచించాయి.

# చురకలు

## సంపాదకీయం

### పీఓకే మాటతో పాక్ కి మోడీ చెక్

పాక్ తో మాటలు ఉండాలన్నా మాట్లాడుకోవడాలు ఉండాలన్నా పీఓకేతోనే అని మోడీ స్పష్టం చేశారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ మీదనే చర్చలు అని ఆయన తేల్చేశారు. మొత్తానికి చూస్తే భారత్ పాక్ ఆయువు పట్టు మీద గురి చూసి కొట్టింది అని అంటున్నారు. గత పాతిక రోజులుగా దేశంలో చోటు చేసుకున్న అనేక పరిణామాల మీద తొలిసారి తన మనసులో భావాలను జాతిని ఉద్దేశించి నరేంద్ర మోడీ జాతి జనులతో పంచుకున్నారు. దూరదర్శన్ ద్వారా ఆయన అరగంట పాటు ప్రసంగించిన తీరు చూస్తే పాక్ తో దేనికైనా సిద్ధమే అన్నట్లుగానే చెప్పారని అనిపిస్తోంది. ఉగ్రవాదాన్ని ఆపకపోతే పాక్ కి బుద్ధి చెబుతామని వార్నింగ్ కూడా ఇచ్చారు. అంతే కాదు ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుదముట్టిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం సింధు నదీ జలాల నీటి పంపిణీ ఏక కాలంలో ఉండవని పేర్కొన్నారు. ఉగ్రవాదం వాణిజ్యం కలసి ప్రయాణించలేవని అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించడం పాకిస్థాన్ మానుకోవాలని ఆయన సూచించారు. ఉగ్రవాదం చర్చలు ఒకేసారి జరగవని స్పష్టం చేశారు. రక్తం నీరు కలసి ప్రవహించలేవని అన్నారు. అణుబాంబులతో భారత్ ఎవరూ కూడా బెదిరించలేరని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి పాకిస్థాన్ పుట్టిల్లు అని గురి చూసి మరీ అంతర్జాతీయ సమాజం ముందు పాక్ ని నిలబెట్టారు. ఉగ్రవాదులు మతం పేరిట విధ్వంసం సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత దేశం అంతా కూడా ఒక్కతాటిపై నిలిచిందని గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశం తన సత్తాను ప్రపంచానికి చాటిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. ఉగ్రవాదుల శిబిరాల మీద బలమైన దాడులు నిర్వహించిందని అన్నారు. భారత రక్షణ దళాలు ప్రతిభా పాటవాలను పూర్తి స్థాయిలో ప్రదర్శించాయని గుర్తు చేశారు. భారత జవాన్ల సామర్థ్యం దేశానికి గర్వకారణమని అన్నారు. భారత నిఘా వర్గాల సమగ్రత రక్షణ శాఖ శాస్త్ర సాంకేతిక సంపత్తిని కూడా దేశమంతా చూసిందని చెప్పారు. భారత తోబుట్టువుల నుదుటి సింధూరం తుడిచిన ఉగ్రవాదులని కూకటి వేళ్ళతో పెకిలించడం జరిగిందని ప్రధానమంత్రి అన్నారు. పాకిస్థాన్ తనకు తానుగా ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయాలని చెప్పారు. అణుబాంబులతో మనల్ని ఎవరూ కూడా బెదిరించలేరని స్పష్టం చేశారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ని వదలడం తప్ప పొరుగుదేశానికి మరో గత్యంతరం లేదని ప్రధానమంత్రి అన్నారు. ఇక మీదట పాకిస్థాన్ తో చర్చలు భారత్ పెట్టిన షరతుల మేరకే సాగుతాయని ఆయన చెప్పారు. మొత్తానికి చూస్తే మోడీ స్పీచ్ పవర్ ఫుల్ గా సాగింది. భారతీయుల చాలా సందేహాలను అది తీర్చింది. అంతే కాదు పాక్ భారత్ మీద మరోసారి ఉగ్ర నీడ ఉంచినా ఏ విధంగా కెలికినా దబిడి దిబిడి అయిపోతుందని కూడా మోడీ పక్కా మాస్ వార్నింగ్ ఇచ్చేశారు. ఇక తేల్చుకోవాల్సింది పాక్ మాత్రమే అని అంటున్నారు.


# రేడియో ఆవిష్కర్త మార్కొనీ - జూలై 20... గుగ్లి ఎల్మో మార్కొని వర్ధంతి



ప్రస్తుతం ప్రతి ఇంటిలో ఇప్పుడు టివి ఉన్నట్లే కొంత కాలం క్రితం ప్రతి ఇంటిలో రేడియో సెట్ ఉండేది. నాడు ప్రధాన మనోరంజన సాధనాల్లో రేడియో ప్రధాన మైనది. రేడియో పేరు తీయగానే గుర్తుకు వచ్చేది దాని ఆవిష్కర్త మార్కోనీయే. గుగ్లి ఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ (1874 ఏప్రిల్ 25 - 1937 జూలై 20) ఇటాలియన్ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్. అతను సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపుటకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయుటలో పితా మహుడుగా గుర్తింపు పొందాడు. అతను రేడియో యొక్క ఆవిష్కర్త. 1909 లో కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్ తో కలసి వైర్?లెస్ టెలిగ్రాఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి తీసుకున్నాడు. 1897 లో బ్రిటన్ లో వైర్?లెస్ టెలిగ్రాఫ్, సిగ్నల్ కంపెనీకి వ్యవస్థాపకునిగా ఉన్నాడు. అతను ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని రేడియో అనే కొత్త ఆవిష్కరణ చేసి వ్యాపార రంగంలో ఘనమైన విజయాన్ని సాధించాడు.ల రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం యితరాలతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి. మార్కోని 1874 ఏప్రిల్ 25 లో ఇటలీ దేశంలోని బొలొగ్నాలో అన్నీ జేమ్?సన్, గుసెప్ మార్కోనీ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశలో మార్కోనీ పరిశోధనల పట్ల మక్కువ చూపించేవాడు. తన తల్లిదండ్రులచే నియమించబడిన ప్రైవేట్ ఉపాధ్యాయుల నుండి ఇంట్లో రసాయనశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలను నేర్చుకున్నాడు. లివోర్నోలోని ఉన్నత పాఠశాల భౌతిక ఉపాధ్యాయుడు ప్రొఫెసర్ విన్సెంజో రోసా 17 ఏళ్ల మార్కోనీకి భౌతిక దృగ్విషయాల ప్రాథమిక విషయాలను, అలాగే విద్యుత్తుపై కొత్త సిద్ధాంతాలను నేర్పించాడు.18 యేళ్ళ వయస్సులో అతను తిరిగి బోలోగ్నాకు తిరిగి వచ్చాడు. 1890 ల ప్రారంభంలో, అతను "వైర్‌లెస్ టెలిగ్రాఫీ" అనే ఆలోచనపై పనిచేయడం ప్రారంభించాడు, అంటే ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ ఉపయోగించిన వైర్లను కనెక్ట్ చేయకుండా టెలిగ్రాఫ్ సందేశాలను ప్రసారం చేయడం. బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగీ ఆధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు మార్కోనీ కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. 1888 లో, విద్యుదయస్కాంత వికిరణాన్ని ఉత్పత్తి చేయగలవచ్చునని, గుర్తించగలమని నిరూపించాడు. ఒకరోజు అర్ధరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకవోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది. మార్కోనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు. క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందెం గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణి ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే. వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పించింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మధ్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా %ూూ% సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది. 1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకు ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ళ దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు. మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం (%ఎతీశీం షూర్-అట్ర రేఖఆశీం%) పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభమైనాయి. 1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు.1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారు చేసింది. బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.

రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494

# పర్వతారోహణ క్రీడకు పెరుగుతున్న ఆదరణ - జూలై 20... ఎడ్మండ్ హిల్లరీ జయంతి



8848 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన హిమాలయ పర్వతాలలోని ఎవరెస్టు శిఖరం అధిరోహణ అత్యంత సాహసమైన కృత్యం. టెన్సింగ్ నార్కేతో పాటు ఎడ్మండ్ హిల్లరీ 1953, మార్చి 29 నాడు ఈ శిఖరాన్ని చేరుకొని ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తులుగా నిలిచారు. మౌంట్ ఎవరెస్టు పర్వతాన్ని నేపాలీలు 'సగరమత' అని అలాగే టిబెటన్లు 'చోమోలుంగ్మమా' పర్వతమని పిలుస్తారు. 1830- 43 శ్రీ మధ్య తొలిసారి సర్వే చేసిన భారత సర్వేయర్ జనరల్ 'సర్ జార్జ్ ఎవరెస్ట్' ఈ పర్వతాన్ని గుర్తించారు. ఆయన స్మారకార్థం ఈ పర్వతానికి 'ఎవరెస్ట్' అని నామకరణం చేశారు. సర్ ఎడ్మండ్ పర్సీవల్ హిల్లరీ (జూలై 20, 1919 – జనవరి 11, 2008) న్యూజిలాండుకు చెందిన పర్వతారోహకుడు,అన్వేషకుడు. ఎడ్మండ్ హిల్లరీ 1919 జూలై 20న న్యూజిలాండ్ లోని ఆక్లాండ్ లో జన్మించాడు. 16 సంవత్సరాల వయస్సులోనే హిల్లరీ పర్వతారోహణపై మక్కువ చూపినాడు. 1939లో దక్షిణ ఆల్ప్స్ పర్వతాలలో ఉన్న ఆలివర్ పర్వత శిఖరాన్ని అధిరోహించడం అతని జీవితంలో తొలి ప్రధాన సాహస కృత్యం. ఎవరెస్ట్ అధిరోహణే కాకుండా హిమాలయ పర్వతాలలో ఉన్న ముఖ్యమైన మరో 10 శిఖరాలను కూడా హిల్లరీ అధిరోహించాడు. ఎడ్మండ్ హిల్లరీ నేపాలీల ముఖ్యంగా షెర్పాల దృష్టిలో దైవసమానుడు. ఎవరెస్టు అధిరోహణ సమయంలో అక్కడి షెర్పాల దయనీయ జీవితాన్ని చూసి చలించి, అక్కడ పాఠశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేసి షెర్పాల జీవితంలో వెలుగులు నింపాడు.

ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి తమ దేశ గౌరవాన్ని నిలబెట్టినందుకు న్యూజీలాండ్ ప్రభుత్వం 5 డాలర్ల కరెన్సీ నోటుపై హిల్లరీ బొమ్మను ముద్రించి అతని ప్రతిభను గౌరవించింది. బ్రిటన్ జట్టులోని సభ్యుడిగా హిల్లరీ సాధించిన విజయాన్ని గౌరవిస్తూ బ్రిటన్ రాణి రెండో ఎలిజబెత్ హిల్లరీని సత్కరించింది.

**పర్వతారోహణ సాహస క్రీడ ప్రమాదకరం:** హిమాలయాల్లోని 'మహాలంగూర్ హిమాల్ సబ్-రేంజ్లో' అత్యంత ఎత్తైన ఎవరెస్టు పర్వతం చైనా-నేపాల్ సరిహద్దుల్లో ఉన్నది. ఎవరెస్ట్ పర్వతారోహణలో ప్రతికూల వాతావరణం, బలమైన గాలులు, అవలాంచ్ ప్రమాదాలు, ఆల్టిట్యూడ్ సిక్నెస్, మంచు చెరియలు విరిగి పడడం లాంటి ప్రాణాంతక ప్రమాదాలు ఉంటాయి. 2019 గణాంకాల ప్రకారం 306కు పైగా ఎవరెస్ట్ పర్వతారోహకులు అధిరోహించాలనే ప్రయత్నాలలో ప్రాణాలు విడవడం, అలాంటి సాహసికుల పార్థివ దేహాలు ఆ మంచు కొండల్లోనే కలవడం జరిగింది. ఆక్సీజన్ బాటిల్ వెంట ఉన్నప్పటికీ పర్వతారోహకులు వాంతులు, అలసట, వికారం, హిమఘాతం (ఫ్రాస్ట్‌బైట్), అల్పోష్ణస్థితి లాంటి పలు అనారోగ్యాల పాలు అవుతారు. పర్వతారోహణాన్ని పూర్తి చేసి దిగువకు వచ్చిన వారు పలు శారీరక, మానసిక బలహీనతలతో బాధ పడడం సాధారణంగా జరుగుతుంది.

**పర్వతారోహణకు పెరిగిన ఆసక్తి:** 4,042 మంది పర్వతారోహకులు ఎవరెస్టు అధిరోహించగా, అందులో 635 మంది మహిళలు కూడా ఉన్నారు. పర్వతారోహణకు అనేక మాసాల శిక్షణ, తయారీ మరియు ధనవ్యయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించుటకు దాదాపు 65,000 డాలర్ల రుసుము, ఖరీదైన పరికరాలు అవసరం అవుతాయి. ఎవరెస్ట్ పర్వతాన్ని అత్యధికంగా 21 సార్లు అధిరోహించిన రికార్డును 'అపా షెర్పా' మరియు 'ఫుర్బా షెర్పా'లు దక్కించుకున్నారు. ప్రతి ఏటా మే, సెప్టెంబర్ మాసాలు ఎవరెస్ట్ ఎక్కడానికి అనువైన సీజన్లుగా గుర్తించారు. పర్వతారోహకులు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు 19 రోజులు, అక్కడి నుండి ఎవరెస్ట్ శిఖరాగ్రానికి దాదాపు 40 రోజుల సమయం పడుతుంది. ప్రతి ఏటా దాదాపు 800 మంది ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహిస్తున్నారు. ఎన్ని అవాంతరాలు, ప్రతికూలతలు ఎదురైన పర్వతారోహకులు ఎవరెస్ట్ లాంటి అత్యంత ఎత్తైన మంచు పర్వతాన్ని అధిరోహించాలని తపన పడడం అభినందనీయం. ప్రాణాలకు తెగించి సాహసం చేసే పర్వతారోహణ సాహస వీరులకు శుభాకాంక్షలు తెలియజేద్దాం, ఆ క్రీడ పట్ల యువతను ప్రోత్సహిద్దాం.

రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494

# చంద్రుణి చేరిన మానవ గమనం - అంతర్జాతీయ చంద్ర దినోత్సవం: మానవ విజ్ఞాన యాత్ర సఫలం - జూలై 20...అంతర్జాతీయ చంద్ర దినోత్సవం




చంద్రుడు అనగానే ప్రతి భారతీయుడి మనస్సులోనూ చందమామ కథలు, శిశువులకు చెప్పే లోక గీతాలు, కవిత్వపు ఊహలు, పౌరాణిక సందర్భాలు వెంటనే గుర్తుకొస్తాయి. కానీ శాస్త్రీయ దృష్టిలో చంద్రుడు మానవ జిజ్ఞాసకు, సాంకేతిక సామర్థ్యానికి అసాధారణ పరీక్షా కేంద్రంగా నిలిచాడు. ఖగోళ పరిజ్ఞానానికి ఒక మలుపు తిప్పిన ఘట్టం, మానవజాతి కలలకూ, సంకల్పాలకూ నిత్య గుర్తుగా నిలిచి పోయింది. 1969 జూలై 20న అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా చేపట్టిన అపోలో–11 మిషన్ విజయ వంతంగా చంద్రునిపై మానవ తొలి అడుగును ముద్రించింది. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై అడుగుపెట్టిన మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచాడు. అతడు పలికిన "ఇది మనిషికి ఒక చిన్న అడుగు, మానవాళికి ఒక పెద్ద గంతు" అనే మాటలు శతాబ్దాలుగా శాస్త్రీయ పరిశోధనలకు మైలు రాళ్ళుగా నిలిచాయి. ఆర్బిటర్‌లో మైఖేల్ కాలిన్స్ ఉండగా, బజ్ ఆల్డ్రిన్ కూడా చంద్రుడిపై నడిచిన రెండో వ్యక్తి అయ్యాడు. అపోలో 11 మిషన్ మొత్తం 8 రోజులు, 3 గంటలు, 18 నిమిషాల పాటు కొనసాగింది. దీని విజయంతో ప్రపంచం మొత్తం ఆశ్చర్య పోయింది. టెలివిజన్ తెరల, రేడియోల ముందు కోట్లాది మంది ఆ క్షణాన్ని కన్నీటి ఆనందంతో చూశారు, విన్నారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ జూలై 20ను అంతర్జాతీయ చంద్ర దినోత్సవంగా అధికారికంగా గుర్తించి, అంతరిక్షం పట్ల శాంతియుత ప్రయోగాలు, సాంకేతిక సహకారం, శాస్త్రీయ విజ్ఞానం పట్ల మానవతా బాధ్యతను తెలియ జేసింది. ఈ దినోత్సవం ద్వారా మానవ విజ్ఞాన గమనాన్ని గుర్తు చేసుకోవడంతో పాటు భవిష్యత్తులో అంతరిక్షంలో మానవ ప్రస్థానం ఎలా ఉండబోతుందో పట్ల చర్చలకు, ప్రేరణలకు అవకాశం కలుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలోని ఖగోళ పరిశోధనా సంస్థలు, విద్యా సంస్థలు, ప్లానెటోరియంలు, అంతరిక్ష కేంద్రాలు ఈ రోజున వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ, చంద్రునిపై జరిగిన తొలి మిషన్ విజయాన్ని గుర్తుచేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. భారత దేశం కూడా చంద్ర అన్వేషణలో విశేషమైన పాత్ర పోషిస్తోంది. ఇస్రో చేపట్టిన చంద్రయాన్–1 మిషన్ 2008లో చంద్రునిపై నీటి ఆనవాళ్ళు గుర్తించింది. ఇది ప్రపంచ ఖగోళ శాస్త్రవేత్తలకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ తర్వాత 2019లో చంద్రయాన్–2 ద్వారా మరింత మెరుగైన టెక్నాలజీతో ల్యాండర్ పంపించగా, చివరిదశలో ల్యాండింగ్ విఫలమైనప్పటికీ ఆర్బిటర్ విజయవంతంగా పనిచేసి శేష గగనచార ప్రణాళికలకు మార్గదర్శిగా నిలిచింది. 2023లో చంద్రయాన్–3 విజయవంతంగా చంద్రునిపై దక్షిణ ధృవ ప్రాంతంలో ల్యాండింగ్ చేసి భారత ఖగోళ విజ్ఞానానికి ఒక చరిత్రాత్మక ఘట్టాన్ని చేర్చింది. భారత్ చంద్రునిపై విజయవంతంగా ల్యాండింగ్ చేసిన నాలుగో దేశంగా గర్వించదగిన స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం చంద్రునిపై నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, చైనా స్పేస్ ప్రోగ్రామ్, జపాన్, ఇస్రో వంటివి మానవ అన్వేషణకు సిద్ధమవుతున్నాయి. నాసా చేపట్టిన ఆర్టెమిస్ మిషన్ ద్వారా మళ్లీ మానవులను చంద్రునిపై పంపించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. చంద్రునిపై శాశ్వత స్థావరాలు, నీటి వనరులు, జీవవాస పరిస్థితులపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. భవిష్యత్ మానవ అంతరిక్ష ప్రయాణాల కోసం చంద్రుడు ప్రయోగశాలగా మారబోతున్నాడు. అంగారక గ్రహంపై మానవ యాత్రకు చంద్రుడు పునాది కూడా కాబోతున్నాడు.

చంద్రుడు కేవలం ఒక ఖగోళ వస్తువు కాదు. మానవతా కలల ఆకృతి. శాస్త్రజ్ఞుల పరిశోధనకు కేంద్రం. కవుల ఊహలకు ప్రతిరూపం. పురాణాల్లో శాంతి సంకేతంగా, తేజోమయమైన దేవతగా వెలుగొందింది. ఇప్పుడు మానవ విజ్ఞాన సాధనకు మార్గదర్శకంగా నిలుస్తోంది. అంతర్జాతీయ చంద్ర దినోత్సవం మానవ శ్రమ, సంకల్పానికి ఘన నివాళిగా, భవిష్యత్ శాస్త్రీయ పరిశోధనలకు ప్రేరణగా నిలుస్తోంది. ఇది మానవ జాతి ఏకత్వాన్ని, శాస్త్ర విజ్ఞాన శక్తిని, మరియు భవిష్యత్ స్వప్నాలను ప్రతిబింబించే వెలుగురేఖ. జూలై 20 చంద్ర దినోత్సవం కేవలం ఒక స్మారక రోజు కాదు – అది మానవత కోసం వెలిగే అక్షయ దీపం.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ %- 9440595494

చురకలు



# గుట్టుగా మట్టి దందా!

హుజూరాబాద్ : హుజూరాబాద్ మండలం కాట్రపల్లి గ్రామపరిధిలోని మాలకుంటలో మట్టిని అక్రమంగా తవ్వుతున్నారు. స్థానికంగా పలు నిర్మాణ పనులకు సంబంధించిన గుత్తేదారు, కొందరు గ్రామస్థులు కలిసి కుంటతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాలను పొక్లెయిన్లతో తోడుతున్నారు. దీన్ని ఆసరాగా మలుచుకుని మరికొందరు దళారులు టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పట్టణాల్లోని నిర్మాణాలకు విక్రయాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. వందల ట్రిప్పులు నిత్యం తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు అక్రమ తవ్వకాలు ఆపటం లేదు. వెలుగు పూటనే మట్టి తోడుతుండటంతో ఇందులో అధికారుల పాత్ర కూడా ఉందనే విమర్శలు వస్తున్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**రాత్రింబవళ్లు తవ్వకాలు**

రాత్రింబవళ్లు మట్టి తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు చెబుతున్నారు. మట్టి కోసం కుంటలను, ప్రభుత్వ స్థలాలను నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన తవ్వటంతో పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. రైతుల పొలాల్లోకి విద్యుత్తు సరఫరాకు మాలకుంటలోంచే సుమారు 20కి పైగా స్తంభాలు



వేశారు. ఆయా ప్రదేశాలను కూడా అక్రమార్కులు వదలటం లేదు. స్తంభాల చుట్టూ మట్టిని తోడుతున్నారు. వర్షాలు కురిసి కుంట నిండితే విద్యుత్తు స్తంభాలు నేలకొరిగే ప్రమాదం ఉంది. విద్యుత్తు సరఫరాలో అంతరాయంతో పాటు ప్రాణాలకు కూడా ప్రమాదమే. భీమదేవరపల్లి-హుజూరాబాద్ ప్రధాన రహదారి వెంట మట్టిని తరలిస్తుండటంతో రోడ్డంతా బురదమయంగా మారింది. వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు.

**స్పందించని అధికారులు**

కాట్రపల్లి గ్రామం నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని.. రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారుల అండతోనే స్థానిక గుత్తేదారు, ఇందిరమ్మ లబ్ధిదారులు మట్టిని తోడుతున్నట్లు ఆరోపిస్తున్నారు. అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, విద్యుత్తుశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కనకయ్యపే వివరణ కోరగా.. తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరిశీలించి సంబంధితశాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

# సేవల విస్తృతి.. అన్నదాతల ప్రగతి

సిరిసిల్ల,: ఏ రంగంలోనైనా ఐకమత్యమే బలమన్నది అందరికీ తెలిసిన సత్యం. దీనిని వ్యవసాయంలోని రైతులను ఒకటి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా ఎంపిక చేసిన పీఏసీఎస్ (ప్రాథమిక సహకార సంఘాలు)లను ఎఫ్‌పీవోలు (రైతు ఉత్పత్తిదారుల సంఘం)గా మార్చనున్నారు. మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాష్ట్రంలో ఎంపిక చేసిన ఎఫ్‌పీవోల నిర్వహణకు అవసరమయ్యే తొలివిడత నిధులను ఆయా సంఘాలకు అందజేశారు. ఉమ్మడి జిల్లాలో 1921లో కేడీసీసీబీని స్థాపించారు. దీని పరిధిలో 126 పీఏసీఎస్‌లు వీటిలో 3.97 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. పనితీరు, సామర్థ్యాన్ని బట్టి జిల్లాలవారీగా పీఏసీఎస్‌లను వడపోశారు. అందులో 41 ఎఫ్‌పీవోలను అనుమతించారు.

**ఇవీ ప్రయోజనాలు**

పీఏసీఎస్‌లో సభ్యులు ఎఫ్‌పీవోల్లోనూ చేరవచ్చు. సహకార సంఘాల్లో ఉన్నట్లు ఎన్నికల నిర్వహణ ఉండదు. కాకపోతే అక్కడ సభ్యత్వ రుసుము బదులు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇలా పెట్టుబడులన్నీ కలిపి ఒక ఎఫ్‌పీవో షేర్ క్యాపిటల్ రూ.15 లక్షలుగా ఉండాలి. దీనికి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) రూ.15 లక్షల నుంచి రూ.2





కోట్ల వరకు రుణం అందిస్తుంది.

వీటితో ఆయా ఎఫ్‌పీవోల సభ్యులు పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కొనుగోలు వాటి విక్రయాల ద్వారా ఆదాయం సమకూర్చుకుటారు. ఇవేకాదు.. పంట ఉత్పత్తుల విక్రయాలు.. ఆహార అనుబంధ పరిశ్రమల స్థాపించడంతోపాటు సొంతంగా వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకుంటూ విస్తరించే అవకాశం ఉంది.కొత్తగా ఏర్పాటు చేసుకునే ఎఫ్‌పీవోల మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చుకింద ఎన్‌సీడీసీ రూ.18 లక్షలు అందజేస్తుంది. దీనిలో మొదటి విడతలో ఒక్కో సంఘానికి రూ.3.16 లక్షల చొప్పున ఇచ్చారు. దీంతో కార్యాలయం ఏర్పాటుతో పాటు అందులో రికార్డుల నిర్వహణ, కంప్యూటర్ ఆపరేటర్‌ల నియామకంతోపాటు సభ్యులకు సిబ్బంది శిక్షణ కార్యక్రమాలకు వినియోగించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 41 సంఘాలకు నిర్వహణ నిధులు మంజూరయ్యాయి. సిరిసిల్లలో ఇల్లంతకుంట, వేములవాడ, నాంపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, చందుర్తి మండలం సనుగుల ఉన్నాయి. కోనరావుపేట మండలం మామిడిపల్లి, శ్రీరాములపల్లి, నాగారంలో 2000 సంవత్సరంలోనే మూడు ఎఫ్‌పీవోలు ఏర్పడ్డాయి. వీటిలో 1,559 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. మామిడిపల్లిలో తొలుత 40 మంది సభ్యులు 360 ఎకరాలతో ఎకరానికి రూ.వెయ్యి చొప్పున సభ్యత్వంతో రూ.3.60 లక్షలతో ఏర్పడింది. ప్రస్తుతం 529 మంది సభ్యులతో సంఘం టర్నోవర్ రూ.1.20 కోట్లకు చేరుకుంది.

# కాచుకో.. కాసులు నింపుకో



హైదరాబాద్: అనుమతుల్లేని.. అదనపు అంతస్తుల నిర్మాణాలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. ఇలాంటి వాటిపై పలువురు కార్పొరేటర్లు, అధికారులు, ఇతర వ్యక్తులు ఫిర్యాదు చేయడం, యజమానుల నుంచి డబ్బు వసూలు చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఎక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయో అని కాచుకు కూర్చుంటున్నారు. తరువాత వెళ్లి కాసులు వసూలు చేస్తున్నారు. 2026 ఫిబ్రవరితో జీహెచ్‌ఎంసీ పాలకమండలి గడువు పూర్తవనుండగా మిగిలిన ఆరు నెలల్లో.. అందినకాడికి దండుకోవాలని కొందరు కార్పొరేటర్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.

**నగరాభివృద్ధికి అడ్డు**

మరోవైపు అక్రమ నిర్మాణాలు నగరాభివృద్ధికి అడ్డుగా మారుతున్నాయి. ఇష్టానుసారం పుట్టుకొస్తున్న కట్టడాలతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ధ్వంసమవుతోంది. రహదారులు సరిపోవట్లేదు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని మౌలిక సౌకర్యాల కోసం ఖర్చు చేస్తున్నా నగర జీవన ప్రమాణాలు మెరుగుపడట్లేదు. అక్రమ నిర్మాణాలపై దాఖలవుతున్న కోర్టు కేసులను వేగంగా పరిష్కరించే టౌన్ ప్లానింగ్ ట్రిబ్యునల్ ఏర్పాటు, సమస్యను పునాదిలోనే అడ్డుకోగల ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతోనే (ఎస్‌టీఎఫ్) వీటికి అడ్డుకట్టపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ట్రిబ్యునల్ ఏర్పాటుకు చర్యలు**

టౌన్‌ప్లానింగ్ ట్రిబ్యునల్ ఏర్పాటుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో ఎవరెవరు ఉండాలి, ఛైర్మన్ నియామకం వంటి ప్రక్రియ పురోగతిలో ఉంది. మిగిలిన ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**కుప్పలుగా కేసులు**

బల్దియాలోని అన్ని విభాగాలకు సంబంధించిన కోర్టు కేసుల్లో 90శాతం టౌన్‌ప్లానింగ్ విభాగానివే. గత 15 ఏళ్లకు సంబంధించి 16 వేల కేసులు పెండింగులో ఉన్నాయి. న్యాయస్థానాలకు సరైన వివరాలు ఇవ్వకపోవడం, సమయానికి కౌంటరు దాఖలు చేయకపోవడం వంటి కారణాలతో ఈ సమస్య నెలకొంది. ఇదేంటని అడిగితే.. నగరంలో 150 డివిజన్లు ఉన్నాయని, అరకొర సిబ్బందితో కౌంటర్లు దాఖలు చేయలేకపోతున్నట్టు అధికారులు చెబుతున్నారు. సెక్షన్ అధికారులు, టీపీవోలు, ఏసీపీలు అరకొరగా ఉన్నారని, కొన్నిసార్లు కూల్చివేతలకు యంత్రాలు, సిబ్బందిని కూడా సమకూరడం లేదని వాపోతున్నారు.

**కనిపించని ఎస్టీఎఫ్**

గ్రేటర్‌లో అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను (ఎస్‌టీఎఫ్) నియమిస్తూ జి.ఓ.నం.200ను విడుదల చేశారు. జీహెచ్‌ఎంసీ కింద పని చేసిన ఈవీడీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులు, సిబ్బంది, యంత్రాలను ఎస్‌టీఎఫ్ సేవలకు ఉపయోగించుకోవాలని సూచించారు. తరువాత ఈవీడీఎం విభాగం జీహెచ్‌ఎంసీ నుంచి విడిపోయి హైడ్రాగా మారింది. ప్రస్తుతం టౌన్‌ప్లానింగ్ అధికారులే అక్రమ నిర్మాణాలకు నోటీసులిస్తున్నారు.

**గ్రేటర్ పరిధిలో**

ఏటా మంజూరయ్యే నిర్మాణ అనుమతులు: 15-16 వేలు

అనుమతి లేకుండా చేపట్టే నిర్మాణాలు: 15-20 వేలు

అక్రమ నిర్మాణాలపై పెండింగ్ కేసులు: 16 వేలు

అత్యధికంగా 1,500 కేసులు పెండింగులో ఉన్న ప్రాంతం: ఖైరతాబాద్ సర్కిల్

ఫిర్యాదులు ఎక్కువగా వచ్చే సర్కిళ్లు: శేరిలింగంపల్లి, చందానగర్, ఎల్బీనగర్, జూబ్లీహిల్స్, ఉప్పల్

# అనుబంధాలపై సామాజిక దాడి



గోదావరిఖని: ఇవి వివిధ ప్రాంతాల్లో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు.. సామాజిక మాధ్యమాల్లో ఏర్పడిన పరిచయాలు ప్రేమలు, వివాహేతర సంబంధాలకు దారితీస్తున్నాయి. తాము చేస్తున్నది తప్పు అన్న భావన లేకుండా అంతమొందిస్తూ మానవ సంబంధాలను తెంచుకుంటున్నారు. అనుబంధాలు, బంధుత్వాలు, మానవత్వం మరిచి విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తున్నారు.

ఒకే కుటుంబంలో పుట్టి పెరిగిన వారిలో కూడా బంధాల విలువ లేకుండా పోతోంది. చరవాణి వినియోగం ఎక్కువ కావడంతో పూర్తిస్థాయిలో అందులోనే మునిగిపోతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఏర్పడే పరిచయాలే సర్వస్వంగా మారిపోతున్నాయి. కనీస ముఖ పరిచయం లేని వారి కోసం కుటుంబసభ్యులను దూరం చేసుకుంటున్నారు. ప్రస్తుత యువత పెద్దలను పట్టించుకోకుండా తమకు తాముగా నిర్ణయాలు తీసుకొని సమస్యలు తెచ్చిపెట్టుకుంటున్నారు.

సామాజిక మాధ్యమంలో ఏర్పడిన పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. భర్త లేని సమయంలో ప్రియుడు ఇంటికి రాగా ఆ కుటుంబంలో చిచ్చుపెట్టింది. భార్యాభర్తలు దూరం కావడానికి కారణమైంది. ప్రేమకు అడ్డువస్తుందనే కారణంతో కనిపెంచిన తల్లిని కుమార్తె హత్య చేయించింది. వెన్నంటి ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకున్న తల్లినే అంతమొందించే స్థాయికి చేరింది. సామాజిక మాధ్యమంలో ఏర్పడిన పరిచయమే కారణంగా తేలింది.

సామాజిక మాధ్యమంలో రీల్స్ చేయవద్దని చెప్పినా వినడం లేదని కన్న కుమార్తెను తండ్రి తుపాకీతో కాల్చి చంపారు. ఈ సంఘటన ఇటీవల వెలుగుచూసింది.

**కలిగే అనర్థాలు**

మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి

ఆత్మగౌరవాన్ని ప్రభావితం చేస్తుంది

వ్యసనంగా మారుతుంది

నకిలీ వ్యక్తులతో మోసపోయే ప్రమాదం

**క్రూరత్వానికి దారి తీస్తుంది**

మానవ బంధాలపై ప్రభావం - ఎల్.రాజయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు, సీనియర్ సిటిజన్

సామాజిక మాధ్యమం మానవ బంధాలను దూరం చేస్తోంది. ఒకప్పుడు పెద్దలు బాగోగులు చూసేవారు. భవిష్యత్తుకు మార్గం చూపేవారు. ప్రస్తుతం ఎవరికి వారే పెద్ద అనుకుంటున్నారు. సామాజిక మాధ్యమాలనే విశ్వసిస్తున్నారు. అందులో పరిచయమైన వ్యక్తుల మాటలు వింటున్నారు. ఎదుటి వారి మాయమాటలకు మోసపోయి అనర్థాలకు పాల్పడుతున్నారు. దీని నుంచి బయటపడితేనే బంధాలు, నిలబడతాయి. **ప్రాథమిక స్థాయిలోనే పరిహరించాలి: కరుణాకర్, డీసీపీ, పెద్దపల్లి** సామాజిక మాధ్యమంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి సందేశం వచ్చిందంటే దానికి స్పందించాల్సిన అవసరం లేదు. ఒకవేళ తెలిసిన వ్యక్తి అయినా పంపించే సందేశాల్లో తేడా ఉంటే వెంటనే బ్లాక్ చేయాలి. లేదంటే స్వీయ రక్షణతో పాటు కుటుంబం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉంటుంది. ముందే గుర్తించి దూరంగా ఉంటే అనర్థాలకు దారి తీసే అవకాశం ఉండదు. కొన్ని కొన్ని సందర్భాల్లో తెలిసి కూడా స్పందిస్తుంటారు. చాలా తెలివిగా సమాధానం చెబుతున్నామనుకుంటారు. కాని ఎదుటి వ్యక్తి మనల్ని ప్రభావితం చేస్తున్నాడన్న విషయాన్ని గమనించరు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. సామాజిక మాధ్యమాల పట్ల జాగ్రత్తగా ఉండటం మంచిది.

# ఆసరా అందేదెన్నడో?

జగిత్యాల : పీఎఫ్ ఖాతాలో 2014 ఫిబ్రవరి 28 వరకు నమోదైనవారికే జీవనభృతి పింఛన్లను అందిస్తుండటంతో.. వేలాదిమంది బీడీ కార్మికులు తీవ్ర నిరాశలో ఉన్నారు. కటాఫ్ తేదీ తరువాత పీఎఫ్ కార్డు వచ్చినా.. ప్రభుత్వం పింఛన్‌కు పరిగణలోకి తీసుకోలేదు. మరోవైపు 2022 ఆగస్టులో కేవలం నిజామాబాద్ జిల్లాలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించినా.. ఇప్పటికి ఆ జిల్లాలో అమల్లోకి రాకపోగా ఇతర ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. గత భారాస రెండుసార్లు అధికారంలోకి వచ్చినా.. కటాఫ్ తేదీని ఎత్తివేయలేదు. తాము ఎత్తివేస్తామన్న కాంగ్రెస్ సర్కారు ఏర్పడి ఏడాదిన్నర గడచినా.. చర్యలు తీసుకోలేదు. దీంతో అర్హులైన వేలాదిమంది ప్రభుత్వ ఆసరాకు దూరమయ్యారు.

పింఛనులో జగిత్యాల రెండో స్థానం

ఆసరా పింఛను పొందుతున్న బీడీ కార్మికుల సంఖ్య రీత్యా జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉండగా.. రాజన్న సిరిసిల్ల నాలుగో స్థానంలో ఉంది. జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్ల, మెట్పల్లి, వేములవాడ, రాయికల్ తదితర ప్రాంతాల్లో బీడీ పరిశ్రమ ఆధారంగా వేలాదిమంది జీవనం సాగిస్తున్నారు. స్థానికంగా 45 వరకు బీడీ సంస్థలున్నాయి. ప్రస్తుతం బీడీలకు మార్కెట్లో గిరాకీ తగ్గడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేసి బీడీలు చుట్టేవారితోపాటుగా ఇతర కార్మికులకు పింఛను మంజూరివ్వాలని, తయారీకి తగినట్లు తునికాకు సరఫరా, ప్రధాని ఆవాస్ యోజనద్వారా ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల రాయితీ, ఈఎస్ఐ కార్మిక ఆసుపత్రి ద్వారా వైద్య సేవలందించాలని కార్మికులు కోరుతున్నారు.

నాలుగు జిల్లాల్లో మొత్తం బీడీ కార్మికులు: 2,01,427

బీడీ పరిశ్రమపై ఆధారపడిన టేకేదార్లు, ఇతరులు: 47,594

పింఛన్లు రావాల్సినవారు: 54,675

# శిథిలం.. జర పదిలం

వేములవాడ : వేములవాడ పట్టణంలో శిథిలావస్థకు చేరిన పాత భవనాలు భయపెడుతున్నాయి. జన సంచారం ఉండే ప్రాంతాల్లో ఇవి ఉండడంతో ఎప్పుడు కూలిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి కూల్చివేయాలని పురపాలక అధికారులకు విన్నవించినా నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారు. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు 22వ వార్డులో ఒక శిథిల భవనం కుప్పకూలింది సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి నష్టం సంభవించలేదు. అధికారులు శిథిల భవనాలను కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

**ఇవిగో ఆనవాళ్లు**

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో పురాతన బురుజుపై భారీ వృక్షాల పెరుగుదలతో ప్రమాదకరంగా మారింది. నైజాం కాలంలోని ఆ రాతి నిర్మాణంలో చెట్లు మరింత ఏపుగా పెరిగితే వాటి వేర్లు మరింత లోతుకు వెళ్లే అవకాశాలున్నాయని స్థానికులు తెలిపారు. చెట్ల వేర్ల వల్ల బురుజులోని కట్టడంలోని రాళ్లు పెకిలిపోయి, పూర్తిగా



కూలిపోయే వీలుందని చెబుతున్నారు. బురుజు చుట్టూ ఇళ్లు, పక్కనే పాఠశాలలున్నాయి. ప్రమాదం చోటుచేసుకోకముందే బురుజుపై పెరిగిన వృక్షాలను తొలగించి, మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. సిరిసిల్ల పట్టణంలోని తహసీల్ కార్యాలయ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆధార్ నమోదు కేంద్రం ఏ క్షణంలో కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తహసీల్ కార్యాలయం పక్కనే ఉద్యోగుల భవిష్యత్తు నిధి కార్యాలయం ఉండేది. ప్రస్తుతం అధ్వాన స్థితికి చేరుకున్నా.. ప్రభుత్వ కార్యాలయంగా నిర్వహిస్తున్నారు.

కోనరావుపేట మండలంలో కొలనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థలో కొనసాగుతోంది. భవనం గోడలు, శ్లాబు పగుళ్లుబారాయి. భవనం శ్లాబు, గోడలు పెచ్చులూడి కిందపడగా ఇనుప చువ్వలు తెలిపి ప్రమాదకరంగా మారింది. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో కొన్నిచోట్ల శిథిల నిర్మాణాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వర్షాలు కురిస్తే అవి కూలిపోయి నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది. వానాకాలం నేపథ్యంలో ఇటువంటి నిర్మాణాలను గుర్తించి తొలగింపజేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.సిరిసిల్ల అర్బన్, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట

# దోమల బాధ ఇంతింత కాదయా

సిరిసిల్ల : పారిశుద్ధ్యం పడకేసింది. డ్రైనేజీల్లో చెత్త చెదారంతో నిండిపోయి అధ్వానంగా మారాయి. వర్షాకాలం కావడంతో ఎక్కడ పడితే అక్కడ నీరు నిల్వ ఉంటుంది. దోమల నియంత్రణకు సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందు పడుతున్నారు. జానావాసాల మధ్య పిచ్చి మొక్కలు పెరిగి మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం కాగానే ఆరుబటయ నిలబడలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రజలకు దోమలు కుట్టి రోగాల బారిన పడుతూ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.

**39 వార్డులు.. పది ఫాగింగ్ మిషన్లు**

సిరిసిల్ల పట్టణంలో మొత్తం 39 వార్డులు ఉన్నాయి. సిరిసిల్ల పట్టణంతో పాటు విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అంతంత మాత్రమే ఉండటం, డ్రైనేజీల్లో చెత్తను తొలగించకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండడి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

39 వార్డులకు కేవలం పది ఫాగింగ్ యంత్రాలును వారానికి రెండు సార్లు వార్డుల చొప్పున ఫాగింగ్ చేస్తున్నామని అధికారులు చెప్తున్నప్పటికీ ఫాగింగ్ మాత్రం చేయడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

దోమల నివారణకి ప్రతి ఏటా ఫాగింగ్, స్ప్రేయింగ్, నివారణ మందులు, యంత్రాల మరమ్మతులకు, డీజిల్ తదితర వాటికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నప్పటికీ దోమల బెడద నుంచి పట్టణ వాసులకు బాధలు తప్పడం లేదు.

దోమల నియంత్రణకు అధికారులు క్షేత్ర స్థాయిలో కార్యచరణ చేపట్టడం లేదని, తూతూ మంత్రంగా ఫాగింగ్ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



వాతావరణంలో మార్పుల వల్ల ఇప్పటికే ప్రజలు జ్వరాల బారిన పడుతూ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. మరోవైపు దోమకాటుకు గురై డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితరాలు సోకే ప్రమాదం ఉన్నందున అధికారులు దోమల నియంత్రణ ఇప్పటికైనా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం: రవీందర్, సిరిసిల్ల

పూర్తి స్థాయిలో డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగు నిల్వ ఉంటోంది. వర్షాకాలం కావడంతో మరింత నీరు చేరి దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగి ఇళ్లలోకి వస్తున్నాయి. వార్డుల్లో ఫాగింగ్ చేపట్టడంతోపాటు పకడ్బందీ డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలి.

**అవగాహన కల్పిస్తున్నాం: ఖదీర్ పాష, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్**

ప్రతి వార్డులో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేస్తున్నాం. డ్రైనేజీల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ చల్లుతున్నాం. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

# కన్నేసి.. పదెకరాలు మింగేసి



మొయినాబాద్ : సుమారుగా రూ.250 కోట్ల విలువ చేసే సర్కారు భూమి అది.. అక్కడ ఎకరం రూ.25కోట్ల వరకు పలుకుతోంది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారికి ఆనుకొనే ఈ భూమి ఉండటంతో.. ఓ స్థిరాస్తి వ్యాపారి ఏకంగా పది ఎకరాలను కబ్జా చేయడంతోపాటు చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. విలువైన సర్కారు భూమిని తన కబంధ హస్తాల్లోకి తీసుకోవడమే కాకుండా.. రాత్రింబవళ్లు చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు కొనసాగిస్తుండటం స్థానికంగా కలకలం రేపింది. హైదరాబాద్ శివారు మొయినాబాద్ పురపాలిక అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 176లో 220 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ఇందులో ఇప్పటికే 150 ఎకరాలను సమీకృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్‌కు కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రెవెన్యూ అధికారులు దస్త్రాన్ని ప్రభుత్వానికి పంపించారు. ఇదే సమయంలో హైదరాబాద్‌కు చెందిన ఓ స్థిరాస్తి వ్యాపారి కన్ను ఇక్కడి సర్కారు భూములపై పడింది. అనుకుందే తడవుగా జాతీయ రహదారికి ఆనుకొని పదెకరాలను కబ్జా చేశాడు. బాహ్య వలయ రహదారికి కేవలం 3 కిలోమీటర్ల సమీపంలోనే ఉండటంతో ఇక్కడి భూములకు మంచి డిమాండ్ ఉంది. ఎలాంటి పత్రాలు లేకుండానే స్థిరాస్తి వ్యాపారి దర్జాగా రూ.250 కోట్ల విలువ చేసే సర్కారు స్థలాన్ని కబ్జా చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**కదిలిన రెవెన్యూ యంత్రాంగం**

మొయినాబాద్ రెవెన్యూ యంత్రాంగం దృష్టంతా ప్రస్తుతం ఎన్కేపల్లిలోని సర్వేనంబరు 180లోని 99.14 ఎకరాల గోశాల భూములపైనే ఉంది. ఇక్కడి భూ బాధితుల పరిహారం విషయంలో తీరిక లేకుండా ఉన్నారు. ఇది విచారణ దశలో ఉండగా అజీజ్‌నగర్ భూములపై కన్నుపడిన అక్రమార్కుడు ఏకంగా భూమిని కబ్జా చేయడం గమనార్హం. విలువైన సర్కారు భూమి కబ్జాకు గురవుతోందని సమాచారం అందుకున్న మొయినాబాద్ తహసీల్దార్ కె.గౌతంకుమార్ నేతృత్వంలో రెవెన్యూ యంత్రాంగం బుధవారం వేగంగా కదలింది. కబ్జాకు గురవుతున్న రూ.250కోట్ల సర్కారు భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు.. ప్రహరీ నిర్మాణాన్ని తొలగించారు. కబ్జాకు పాల్పడిన స్థిరాస్తి వ్యాపారి వివరాలు సేకరించారు. అక్రమార్కునిపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దార్ గౌతంకుమార్ 'ఈనాడు'కు వివరించారు. భూములను స్వాధీనం చేసుకున్నట్లు, అక్కడ ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

# అందుబాటు ధరల్లో రాజీవ్‌స్వగృహ ఫ్లాట్లు

హైదరాబాద్: నగరంలోని బండ్లగూడ, పోచారం ప్రాంతాల్లోని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఫ్లాట్లు ప్రజలకు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి. మార్కెట్ కంటే దాదాపు 40 శాతం తక్కువ ధరలే ఉండటంతో చాలామంది ఆసక్తి కనపరుస్తున్నారని ఎస్‌ఈ సి.భాస్కర్‌రెడ్డి తెలిపారు. నాగోల్ బండ్లగూడలోని 159 ఫ్లాట్లకు, పోచారంలోని 601 ఫ్లాట్ల విక్రయానికి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. బహిరంగ మార్కెట్‌లో చ.అడుగు విస్తీర్ణం ధర రూ.4–6 వేల వరకు పలుకుతోందని అధికారులు తెలిపారు. అంతకంటే తక్కువ (సుమారు 40శాతం)ధరల్లో రూ.2.5 – 3 వేలల్లోనే



వస్తుందన్నారు. బండ్లగూడ ప్రాజెక్టుకు దరఖాస్తులను ఈనెల 29 వరకు స్వీకరించి 30న లాటరీ తీస్తామని, పోచారం ప్రాజెక్టు దరఖాస్తులను 31 వరకు స్వీకరించి, ఆగస్టు 1న లాటరీ ద్వారా ఇళ్లను కేటాయిస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 60మంది బ్యాంకుల్లో డీడీలు కట్టారని, దరఖాస్తులు సమర్పించారని తెలిపారు.

# ఆర్థిక మోసంలో నిందితుడి 14 ఎకరాలు జప్తు

హైదరాబాద్: కొత్త నేర న్యాయ చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత సైబరాబాద్ పోలీసులు తొలిసారిగా ఓ ఆర్థిక నేరంలో నిందితుడు అక్రమంగా కూడగట్టిన ఆస్తుల్ని జప్తు చేశారు. కూకట్‌పల్లి కోర్టు న్యాయమూర్తి రాచర్ల శాలిని ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 14 ఎకరాల భూమిని జప్తు చేశారు. ఆర్థిక నేరంలో భారీ మొత్తంలో ఆస్తిని స్వాధీనం చేసుకోవడం అరుదు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్‌ను సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి అభినందించారు. మాదాపూర్ డీసీపీ జి.వినీత్ ప్రకటనలో వివరాలు వెల్లడించారు.

**అధికార దుర్వినియోగం**

గచ్చిబౌలి పరిధిలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేసే ఉద్యోగి మరికొందరితో కలిసి సరకు రవాణా ఛార్జీలు పెంచినట్లు నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించాడు. ఫలితంగా ప్రైవేటు కంపెనీకి రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. ఈ అక్రమార్జనతో వచ్చిన డబ్బును నిందితుడు తన బంధువులు, స్నేహితుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసి ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలంలోని కలగర, చందుపట్ల, విస్సన్నపేట గ్రామాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో 14 ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. ఈ ఆస్తులను ఇతరుల పేర్లతోనూ రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ వ్యవహారాన్ని గుర్తించిన సదరు ప్రైవేటు కంపెనీ గచ్చిబౌలి ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్, ఎస్ఐ అనిల్‌కుమార్ దర్యాప్తు చేయగా.. నిందితులు అవకతవకలకు పాల్పడ్డట్లు తేలింది. వచ్చిన డబ్బుతో ఏయే ప్రాంతాల్లో స్థిరాస్తులు కొనుగోలు చేశాడో గుర్తించి ఆధారాలతో సహా కూకట్‌పల్లి కోర్టుకు నివేదించారు. బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 107 ప్రకారం.. ఆస్తులను జప్తు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. పరిశీలించిన న్యాయమూర్తి ఇందుకు అనుమతిస్తూ తాజాగా ఆదేశాలిచ్చారు. పోలీసులు ఆస్తుల్ని అటాచ్ చేశారు.

# ఏకీకృత భవన నియమావళిపై కసరత్తు

హైదరాబాద్: ఏకీకృత భవన నియమావళి(యూనిఫైడ్ డెవలప్‌మెంట్ అండ్ బిల్డింగ్ రూల్స్)పై హెచ్ఎండీఏ కసరత్తు షురూ చేసింది. విధివిధానాల రూపకల్పనకు ఇప్పటికే కన్సల్టెంట్ నియమించేందుకు టెండర్లు ఆహ్వానించింది. త్వరలో పూర్తి స్థాయిలో కార్యచరణ ప్రారంభం కానుంది. అన్ని ప్రాంతాల్లో ఒకే తరహా బిల్డింగ్ కోడ్‌ను అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం హెచ్ఎండీఏకు బాధ్యత అప్పగించింది.

**వివిధ నగరాల్లో అధ్యయనం చేసి..**

దిల్లీ, ముంబయి, నయా రాయపూర్, చండీగఢ్ తదితర పట్టణాలతో పాటు విదేశాల్లోని పలు నగరాల్లో ఉన్న నియమ నిబంధనలను అధ్యయనం చేసి త్వరలో ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ నిబంధనలను హేతుబద్ధీకరణ, సరళీకృతం చేసే ఉద్దేశంతో కొత్త కోడ్‌కు రూపకల్పన చేసేందుకు కసరత్తు ప్రారంభించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. హెచ్ఎండీఏ 10 వేల చదరపు కిలోమీటర్లతో 11 జిల్లాల్లో విస్తరించి ఉంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో లేఅవుట్లు, భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతులు మంజూరు చేస్తోంది. హెచ్ఎండీఏ పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో జి ప్లస్ 5 ఫ్లోర్లు దాటితే హెచ్ఎండీఏ నుంచి అనుమతులు తీసుకోవాలి. మిగతా వాటికి కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు ఇస్తున్నాయి. జిల్లా స్థాయిలో డైరెక్టరేట్ కంట్రీ అండ్ టౌన్‌ప్లానింగ్(డీటీసీపీ)



అనుమతులు జారీ చేస్తోంది. ఇలా రెండు సంస్థలు అనుమతులు మంజూరు చేయడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు పేర్కొంటున్నారు. అనుమతుల్లో సైతం జాప్యం జరుగుతున్నట్లు చెబుతున్నారు.

**కొత్త విధానంలో....**

పంచాయతీల నుంచి నగరాల వరకు ఒకే తరహా కోడ్ అమలు చేయనున్నారు. ప్రస్తుతం వేర్వేరుగా ఉన్న హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతుల విధానం ఒకే తీరుగా ఉండనున్నాయని చెబుతున్నారు.

భవనాల నిర్మాణంలో ఓపెన్ స్పేస్, సెట్‌బ్యాక్, అంతర్గత రోడ్లు, పార్కింగ్ ఇతర మౌలిక వసతుల కల్పనలో ఒకే విధానం తేనున్నారు. ఇక గ్రౌండ్ కవరేజ్(భవనం నిర్మించే స్థలం)పై కూడా ఆంక్షలు ఉన్నాయి. 1000 గజాల్లో 50 శాతం గ్రౌండ్ కవరేజ్ ఉంటే.. అంత మేరకు స్థలం విడిచిపెట్టాలి. పెద్ద భవనాల విషయంలో వర్టికల్ మిక్స్ విధానం అమలు చేసే అవకాశం ఉంటుంది. ఒకే భవనంలో నివాస, వాణిజ్య కార్యకలాపాలను అనుమతించనున్నారు. ట్రాన్సిట్ ఓరియంటెడ్ డెవలప్‌మెంట్ కేంద్రాలు గుర్తించనున్నారు. మెట్రో, ఎంఎంటీఎస్, బీఆర్‌టీఎస్ లాంటి ప్రజా రవాణాకు అనుగుణంగా ఉన్న ఈ ప్రాంతాల్లో ఫ్లోర్ ఏరియా రేషియో పెంచనున్నారు.

# రూ.25కే విద్యుత్తు బిల్లులపై పేరు మార్పు



హైదరాబాద్ : రాజశేఖర్ నాగోల్‌లో ఐదేళ్ల క్రితం ఒక ఫ్లాట్ కొనుగోలు చేశారు. అప్పుడే రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. విద్యుత్తు బిల్లుపై యజమాని పేరు మార్చుకోకపోవడంతో (టైటిల్ ట్రాన్స్‌ఫర్) ఇటీవల వరకు బిల్డర్ పేరు మీదనే వచ్చింది. పేరు మార్చుకోవడం పెద్ద తతంగమని భావించి ఇన్నాళ్లు వదిలేశారు. గత నెలలో ఇందుకు అవసరమైన పత్రాలు సమర్పించడంతో రోజుల వ్యవధిలోనే టైటిల్ ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ పూర్తయింది.

గోపాల్ ఇటీవలే కొత్త ఫ్లాట్‌లోకి దిగారు. టైటిల్ ట్రాన్స్‌ఫర్ కోసం పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని బ్రోకర్‌ను సంప్రదించి రూ.మూడువేలు ఇచ్చారు. వాస్తవంగా విద్యుత్తు సంస్థకు చెల్లించాల్సింది రూ.25 మాత్రమే.

**ఇద్దరి పేరున ఉంటే.. .**

ఫ్లాట్ భార్యాభర్తల పేరు మీద ఉంటే కరెంట్ బిల్లును సాధారంగా ఎవరో ఒకరి పేరుపై మార్చుకోవడానికి దరఖాస్తు చేస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో రెండో వ్యక్తి ఎన్వోసీ ఇవ్వాలి. రూ.10ల నాన్ జ్యుడీషియల్ బాండ్‌పేపరుపై ఎన్వోసీ ఇవ్వాలి. ఈ ఫార్మాట్ సైతం ఆన్‌లైన్‌లో ఉంది.

ఇంటి యజమాని చనిపోయిన సందర్భంలో మరణ ధ్రువ పత్రం.. వారి వారసులు వారసత్వ ధ్రువీకరణ పత్రం సమర్పించి పేరు మార్చుకోవచ్చు అని విద్యుత్తు అధికారులు తెలిపారు. అవసరమైన ఈ పత్రాలన్నీ అప్‌లోడ్ చేశాక అప్లికేషన్ ఫీజు రూ.25 ఆన్‌లైన్‌లోనే చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఇంత సులభమైన ప్రక్రియ ఉండగా చాలామంది దళారుల మాటలు నమ్మి వేల రూపాయలు సమర్పించుకుంటున్నారు.

**ఈ మూడు చాలు..**

రిజిస్టర్డ్ సేల్ డీడ్/గిఫ్ట్ డీడ్, వ్యక్తిగత గుర్తింపు పత్రం, రూ.100 నాన్ జుడీషియల్ స్టాంప్ పేపరుతో కూడిన ఇండెమ్నిటీ బాండ్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. బాండ్ ఫార్మాట్ కూడా అక్కడే ఉంటుంది. డౌన్‌లోడ్ చేసుకుని అందులో ఉన్న విధంగా సమర్పించాలి.

గుర్తింపు పత్రం జేపీజీ/పీఈజీ రూపంలో ఉండాలి. వీటి సైజు 100కేబీ లోపు, ఇండెమ్నిటీ బాండ్ పీడీఎఫ్ రూపంలో 500కేబీ లోపు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ పీడీఎఫ్ 5 ఎంబీ లోపు సైజు ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. అన్ని పత్రాలపై సంతకం తప్పనిసరి. ఆ తర్వాతే అప్‌లోడ్ చేయాలి.

**ఇలా చేసుకోవాలి..**

టీజీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లాక 'కన్స్యూమర్ సర్వీసెస్'పై నొక్కితే పలు సేవలు కన్పిస్తాయి. అందులో సర్వీస్ రిక్వెస్ట్ విండోపై క్లిక్ చేయాలి. మీ బిల్లుపై ఉండే యూనిక్ సర్వీస్ నెంబరు, మొబైల్ నెంబరు ఇస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేయగానే అక్కడ అందించే సేవలు కన్పిస్తాయి. వాటిలో టైటిల్ ట్రాన్స్‌ఫర్, చిరునామా మార్పు, అదనపు లోడు, లైన్ల మార్పు, కేటగిరి మార్పు వంటివి ఉంటాయి. టైటిల్ ట్రాన్స్‌ఫర్‌పై క్లిక్ చేసి అవసరమైన మూడు పత్రాలను అప్‌లోడ్ చేయాలి.

# కన్నేస్తారు.. చంపేస్తారు.. హైదరాబాద్‌లో రెచ్చిపోతున్న భూమాఫియా



హైదరాబాద్: నగరంలో భూముల ధరలు విపరీతంగా పెరుగుతుండగా.. అదే స్థాయిలో భూ మాఫియా అరాచకాలు ఉంటున్నాయి. వివాదాస్పద భూములు, ఖరీదైన ప్రాంతాల్లో ఖాళీ స్థలాల మీద కన్నేసి దారుణాలకు తెగబడుతున్నారు. నకిలీ పత్రాలు సృష్టించడం, యజమానులకే తెలియకుండా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించడం, పేదల స్థలాలు కబ్జా చేయడం సాధారణంగా మారింది. ఎవరైనా అడ్డు తగిలితే దాడులు, కిడ్నాప్‌లు, హత్యలతో భయపెడుతున్నారు. తాజాగా మలక్‌పేట ఠాణా పరిధిలో సీపీఐ నాయకుడి హత్య భూవివాదం నేపథ్యంలో జరిగిందని దర్యాప్తులో తేలింది. గతేడాది జీడిమెట్లకు చెందిన రియల్టర్ కర్ణాటకలో హత్యకు గురయ్యాడు.

**మూడో వంతు హత్యలివే**

మూడు కమిషనరేట్లలో ఏటా సగటున 200లకు పైగా హత్య కేసులు నమోదవుతున్నాయి. అందులో డబ్బు, భూములు, అక్రమ సంబంధాలు తదితర కారణాలతో ఎక్కువగా జరుగుతున్నాయి. మొత్తంగా మూడోవంతు హత్యలకు భూవివాదాలే కారణంగా మారుతున్నట్లు పోలీసులు విశ్లేషిస్తున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో గజం రూ.2 లక్షలకుపైగా పలుకుతోంది. దీంతో కొందరు రియల్టర్లు, రౌడీషీటర్లు, పాత నేరస్థులు భూ మాఫియాకు పాల్పడుతున్నారు.

**ఇదో వ్యవస్థీకృత మాఫియా**

భూ మోసాల వెనుక వ్యవస్థీకృత మాఫియా ఉంటోంది. ఖాళీ స్థలాలు, ప్రవాసుల భూములు గుర్తించడం నుంచి ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించే వరకూ పద్ధతి ప్రకారం జరుగుతుంది. కొందరు రియల్టర్లు కేవలం వివాదంలో ఉన్న భూముల్ని తక్కువ ధరకు కొని.. ఆ తర్వాత సక్రమం చేసి ఇతరులకు విక్రయిస్తున్నారు. ఈ తరహా భూముల విషయంలోనే ఎక్కువ గొడవలు జరుగుతున్నాయి. రెండేళ్ల క్రితం ఇబ్రహీంపట్నంలో జంట హత్యలకు వివాదాస్పద భూమి కొనుగోలు చేయడమే కారణమని పోలీసులు తేల్చారు. ఎవరైనా ఠాణా మెట్టెక్కితే సివిల్ తగాదాలంటూ పోలీసులు ఫిర్యాదులు తీసుకోవడం లేదు.

**మచ్చుకు ఉదాహరణలు**

గతేడాది నార్సింగిలో భూ వివాదంలో జోక్యం చేసుకున్న ఎమ్మార్పీఎస్ నాయకుడిని పాతబస్తీకి సుజాతలీఖాన్ తన గ్యాంగ్‌తో కిడ్నాప్ చేయించాడు. శంషాబాద్ దగ్గర ఫాంహౌజ్‌లో బంధించి నరకం చూపించారు. భూ తగాదాలు, ఇతర గొడవలు జరిగితే కిడ్నాప్ చేసి ఫాంహౌజ్‌లో బంధించి చిత్రహింసలు పెడుతున్నట్లు తేలింది.

రెండేళ్ల క్రితం ఇబ్రహీంపట్నంలో ఇద్దరు రియల్టర్లను సుపారీ గ్యాంగ్ కాల్చి చంపిన ఘటన సంచలనం రేపింది. భూ వివాదంలో ప్రతీకారం పెంచుకున్న రియల్టర్.. అవతలి వ్యక్తుల్ని హత్య చేయించాడు.

# ఇంటికో ఇంకుడు గుంత

హైదరాబాద్: నగరంలో భూగర్భజలాలు పెంచడమే లక్ష్యంగా ఇంటికో ఇంకుడు గుంత నిర్మాణానికి జలమండలి శ్రీకారం చుట్టింది. ఇందుకు 90 రోజుల ప్రత్యేక కార్యాచరణను ప్రారంభిస్తున్నట్లు జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి ప్రకటించారు. 200 గజాలు అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలోని ఇళ్లలో విధిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. 300 గజాలు అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణం ఉంటే ఇంకుడు గుంత తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయన్నారు. నిబంధనల మేరకు 300 గజాలు పైబడిన 42 వేల నివాసాల్లో ఇంకుడు



గుంతలు నిర్మించాల్సి ఉండగా ఇప్పటికి 12 వేల ఇళ్లల్లో నిర్మాణం, పునర్నిర్మాణం జరిగిందని, మరో 16 వేల మందికి నోటీసులు జారీ చేస్తామన్నారు. వీటి నిర్మాణానికి ఇదే సరైన సమయమన్నారు. ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని బుక్ చేసిన 24 గంటల్లో సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. వేసవిలో రోజుకు 11వేల ట్యాంకర్లు సరఫరా చేయగా ఇప్పుడు 8500 డిమాండ్ ఉందని వివరించారు.

# జూనియర్ కళాశాలల బాగుకు నిధులు

మల్యాల: జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వివిధ మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ సంచాలకులు ఈ మేరకు ఆయా కళాశాలలకు ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాలల్లో గదుల మరమ్మతు, విద్యుదీకరణ, శానిటేషన్, నీటి సరఫరా తదితర మరమ్మతు పనులకు అధికారులు రూ.1,08,33,000 అంచనా వ్యయం రూపొందించగా.. మొదటి విడతగా 25 శాతం నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. కొన్ని మండలాల్లో కళాశాలల భవనాలు దాదాపు 35 ఏళ్ల క్రితం నిర్మించటంతో తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మల్యాల జూనియర్ కళాశాలలో పలు గదుల ద్వారాలు, కిటికీలు చెదలు పట్టి చెడిపోయాయి. ప్రిన్సిపల్ చొరవతో ఇటీవల కొన్ని ఇనుప



ద్వారాలు, తలుపులు, కిటికీలు ఏర్పాటు చేశారు. కిటికీల అద్దాలు పగిలిపోవడంతో జాలీలు అమర్చారు. పలు గదుల్లో విద్యుత్తు తీగలు సరిగ్గా లేవు. **అమ్మ ఆదర్శ పాఠశాల నిబంధనల ప్రకారం పనులు: – శివరామకృష్ణ, మల్యాల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పాటించిన నిబంధనల ప్రకారమే కళాశాలలో మరమ్మతు పనులు చేపడతాం. ఇంజినీరింగ్ అధికారుల కొలతలు, సూచనల ప్రకారం పనులు జరుగుతాయి. శిథిలావస్థకు చేరిన గదుల మరమ్మతుతో పాటు విద్యుత్తు, తాగునీటి వసతి కల్పించడానికి కృషి చేస్తాం. పనికిరాకుండా పోయిన ద్వారాలు, కిటికీలు తొలగించి కొత్తవి అమర్చేలా చూస్తాం.

# వరద ముప్పు.. మురుగు కంపు

గోదావరిఖని : అంతర్గత కాలువల్లో మురుగు తొలగించకపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలవడంతో దుర్గంధంతో పాటు దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నగరపాలికలోని కాలనీల్లో ఉపరితల మురుగు కాలువలు మట్టి, చెట్ల పొదలతో నిండిపోగా ఆనవాళ్లు కనిపించని పరిస్థితులు నెలకొన్నాయి. పునర్విభజనతో నగరపాలికలోని నాలుగో డివిజన్‌లో నర్రశాలపల్లి, మల్కాపూర్, శ్రీనగర్ కాలనీ, సప్తగిరి కాలనీతో పాటు పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో నివాసాలున్నాయి. అయిదో డివిజన్ పవర్‌హౌస్ కాలనీలో అత్యధికంగా సింగరేణి క్వార్టర్లతో పాటు కొన్ని ప్రైవేటు కట్టడాలున్నాయి.

నగరపాలక నాలుగో డివిజన్‌లోని మల్కాపూర్, ప్రశాంత్‌నగర్ ప్రాంతాలు గోదావరికి సమీపంలో ఉండడంతో వరద ముంపు పొంచి ఉంది. గతంలో మల్కాపూర్, ప్రశాంత్‌నగర్ కాలనీలను వరదలు ముంచెత్తగా ప్రజలు బయటకు పరుగెత్తాల్సి వచ్చింది. మల్కాపూర్‌లో అత్యధికంగా వ్యవసాయ ఆధారిత కుటుంబాలున్నాయి. పొలాల్లోకి వెళ్లే రహదారి బురదమయం కావడంతో పాటు మధ్యలో వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెన ఇరుకుగా ఉండడం, రక్షణ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో వరద ఉద్ధృతంగా పారితే వంతెన చివరలు కనిపించడంలేదు. ఇప్పటివరకు నలుగురు మృతి చెందగా పశువులు సైతం కొట్టుకుపోయాయి.

గోదావరి ఒడ్డున నగరపాలిక పంపుహౌస్‌తో పాటు డంపింగ్ యార్డునకు వెళ్లేందుకు సైతం ఇదే ప్రధాన రహదారి. భారీ వర్షాలు కురిస్తే రైతులు గంగానగర్‌నుంచి తిరిగి రావాల్సి వస్తుంది. ప్రశాంత్‌నగర్‌లోని ప్రధాన మురుగు కాలువ దుర్గంధాన్ని వెదజల్లుతోంది. గతంలో వరదలు వచ్చినప్పుడు కాలనీ పూర్తిగా ముంపునకు గురైంది. కరకట్ట నిర్మాణంతో ముంపు నుంచి తప్పించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు. మల్కాపూర్‌లోని ఓ కాలనీలో వీధి దీపాలు లేక అంధకారం నెలకొంది. సుమారు రూ.5 కోట్ల అంచనాతో మల్కాపూర్‌లో చేపట్టిన అంబేడ్కర్ విజ్ఞాన కేంద్ర భవన నిర్మాణం నిధుల లేమితో పునాదులకే పరిమితమైంది. ఎన్టీపీసీ ప్రహరీ వరకు నిర్మించిన ఉపరితల మురుగు కాలువను మల్కాపూర్‌లో పూర్తిగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

చురకలు



## వనం.. భాగమవుదాం మనం

శ్రీరాంపూర్ : కార్మికక్షేత్రాన్ని పచ్చనివనాలతో తీర్చిదిద్దాలని యాజమాన్యం కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగానే ప్రతి ఏటా రికార్డు స్థాయిలో మొక్కలు నాటుతూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ ఏడాది నిర్వహించే వన మహోత్సవంలో కంపెనీ వ్యాప్తంగా 670 హెక్టార్లలో 45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొక్కలు నాటి, రక్షణకు యాజమాన్యం రూ.33 కోట్లు ఖర్చు చేస్తోంది.

**అంతరిస్తున్న వృక్షజాతులు అందుబాటులోకి..**

రాష్ట్రంలో కనుమరుగవుతున్న వృక్ష జాతులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీల్లో నారేప, జిట్రేగి, మారెడు, ఉసిరి, నేరేడు, నెమలినార, బూరుగ, మేడి, తెల్ల చిందుగా, ఎర్రచందనం, జువ్వి, రావి, టేకు, తాని, బట్టఘనము వంటివి సిద్ధం చేస్తున్నారు. వీటితోపాటు వివిధ రకాల పండ్లు, పూల మొక్కలు అందుబాటులో ఉంచారు. వీటిని యాజమాన్యం స్వయంగా నాటి మరికొన్నింటిని కార్మిక కుటుంబాలు, సమీప గ్రామాల ప్రజలకు పంపిణీ చేయనున్నారు. ఈ ఏడాది సింగరేణి వ్యాప్తంగా నర్సరీల్లో సుమారు



కోటి మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

సింగరేణి సీఎండీ ఎన్.బలరాం రికార్డు స్థాయిలో మొక్కలు నాటుతూ ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ నుంచి గ్రీన్ ఛాలెంజ్ స్వీకరించిన ఆయన సుమారు 20 వేలకు పైగా మొక్కలు నాటారు. ఆయన పేరిట శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గని సమీపంలో 'బలరాం వనం' ఏర్పాటు చేశారు. ఏరియాలో ఆయన సందర్శించిన ప్రతిసారి నాటిన మొక్కలు సందర్శిస్తూ వాటి రక్షణకు తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ ఏడాది ఉద్యోగులతో కలసి మరిన్ని మొక్కలు నాటేందుకు సిద్ధం అవుతున్నారు.

**బెల్లంపల్లి రీజియన్‌లో..**

బెల్లంపల్లి రీజియన్‌లోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లో 10 లక్షలకు పైగా మొక్కలు నాటాలని యాజమాన్యం నిర్ణయించింది. 139 హెక్టార్లలో వీటిని నాటనున్నారు. 'నీటి బిందు -జల సింధు'లో భాగంగా ఇటీవల నిర్మించిన కొత్త చెరువులు, వృద్ధి చేసిన చెరువుల వద్ద, ఉపరితల గనుల డంప్ యార్డులు, కాలనీలు, ఖాళీ ప్రదేశాలు వీటిని నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## చేరువలో.. దూర విద్య!


కాగజ్‌నగర్ : ప్రస్తుతం ఉద్యోగం, ఉద్యోగోన్నతి, ఉపాధి, తదితర అవకాశాలకు డిగ్రీ అనేది సాధారణంగా మారింది. ఉన్నత విద్యకు తోడు లేనివారికి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో రోజూ తరగతులకు హాజరు కాలేకపోవడం, అధిక ఫీజులు భరించలేకపోవడం తదితర సమస్యలను అధిగమిస్తూనే డిగ్రీ పూర్తి చేసేందుకు దూర విద్యావిధానం అందుబాటులో ఉంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాలున్నాయి. ఇంటర్, సమాన విద్యార్హతతో ఓపెన్ డిగ్రీలో ప్రవేశం పొందవచ్చు. బీఏ, బీకాం, బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ బీజడ్‌సీ తదితర గ్రూపుల్లో నచ్చిన దాన్ని ఎంచుకుని మూడేళ్లలో డిగ్రీ కోర్సును పూర్తి చేయొచ్చు. విద్యార్థులు తమకు నచ్చిన కోర్సును ఎంచుకుని, 60 శాతం ఆన్‌లైన్, 40 శాతం ఆఫ్‌లైన్‌లో వారాంతంలో తరగతులకు హాజరవుతూనే డిగ్రీ చేయవచ్చు.

**సాధారణ డిగ్రీ మాదిరిగానే..**

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి పొందిన డిగ్రీ పట్టా సాధారణ డిగ్రీ మాదిరిగానే పనిచేస్తుంది. ఓపెన్ డిగ్రీ చేసిన తర్వాత వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చు. యూపీపీఎస్సీ పరీక్షలు నిరభ్యంతరంగా రాయొచ్చు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నవారు ఉద్యోగోన్నతి కోసం డిగ్రీ అర్హతను ఉపయోగించుకోవచ్చు.

**దరఖాస్తు ఇలా**

2025-26 విద్యాసంవత్సరానికి గాను ఈ నెల 13వ తేదీ నుంచి



అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆగస్టు 13 వరకు కొనసాగుతుంది. %https:///www.braou.ac.in% వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం పూర్తి చేయాలి. అడ్మిషన్ ఫీజు రూ.3,300 చెల్లించి, అవసరమైన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసి ప్రింట్ తీసుకోవాలి. ఎంపిక చేసుకున్న అధ్యయన కేంద్రంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం నిజ ధ్రువపత్రాలతో హాజరుకావాలి. పుస్తకాల కోసం స్టడీ సెంటర్‌లో రూ.500 చెల్లించాల్సి ఉంటుంది.

**సద్వినియోగం చేసుకోవాలి**

కళాశాలకు వెళ్లి రెగ్యులర్ డిగ్రీ చదువుకునే అవకాశం లేని వారు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందజేస్తున్న కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసి స్టడీ సెంటర్‌లో నిజ ధ్రువపత్రాలతోపాటు జిరాక్సు ప్రతులతో సంప్రదించాలి. యూనివర్సిటీ నిర్దేశించిన ప్రకారం స్టడీ సెంటర్‌లో తరగతులుంటాయి. తూడూరు దత్తాత్రేయ, స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్, కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

## పొంచి ఉన్న ముంపు.. ఎవరిదీ తప్పు!



గోదావరిఖని : వర్షాకాలం ముంచుకొస్తున్నప్పటికీ నగరంలోని ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనుల్లో జాప్యం నెలకొంది. దీంతో భారీ వర్షాలు కురిస్తే కొన్ని కాలనీల్లో ముంపు తప్పదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా వేసవిలోనే ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులను పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ వివిధ కారణాలతో జాప్యం చేస్తున్నారు. కొత్తగా రూపొందించిన నిబంధనల ప్రకారంగా ప్రధాన మురుగు కాలువల పూడికతీతకు నాలుగుసార్లు టెండర్లు నిర్వహించగా.. గుత్తేదార్ల నుంచి స్పందనలేదు. ఇటీవల ఐదోసారి పిలవగా ఒకే ఒక్కరు ముందుకు వచ్చారు. అయితే పనులు ఇంకా ప్రారంభించలేదు.

**ప్రధాన ప్రాంతాల్లో ఇదీ పరిస్థితి**

టీయూఎఫ్ఐడీసీ నిధులతో నగరంలోని కొన్ని ప్రధాన మురుగు కాలువల నిర్మాణ పనులు చేపడుతుండగా.. మిగతావాటిలో పూడికతీతలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సప్తగిరి కాలనీవైపు, ఇందిరానగర్‌లో, ఐబీ కాలనీలో కాలువ నిర్మాణాలు దాదాపుగా పూర్తికాగా.. మిగతా ప్రాంతాల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాల్సి ఉంది.

విఠల్‌నగర్, ద్వారకానగర్, ఎన్టీఆర్‌నగర్, కాకతీయనగర్, ఉల్లిగడ్డల బజారు, శివాజీనగర్, లెనిన్‌నగర్ మీదుగా ప్రవహించే ప్రధాన మురుగు కాలువ మురుగుతో నిండిపోయింది.

7బీ కాలనీ, ఫైవింక్లయిన్ కాలనీ మీదుగా రైల్వే వంతెన కిందనున్న కాలువను శుభ్రం చేయకపోగా.. జ్యోతినగర్, రాంనగర్, సీతానగర్ నుంచి వచ్చే వరద ప్రవాహం సైతం ఈ వంతెన కింది నుంచే ప్రవహిస్తుండటంతో వరద నీరంతా రోడ్డెక్కి నిలుస్తుంది.

చిన్నపాటి వర్షానికే రామగుండం పాత బజారు ఏటా ముంపునకు గురవుతుంది. ఇప్పటికిప్పుడు వర్షాలు కురిస్తే గతంలోకంటే ఎక్కువగా వరదనీరు ఇళ్లల్లోకి చేరే ప్రమాదముంది. కొంతమేర కాలువ నిర్మాణం జరిగినప్పటికీ వరద ప్రవాహానికి సరిపడే వెడల్పు లేదు. కొన్నేళ్లుగా ఈ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ పరిష్కారం కావడంలేదు.

నిధులు మంజూరైనా నత్తనడకన..

'అమృత్ 2.0' నిధులు రూ.88.68 కోట్లతో.. నగరంలోని నాలుగు చోట్ల మురుగు జలాల శుద్ధి కేంద్రాలను నిర్మించడంతోపాటు, పలుచోట్ల కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మూడేళ్ల క్రితం నిధులు మంజూరైనప్పటికీ.. పనులు నత్తనడకన సాగుతున్నాయి. మురుగు జలాలను శుద్ధి చేయకుండానే గోదావరిలోకి వదులుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి పలుమార్లు నోటీసులు జారీ చేసినా ఫలితంలేదు.

**పనులు వేగవంతం చేస్తాం**

నగరంలోని మురుగు కాలువల నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మురుగు కాలువల్లో పూడికతీతకు ఇటీవల టెండరు ఖరారు కావడంతో పనులు వేగవంతం చేస్తాం. మురుగును తొలగించేందుకు నగరపాలిక వాహనాలను కొనుగోలు చేసి వినియోగిస్తోంది.

## ముంపులో.. మునుగుడే



భువనగిరి : వానొస్తే వరదొస్తుంది. ఆ వరద ఎటూ వెళ్లలేని దుస్థితి. ఆ నీళ్లు రహదారులపై నిలిచిపోతాయి. రాకపోకలకు అంతరాయంగా మారుతాయి. కొన్ని ప్రాంతాల్లో నీరు ఇళ్లలోకి చేరుతుంది. కాలనీల్లో రోజుల తరబడి నీరు నిలుస్తున్న ఘటనలు ఉన్నాయి.

భువనగిరి పట్టణంలో గతంలో కొత్తబస్‌స్టేషన్ ప్రాంగణం నుంచి ప్రిన్స్ చౌరస్తా వరకు దుకాణాల్లోకి వరద నీరు చేరి భారీ నష్టాన్ని మిగిల్చాయి. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలోనూ వరద నీరు చేరి రోజుల తరబడి నీళ్లు నిలుస్తాయి. ఖాజీమహెల్లాలో కాలనీలో వర్షపు నీరుతో ఇళ్లలోకి వెళ్లడం కష్టంగా ఉంటుంది. రాయగిరి అండర్‌పాస్ వద్ద గతంలో పడిన భారీ వర్షాలకు చెరువు పొంగి సర్వీస్ రహదారిలో మూడు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. మున్సిపల్ డీఈ కొండల్‌రావు మాట్లాడుతూ.. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఆలేరు పట్టణంలో లోతట్టు ప్రాంతంలో ఉన్న రంగనాయక వీధి, కుమ్మరివాడ, సిల్క్‌నగర్ కాలనీలు జలమయమవుతున్నాయి. రాజపేట గ్రామం చుట్టూ ఎత్తైన కోట బురుజు, ఆ పక్కనే లోతైన కందకాలున్నాయి. ఈ కందకాల గుండా వరదనీరు దిగువ ప్రాంతానికి వెళ్లడానికి అప్పట్లో ఏర్పాటు చేసినట్లుగా సమాచారం. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలోని రెండు పడకల భవన సముదాయాలు చుట్టూ నీరు చేరి చెరువును తలపిస్తోంది. బాహుపేట రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలో వర్షం నీరు చేరితే ఇక రెండు నెలల పాటు రాకపోకలు కొనసాగవు. యాదగిరిగుట్ట పురపాలికలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుకభాగం నివాసాలు, పొలాలు ప్రతీయేటా వరదనీరు చుట్టుముట్టి ఇబ్బందులకు గురవుతుంటారు. గొల్లగూడెం, చొల్లేరు కాజ్‌వేలపై వరద ప్రవాహం పెరిగితే యాదగిరిగుట్టకు రాకపోకలు నిలిచిపోతాయి.

చౌటుప్పల్‌లో చెరువు నిండితే ఇక్కడి బస్‌స్టేషన్, చిన్నకొండూరు రోడ్డు, గాంధీ పార్కు, శాంతినగర్, రామ్‌నగర్, వెంకటరమణ కాలనీ ప్రాంతాలు జలమయం అవుతాయి. జాతీయ రహదారి పక్కనున్న సర్వీసు రోడ్డును, దానికి ఇరువైపులా ఉన్న దుకాణాల సెల్లార్లలో నిండిపోయి నెలలు గడిచినా ఆ నీరు తగ్గడం లేదు.

మోత్కూరు పురపాలికలోని వెంకటేశ్వరకాలనీ, వడ్డెరవాడ ఆపై ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో స్థానిక పాతబస్టాండ్ ప్రాంతం గుండా చెరువులోకి నీరు వెళ్లేందుకు సరైన కాల్వలు లేక ఇళ్లలోకి నీరు చేరుతుంది. పుర కమిషనర్ కె.సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఇటీవల రెండు కల్వర్టులు నిర్మించామని వరద చెరువులోకి సజావుగా వెళ్లిపోయేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు.


## చెత్త ఎరువై.. వ్యర్థాలు వేరై

భువనగిరి : భువనగిరి పురపాలక సంఘం డంపింగ్ యార్డులో బయో మైనింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. యార్డులో 2020 నుంచి కొనసాగుతున్న ప్రక్రియ సాంకేతిక కారణాలతో కొద్ది రోజులుగా నిలిచిపోయింది. ఇప్పటికే యార్డులో పోగైన 80 శాతం చెత్తను బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా ఎరువుగా మార్చారు. యార్డులోని చెత్త తొలగి తిరిగి నిలువ చేసే అవకాశం కలగడంతో పాటు పురపాలకశాఖకు ఆదాయం లభిస్తోంది.

పట్టణంలో నిత్యం 32 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. పట్టణంలోని 35 వార్డుల నుంచి సేకరిస్తున్న చెత్తను ఎక్కడ నిలువ చేయాలో అర్థంకాని పరిస్థితిలో రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా పురపాలక సంఘం యార్డులో బయోమైనింగ్ ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. అప్పట్లో సాగర్ మోటార్స్ సంస్థ బయోమైనింగ్‌కు శ్రీకారం చుట్టింది.

**18 వేల మెట్రిక్ టన్నులు**

యార్డులోని మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో పేరుకుపోయిన చెత్తను బయోమైనింగ్‌ను చేపట్టి సుమారు 95వేల టన్నుల ఎరువును వేరు చేయాలన్న లక్ష్యంతో ప్రారంభమైన ప్రక్రియ ఇప్పటి వరకు సుమారు 18వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు ఎరువును తయారు చేయగలిగారు. చెత్త నుంచి ఆశించిన మేరకు ఎరువు లభించకపోవడంతో పూర్తి స్థాయిలో లక్ష్యం నెరవేరడం లేదు. తయారు చేసిన ఎరువు, ఇతర వ్యర్థాలను మూడు గుట్టలుగా యార్డులోనే నిల్వ చేయడం గమనార్హం. ఎరువు, ఇతర వ్యర్థాలకు ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ తగ్గడంతోనే నిలువలు తరలించకుండా, ప్రక్రియను కొద్ది రోజుల పాటు నిలిపివేసినట్లు సమాచారం. తయారు చేసిన ఎరువును తరలించి, పేరుకుపోయిన చెత్తను మరో దఫా బయోమైనింగ్ చేసిన పక్షంలో యార్డులో చెత్త పోగు చేసేందుకు మరింత స్థలాన్ని సమకూర్చుకునే అవకాశం ఉంది.



**ఇతర ఉత్పత్తులు**

దశాబ్దాలుగా యార్డులో పేరుకుపోయిన చెత్తను బయో మైనింగ్ వారియర్ 600, వారియర్ 1200 యంత్రాల ద్వార ద్వార వేరు చేసిన మూడు రకాలుగా ఉత్పత్తి చేస్తున్నారు. చెత్త కంపోస్ట్ ప్రొడక్ట్, ఇన్‌ఆర్ట్ మెటీరియల్, బయో సాయిల్‌ను విక్రయించడం ద్వారా భారీ ఆదాయం గుత్తేదారు సంస్థ పొందుతోంది. కంపోస్టబుల్ ప్రొడక్ట్ సిమెంట్ కర్మాగారాలకు, ఇన్‌ఆర్ట్ మెటీరియల్ ల్యాండ్ ఫిల్లింగ్‌కు, బయో సాయిల్ వ్యవసాయానికి ఎరువుగా వినియోగించుకునే వీలుంది.

ఉత్పత్తి అయ్యే పదార్థాలు ఇలా...

బయో సాయిల్: కార్బన్ పార్టికల్స్, బయో డిగ్రేడబుల్ సామగ్రి, ఎరువు

కంపోస్టబుల్: పెట్ బాటిల్స్, పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు

ఇన్‌ఆర్ట్ మెటీరియల్: గాజు సీసాలు, సీసం, వాహనాల వ్యర్థాలు, రబ్బరు, బల్బులు, ఫైబర్ మెటీరియల్.

## ప్రాణి చిన్నది.. హాని పెద్దది

ఆదిలాబాద్ : రెండక్షరాల చిన్న ప్రాణి 'దోమ'. మనిషికి తెచ్చిపెట్టే ముప్పు మాత్రం చాలా పెద్దది. ప్రధానంగా వర్షాకాలంలో అన్ని రకాల అంటువ్యాధులను ఒకరి నుంచి మరొకరికి చేరవేస్తూ వాటిని వ్యాప్తి చేస్తూ ఆసుపత్రుల పాల్జేస్తుంది. చిన్న జాగ్రత్తలతో దోమల బారి నుంచి బయటపడొచ్చు.

నీటి నిల్వ ప్రాంతాల్లోనే దోమలు వృద్ధి చెందుతాయి. అవి నీటిలో పెట్టిన గుడ్లు వాతావరణం వేడితో మూడు రోజుల్లోనే లార్వాలుగా బయటకు వచ్చి ప్యూపాగా మారుతాయి. వీటినే నీళ్లలో తోకపురుగులుగా వ్యవహరిస్తారు. అనంతరం ఇవే దోమలుగా రూపాంతరం చెందుతాయి. అన్ని రకాల ప్రాణాంతక వ్యాధులు దోమ వల్లనే వ్యాప్తి చెందుతాయి.

**రోగాల ముప్పు..**

దోమ కాటు వల్ల ప్రధానంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు ప్రబలుతాయి. ఈ వ్యాధులున్న వారిని దోమలు కాటేసిన అనంతరం ఇతరులను కుడితే ఆ వ్యాధి వైరస్ వారిలో వృద్ధి చెందుతుంది. ఈ వ్యాధుల లక్షణాలన్నీ దాదాపు ఒకే రకంగా ఉంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..

ఆవాస ప్రాంతాల వద్ద, ఇళ్లల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



వీలైతే దోమ తెరలను వాడి రక్షణ పొందొచ్చు.

పరిసరాల్లో నీటి నిల్వ గుంతలుంటే పూడ్చేయాలి

ఇళ్లల్లోని కూలర్లలో ఎప్పటికప్పుడు నీళ్లను మార్చేస్తూ ఉండాలి

వీలైతే ఇళ్లల్లో దోమల నివారణ పొగ పెట్టొచ్చు. ఇందుకు మార్కెట్‌లో వివిధ రకాల అగర్‌బత్తీలు అందుబాటులో ఉన్నాయి.

చిన్న పిల్లలను పడుకోబెట్టినప్పుడు కాళ్లు, చేతులకు దోమల నివారణ క్రీములను ఉపయోగించవచ్చు.

శుభ్రత పాటించాలి

దోమల వల్ల వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందడానికి పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. పరిసరాల్లో నీటి నిల్వ గుంతలు, పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవాలి. అస్వస్థతకు గురైతే వెంటనే సమీపంలోని ఆసుపత్రిలో సకాలంలో సంప్రదించాలి.


రాథోడ్ నరేందర్, డీఎంహెచ్ఓ

## స్వచ్ఛ పురస్కారం.. ఎవరికో వరం!

వాంకిడి : గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపర్చేందుకు, పంచాయతీల మధ్య పోటీ పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సర్వేలో తేలిన అంశాల ఆధారంగా పాయింట్లు కేటాయిస్తారు. వీటి ఆధారంగా పంచాయతీలకు ర్యాంకులు ప్రకటించి పురస్కారాలను అందజేస్తారు. ఈ క్రమంలో ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. త్వరలో కేంద్ర బృందాలు గ్రామాల్లో పర్యటించి సర్వే చేపట్టనున్నారు.

**ఈ అంశాలకు ప్రాధాన్యం**

జిల్లాలో త్వరలో కేంద్ర బృందం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై సర్వే చేపట్టనుంది. పారిశుద్ధ్య పరిస్థితి, ప్రగతి పనులపై అధికారులు పంపిన నివేదికల ఆధారంగా క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టనున్నారు. ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించుకున్నారా?, వినియోగిస్తున్నారా?, పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం చెత్తను సేకరిస్తున్నారా? ఇంకుడు గుంత నిర్మాణం ఉందా?, డంపింగ్ యార్డుల్లో వ్యర్థాల నిర్వహణ అమలు, పచ్చదనం పెంపు, శుద్ధమైన తాగునీటి సరఫరా, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల, బహిరంగ ప్రదేశాల్లో పారిశుద్ధ్య పరిస్థితి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలు.. ఇలా తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని సర్వే చేపడతారు. ఆయా అంశాల ఆధారంగా వెయ్యి మార్కులకు గాను ఎక్కువ స్కోర్ సాధించిన పంచాయతీలకు స్వచ్ఛ ర్యాంకులు ప్రకటించనున్నారు.



**కొనసాగుతుంది ఇలా..**

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 పంచాయతీలు ఉన్నాయి. అయితే పంచాయతీల్లో కేంద్ర బృందం ర్యాండమ్‌గా 20 ఆదర్శ గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేపట్టనుంది. ఏ గ్రామాల్లో సర్వే చేపడతారనే ముందస్తు సమాచారం ఉండదు. అంతర్జాలంలో వచ్చిన సమాచారం ఆధారంగా ఏ గ్రామానికి వెళ్లాలనేది నిర్ణయం జరుగుతుంది. గ్రామంలో ఏవైనా 16 నివాస గృహాలను సందర్శించి వారి అభిప్రాయాలను క్రోడీకరించి క్షుణ్నంగా పరిశీలిస్తారు. ఆ నివాస గృహాల్లో మూడు ఎస్సీ, మూడు ఎస్టీ, 10 ఇతర నివాసాలను అధికారుల ఆదేశాలకు అనుగుణంగా సర్వే చేస్తారు. అనంతరం సర్వేలో తేలిన అంశాలను కేంద్రానికి నివేదికలు అందజేస్తారు.

**సిబ్బందికి అవగాహన**

త్వరలో కేంద్ర బృందం స్వచ్ఛ సర్వేక్షణ్‌కు రానున్న నేపథ్యంలో.. జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామాల్లో స్వచ్ఛ వాతావరణం నెలకొనేలా అన్ని పంచాయతీల్లోని సిబ్బందికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నారు. అయితే జిల్లాలోని చాలా పంచాయతీల్లో పారిశుద్ధ్య సిబ్బంది కొరత ఉంది. ఫలితంగా పారిశుద్ధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే కొనసాగుతోంది. సర్వే దృష్టిలో పెట్టుకుని సిబ్బంది కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అలా అయితేనే మన పంచాయతీలు పురస్కారాన్ని అందుకునే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# కొబ్బరి కొండెక్కింది!

హిందూపురం : ఏ గుడికి వెళ్లినా భక్తులు టెంకాయ తీసుకెళ్తారు.. ఏ రుచికరమైన వంట చేయాలన్నా కొబ్బరి వాడకం తప్పనిసరి.. అలాంటి కొబ్బరి ధర నేడు ఆకాశాన్నంటింది. మార్కెట్లో ఇన్నాళ్లు రూ.20 ఉన్న కొబ్బరి కాయ నేడు రీటైల్ వ్యాపారులు రూ.50కి విక్రయిస్తున్నారు. కొన్ని మాసాల కింద కిలో ఎండుకొబ్బరి రూ.80 ఉండగా నేడు రూ.400కు చేరడంతో వినియోగదారులు కొనలేక లబోదిబోమ ంటున్నారు.

**యళ్లనీరు ఎంత పనిచేసింది..!**

కర్ణాటక ప్రాంతం టిప్పుటూరు, మాండ్య, సమీప ప్రాంతాలైన మధుగిరి, శిర, కునిగల్, అమరాపురం తదితర ప్రాంతాల్లో అధికంగా కొబ్బరి తోటలు ఉన్నాయి. ఇక్కడి నుంచి కొబ్బరికాయలు రాష్ట్రానికి సరఫరా చేస్తున్నారు. అయితే కర్ణాటక ప్రాంతంలో గత వేసవిలో ఎండలు అధికంగా ఉండటంతో కొబ్బరి నీళ్ల (యళ్లనీరు) వినియోగం పెరిగింది. దీంతో వీటి ధర కూడా పెరగటంతో రైతులు ఎక్కువ కాయలను కొబ్బరినీళ్ల వ్యాపారులకే విక్రయించారు. దీనివలన చెట్టులో



కాయ పూర్తిస్థాయిలో సిద్ధం కాక ముందే వాటిని చెట్టునుంచి తొలగించటంతో చెట్టు తెగుల బారినపడింది. దీని ప్రభావంతో దిగుబడి తగ్గింది. డిమాండ్ మేరకు కాయల సరఫరా లేనందున ప్రస్తుతం మార్కెట్లో ధరలు పెరిగాయి.

**శ్రావణ మాసంలో పెరిగే అవకాశం:** ప్రస్తుతం ఆషాఢ మాసంలోనే కొబ్బరి కాయల ధరలు ఈ విధంగా ఉంటే శ్రావణమాసంలో మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రతి సోమ, శనివారాల్లో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యక్రమాలు అధిక సంఖ్యలో జరుగుతాయి.ఆ సమయంలో వాటి ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు

# కొలువుల కోర్సులకు జై

విశాఖపట్నం : పాలిటెక్నిక్‌కళాశాలల్లో తొలి ఏడాది ప్రవేశాలకు (జులై 16)వరకే గడువున్న నేపథ్యంలో ఆయా బ్రాంచిలను ఎంపిక చేసుకున్న వారంతా కళాశాలల్లో చేరారు. తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. 'కెమికల్' బ్రాంచిలకు ఆదరణ కనిపించింది. ట్రిపుల్‌ఈ, మెకానికల్ బ్రాంచిల వైపు విద్యార్థులు మొగ్గు చూపారు. భవిష్యత్తును ఊహించి విద్యార్థులు ఆచితూచి ఎంపిక చేసుకున్నట్లు అధ్యాపకులు చెబుతున్నారు.



**అందుకే ప్రాధాన్యం:** ఏ బ్రాంచి తీసుకుంటే త్వరగా ఉద్యోగం వస్తుందో వాటికే విద్యార్థులు ప్రాధాన్యం ఇచ్చారు. కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలోని నాలుగు బ్రాంచిల్లో సీట్లు భర్తీ అయ్యాయి. చాలా తక్కువ మిగిలాయి. ఇక్కడ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎప్పటికప్పుడు లభిస్తుండడంతో ఈ ఏడాది సైతం మంచి డిమాండ్ ఏర్పడింది. అలాగే ట్రిపుల్‌ఈ, మెకానికల్ బ్రాంచిలకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిమాండ్ కనిపించింది. ఆ బ్రాంచిలు కావలసిన వారు ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు రాని పక్షంలో 'ప్రైవేటు'లో చేరారు. ఇటీవల పాలిటెక్నిక్ విద్యకు డిమాండ్ పెరగడం, చదివిన విద్యార్థుల్లో అత్యధికులకు ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు వస్తుండడంతో అందరి చూపు ఇటే నిలిచింది. పదోతరగతి అనంతరం పాలిటెక్నిక్ పూర్తి చేసిన తరువాత 19 ఏళ్లకే పలు కంపెనీల్లో విద్యార్థులు కొలువులు సాధిస్తున్నారు. ఈ పరిస్థితే వీరిని ఇటు వైపు తీసుకొచ్చింది. కొందరు విద్యార్థులు ఉన్నత విద్య లక్ష్యంగా బీటెక్ కోర్సుల వైపు వెళుతున్నారు.

# నక్కినా చిక్కేలా..!

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల కట్టడికి సాంకేతికత అందిపుచ్చుకోవాలని అధికారులు నిర్ణయించారు. పలు ప్రదేశాల్లో దాదాపు 340 నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు. ముక్కంటి భక్తులను మోసగించడం, వారి వెంట దర్శనాలకు వెళ్లడం, అధికారుల కళ్లుగప్పి దర్శనాలకు తీసుకెళ్లడం తదితర వాటిపై తరచూ విమర్శలు వస్తున్నాయి. రద్దీ రోజుల్లో ఈ తరహా ఘటనలు మరింత ఎక్కువనే చెప్పాలి. వీటికి దశల వారీగా చెక్ పెట్టేందుకు వీలుగా నిఘా కెమెరాల్లోని సీసీ ఫుటేజీల పరిశీలనకు ప్రత్యేకించి ఉద్యోగులను నియమించారు. ప్రవేశ ద్వారాలు, మహాద్వారం, స్వామి, అమ్మవార్ల ఆలయాల వద్ద నిఘా కెమెరాల్లోని ఐదు రోజుల ఫుటేజీలను ప్రయోగాత్మకంగా పరిశీలించారు. అధికారులకు కన్పించకుండా నక్కి భక్త బృందాలకు దర్శనాలు చేయించిన ఐదుగురు భద్రతా సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. విధి నిర్వహణలో ఉన్న కొందరు సిబ్బంది కూడా దళారులకు సహకారం అందిస్తున్నారన్న భావనతో ఇప్పటికే పలువురిని గుర్తించారు. వీరిపైనా త్వరలో చర్యలు తీసుకునే అవకాశముంది.

**ఇకపై కేసులు!** ఇప్పటి వరకు దళారులను గుర్తించి పోలీసులకు అప్పగించడం.. వారు కౌన్సెలింగ్‌తో సరిపెడుతున్నారు. ఇకపై అలా కాకుండా అనధికారికంగా భక్తుల బృందాలను తీసుకెళ్లే దళారులపై గట్టిగా చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రస్తుతం సీసీ ఫుటేజీల్లో గుర్తించిన దళారులపై కేసులు పెట్టాలని నిర్ణయించారు. భక్తులను మోసగించడం, తక్కువ టికెట్లు తీసుకుని ఎక్కువ మందిని దర్శనాలకు తీసుకెళ్లడంటి స్వామి, అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేయిస్తామని డబ్బులు తీసుకొనే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులు భావిస్తున్నారు. అయితే ఇవన్నీ ఆచరణలోకి వస్తే వీలైనంత మేర దళారులు తగ్గుముఖం పట్టే అవకాశముంది.

# అక్కడే మందు.. ఆనక చిందు!



అనకాపల్లి: జిల్లాలో మద్యం దుకాణాలు బార్లుగా మారాయి. నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎక్సైజ్ శాఖ సమీక్షల్లో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే ఆదేశిస్తున్నా అధికారులకు పట్టడం లేదు. దీనిని అలుసుగా తీసుకుని దుకాణదారులు అమ్మకాలు పెంచుకునేందుకు నిబంధనలు తుంగలోకి తొక్కుతున్నారు. అనకాపల్లి జిల్లాలో సుమారు 132 మద్యం దుకాణాలుండగా.. కొన్నిచోట్ల అక్కడే తాగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**నిబంధనల ప్రకారం దుకాణాల్లో కేవలం** మద్యం విక్రయాలు మాత్రమే సాగాలి. షాపుల వద్ద తాగకూడదు. కేవలం బార్లకే పర్మిట్ రూమ్‌లను ఎక్సైజ్ శాఖ అనుమతిస్తుంది. కానీ.. మద్యం షాపుల్లోనే అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు నిర్వహిస్తున్నారు. అంతా బహిరంగంగా సాగుతున్నా.. ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేయడం లేదు. చట్ట విరుద్ధంగా సాగే వ్యవహారాలపై కఠినంగా ఉండాల్సిన పోలీసులు కూడా కిమ్మనడం లేదు. నెలనెలా మామూళ్లు ముడుతుండటంతోనే నోరు మెదపడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**షాపుల వెనకే తతంగం:** లంకెలపాలెం కూడలి సమీపంలో ఉన్న ఓ మద్యం దుకాణం వద్ద కొద్దిపాటి ఖాళీ స్థలం ఉంది. అందులోనే మందుబాబులు కోసం నిల్చుని తాగేలా బల్లలు ఏర్పాటు చేశారు. రోడ్డు వైపు నుంచి చూస్తే విక్రయాలు మాత్రం జరుగుతున్నట్లు కనిపిస్తుంది. వెనుకకు వెళ్లి చూస్తే. మద్యం తాగుతూ.. మత్తులో జోగుతూ కనిపిస్తారు.

నక్కపల్లి, ఉపమాక పరిధిలో మూడు, వేంపాడులో ఒకటి మద్యం దుకాణాలున్నాయి. వాటి చుట్టుపక్కల చిల్లర దుకాణాలు పెట్టుకుని.. అక్కడే తాగుతున్నారు. ఆయా దుకాణాలు చుట్టూ పాన్‌షాపులు పెట్టుకున్నవారు ప్రతి నెలా మద్యం దుకాణ యజమానికి తలో కొంత మొత్తం చెల్లిస్తున్నారు.

రాంబిల్లి మండలంలోనూ ఊరికి దూరంగా చాలా దుకాణాలున్నాయి. అక్కడే మందుబాబులు తాగేసి చిందులేస్తున్నారు.

**పట్టణాల్లోనూ బహిరంగమే:** అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట వంటి పట్టణాల్లోనూ ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగుతున్న దృశ్యాలు కనిపిస్తాయి. అయినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. అనకాపల్లి నెహ్రూచౌక్ సమీపంలోని ఓ మద్యం దుకాణం వద్ద పలువురు నిత్యం మద్యం తాగి రోడ్డు మధ్యలో దొర్లుతున్నారు. పట్టపగలే ఇలా చేస్తున్నా.. పోలీసులు సరిగా నియంత్రించ లేకపోతున్నారు.

**నిబంధనలు పాటించకుంటే చర్యలు:** ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాల వద్ద తాగడం నిషేధం. అలా కాకుండా ప్రత్యేక సదుపాయాలు కల్పించి.. దుకాణ పరిసరాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. రాత్రి వేళల్లో రోడ్లపై తాగి.. అల్లరి చేస్తే కేసులు పెడతాం. వి.సుధీర్, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి

# కప్పేస్తున్నా కదలరు!



ఎస్.రాయవరం : స్థిరాస్తి వ్యాపారుల మాయాజాలానికి జలవనరులు కనుమరుగవుతున్నాయి. పదిమందికి ఉపయోగపడే పంట కాలువ రూపురేఖలు లేకుండా పోతున్నా సంబంధిత అధికారులు కొరడా ఝుళిపించడం మాని కళ్లప్పగించి చూస్తుండిపోతున్నారు. ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరు రెవెన్యూ పరిధిలో స్థిరాస్తి వ్యాపారులు పంట కాలువను లేఅవుట్ రోడ్డుగా మార్చేందుకు యత్నిస్తున్నారు. పెదగుమ్ములూరు రెవెన్యూ పరిధిలో కొండలను ఆనుకుని 2.97 ఎకరాల్లో పంటకాలువ ఉంది. దీనిద్వారా నీరు శివాలయం వద్దనున్న చెరువులోకి చేరుతుంది. సర్వే నంబర్ 181లో 0.45 ఎకరాలు, 183లో 0.20 ఎకరాలు, 173లో 0.87 ఎకరాలు, 174లో 0.44 ఎకరాలు, 178లో 1.01 ఎకరాల్లో ఈ కాలువ ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. సెటిల్‌మెంట్ ఫేర్ అడంగల్‌లోనూ (ఎస్‌ఎఫ్‌ఎ) గోర్జి, పంటకాలువగా నమోదైంది. దీనిని ఆనుకుని మూడేళ్ల క్రితం నలుగురు వ్యక్తులు సుమారు 30 ఎకరాల భూముల్లో భారీ లేఅవుట్ వేశారు. అడ్డురోడ్డుకు అతి సమీపంలో ఈ భూములు ఉండటంతో ఎకరా రూ. 5 కోట్ల వరకు విక్రయిస్తున్నారు. కానీ ఈ లేఅవుట్ వెళ్లేందుకు మార్గం లేదు. దీంతో స్థిరాస్తి వ్యాపారులు ఈ కాలువను చదును చేసి, పక్కనున్న జిరాయితీ భూముల్లో కలిపేసుకోవడానికి రెండేళ్ల క్రితమే ప్రయత్నాలు మొదలెట్టారు. ముందుగా సర్వే నంబర్ 181, 183లో గ్రావెల్ రోడ్డు, రెండువైపులా డ్రైన్ల నిర్మాణం చేపట్టారు. ఈ విషయంపై అభ్యంతరాలు రావడంతో అప్పుడు పనులు నిలిపేశారు. మళ్లీ ఇప్పుడు కాలువ మొత్తం కప్పేసి పక్కా రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అడ్డురోడ్డు–నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రహదారికి ఆనుకుని ఇంత దర్జాగా ఆక్రమణలు సాగుతున్నా రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పంట కాలువ లేకపోవడంతో వర్షపు నీరు సమీపంలోని నివాసాలను, పొలాలను ముంచెత్తుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**పనులు నిలిపివేయించాం...** పెదగుమ్ములూరు పంటకాలువ, గోర్జి ఆక్రమించి డ్రైనేజీ నిర్మిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో వెంటనే వీఆర్వోను పంపించి పనులు నిలిపివేయించాం. పంటకాలువను జిరాయితీ భూమిలో కలిపేసినట్లు గుర్తించాం. తిరిగి కాలువ తవ్వించేందుకు చర్యలు తీసుకుంటాం. ఆక్రమణ ఆగకపోతే పోలీసులకు ఫిర్యాదు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం.

జి.రమేష్‌బాబు, ఎస్.రాయవరం తహసీల్దార్

చర్యలు తీసుకుంటాం.. పెదగుమ్ములూరు కాలువ 20 అడుగులు ఉండాలి. ఆక్రమణ విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాం. కాలువను కప్పేసినట్లు గుర్తించాం. రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే చేసి, హద్దులు నిర్ణయించి, కాలువను తవ్విస్తాం. జలవనరును ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. అమీనాబాను, జలవనరుల శాఖ ఏఈ

# సమస్యల నిలయం.. సరస్వతి క్షేత్రం

కొత్తపల్లి: రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి క్షేత్రంగా వెలసిల్లుతున్న కొలనుభారతి ఆలయం సమస్యలకు నిలయంగా మారింది. గతంలో తెదేపా హయాంలో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టి గోపురం వరకు పనులు పూర్తి చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా చొరవ తీసుకోకపోవడంతో పనులన్నీ మధ్యలోనే నిలిచాయి. ఇటీవల కొత్తపల్లి మండలానికి వచ్చిన ఎమ్మెల్యే జయసూర్య.. ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లామని, ఆలయ నిర్మాణానికి హామీ ఇచ్చారు.

**అసంపూర్తిగా పనులు**

నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం శివపురం గ్రామంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఎత్తైన కొండల మధ్య చారుఘోషిణి నది ఒడ్డున సరస్వతి ఆలయం ఉంది. తెలుగు, ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం వందలాది భక్తులు వస్తుంటారు. కానీ, సరైన మౌలిక వసతులు కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. తొమ్మిదేళ్ల క్రితం ఆలయ నిర్మాణానికి తెదేపా ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. గోపురం వరకు పనులు పూర్తయ్యాయి. తర్వాత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతోనే ఆలయ అభివృద్ధి కుంటుపడిందని భక్తులు ఆరోపిస్తున్నారు. దాదాపు దశాబ్దం కావస్తున్నా పనులు పూర్తి కాకపోవడంపై ఆందోళన చెందుతున్నారు.

**వసతుల్లేక సతమతం**

ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరు కళతప్పింది. గతంలో కార్తికమా



సం, శ్రావణమాసం, శివరాత్రి వేళల్లో కోనేరులో భక్తులు స్నానాలు చేసి సర్వసతి దేవిని దర్శించుకునే వారు. ప్రస్తుతం నీరు లేకపోవడంతో స్నానాలు చేయలేని దుస్థితి నెలకొంది.

ఆలయంలో కనీస వసతులు లేవు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు విశ్రాంతి గదుల్లేవు. ఆలయ ప్రాంగణంలోని మూడు శౌచాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. క్షేత్రానికి బీటీ రహదారి లేదు. రెండు వారాల క్రితం కురిసిన వర్షానికి దారంతా గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మూడు సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

# కొలువు లక్ష్యం.. ఎన్‌సీసీతో సులభం

దేవీచౌక్ : ఆ యువతీయువకులు డిగ్రీ పూర్తవ్వగానే కొలువు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నారు. అందుకోసం ఎన్‌సీసీని మంచి వేదికగా భావించారు. అందులో చేరి జాతీయస్థాయిలో ప్రతిభ చాటుతున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చదువుతున్న వీరంతా విశేషంగా రాణిస్తున్నారు. ఈ ఏడాది ఆర్డీసీకి ఒకరు, థలసైనిక్ క్యాంపునకు ఇద్దరు, రాక్ క్లైంబింగ్‌కు ఒకరు, ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్‌కు ఇద్దరు, ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపునకు ఏడుగురు ఎంపికయ్యారు. సెప్టెంబరులో జరిగే ఇంటర్ గ్రూప్ థలశైనిక్ క్యాంపునకు ఏడుగురు ఎంపికయ్యారు. ఈనెల 4న జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్‌సీసీ ఎయిర్ కమాండర్ నరసింగ్ సైలాని చేతులమీదుగా ప్రవీణ్‌కుమార్, కవిత ఉత్తమ క్యాడెట్స్ మెడల్స్ అందుకున్నారు. జూన్ 22 నుంచి జులై 1 వరకు జరిగిన శిబిరంలో కళాశాల క్యాడెట్లు డ్రిల్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, సోలో సింగింగ్ అంశాల్లో ప్రథమ, కోకోలో ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా తమ లక్ష్యాల గురించి చెప్పారిలా..

**ఆర్మీలో చేరాలని..**



ఆర్మీలో చేరాలనే కల నెరవేర్చుకునేందుకు ఎన్‌సీసీలో చేరాను. ఐడీఎస్‌ఎస్‌సీ శిబిరానికి ఎంపికయ్యాను. ఇప్పటివరకు తొమ్మిది క్యాంపుల్లో పాల్గొన్నాను. చదువుతో పాటు ఎన్‌సీసీకి కూడా ప్రాధాన్యం ఇస్తున్నా. అధ్యాపకుల ప్రోత్సాహం బాగుంది.

– ఎ.వి.హేమలత, బీఎస్సీ తృతీయ సంవత్సరం

**అగ్నివీర్ పరీక్షకు..**

ఐడీఎస్‌ఎస్‌సీ క్యాంపులో షూటింగ్‌లో శిక్షణ పొందే అవకాశం లభించింది. ఇందులో ఇప్పటివరకు ఆరు క్యాంపుల్లో పాల్గొన్నా. మరో రెండింట్లో పాల్గొనే అవకాశం ఉంది. అక్కడ ప్రతిభ కనబరిస్తే మౌలాంకర్ జాతీయ క్యాంపునకు ఎంపికవచ్చు. డిగ్రీ తర్వాత ఆర్మీలోకి వెళ్తాను. ఈ నెలలో జరిగిన అగ్నివీర్ పరీక్షకు హాజరయ్యాను.

– ఎం.రవిశంకర్, బీఎస్సీ ప్రథమ సంవత్సరం

**కర్తవ్యపథ్‌లో పాల్గొన్నా..**

దిల్లీలో జరిగిన ఆర్డీసీ క్యాంపులో పాల్గొనడంతో కర్తవ్యపథ్‌కు ఎంపికయ్యాను. దీంతో డీడీజీ మెడల్ సాధించడంతో పాటు ఆర్మీ అటాచ్‌మెంట్ శిబిరానికి ఎంపికయ్యాను. ఇప్పటి వరకు 12 క్యాంపుల్లో పాల్గొన్నా. పోలీసు లేదా ఆర్మీలో చేరేందుకు ఎన్‌సీసీని ఎంచుకున్నాను.

– ఎ.కవిత, బీఎస్సీ తృతీయ సంవత్సరం

**15 శిబిరాలకు హాజరు..**

ఎన్‌సీసీలో ఇప్పటి వరకు 15 క్యాంపులకు హాజరయ్యాను. థలసైనిక్ క్యాంపులో పాల్గొని జడ్జింగ్ డిస్టెన్స్‌లో ద్వితీయ స్థానం సాధించాను. ఈనెల 15 నుంచి జరిగే ఆర్మీ అటాచ్‌మెంట్ శిబిరానికి ఎంపికయ్యాను. సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేయాలనే ఆలోచన ఉంది.– ఎం.ప్రవీణ్‌కుమార్ దొర, బీఎస్సీ తృతీయ సంవత్సరం

# చేనేత, మరమగ్గ కార్మికులకు ఉచిత విద్యుత్తు

పుత్తూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేనేత, మరమగ్గ కార్మికులను ఆదుకునే దిశగా అడుగులు వేసింది.. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గ కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తు అందించనున్నట్లు మార్చి 16న ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు.. ఈ మేరకు అప్పటి నుంచి ఆ శాఖ అధికారులు లబ్ధి పొందే కుటుంబాలను సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ నేపథ్యంలో చేనేత, మరమగ్గ కార్మికులకు ఆగస్టు ఏడో తేదీ నుంచి ఉచిత విద్యుత్తు అమలు చేయనున్నట్లు మంత్రి సవిత ప్రకటించడంతో ఆ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**అర్హులెవరంటే..**

చిత్తూరు జిల్లాలో పెనుమూరు, నగరి మండలంలోని మాంగాడు, పలమనేరుబీ తిరుపతి జిల్లాలో పుత్తూరు మండలం గొల్లపల్లి, నారాయణవనం, పాలమంగళం ఉత్తరం, దక్షిణం, వరదయ్యపాళెం, సత్యవేడు, వెంకటగిరి, పాపానాయుడుపేట, శ్రీకాళహస్తి, బీఎన్ కండ్రిగ తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. నగరి, పుత్తూరు, పాపానాయుడుపేట తదితర ప్రాంతాల్లో మరమగ్గాలున్నాయి. ఈ మేరకు ఆ శాఖ అధికారులు ఆయా కుటుంబాల విద్యుత్తు బిల్లులు పరిశీలించి అర్హుల జాబితా గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. ఉ



మ్మడి చిత్తూరు జిల్లాలో ఉచిత విద్యుత్తుకు 1,663 చేనేత కుటుంబాలు అర్హత సాధించాయి. 1,832 మంది మరమగ్గ కార్మికులకు ఈ రాయితీ వర్తించనుంది.

**జిల్లాలో లబ్ధి ఇలా..**

చేనేతలు: 191 మంది

మరమగ్గాలు: 948

**వైకాపా హయాంలో పట్టించుకోక..**


గత వైకాపా ప్రభుత్వం చేనేతలకు ఎలాంటి రాయితీలు ఇవ్వలేదు. ఏడాదికి రూ.24 వేలు కొందరికే ఇచ్చి చేతులు దులుపుకొంది. తమకు రూ.24 వేలు వర్తింపజేయాలని పలుమార్లు అర్హులు విన్నవించినా బుట్టదాఖలు చేసింది. ఈ నేపథ్యంలో చేనేతల కుటుంబ పోషణ కష్టసాధ్యమైంది. మార్గదర్శకాల ప్రకారం సర్వే.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వే చేసి తుది నివేదికను ప్రభుత్వానికి అందజేశాం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చేనేతలు 1,663 మంది, మరమగ్గాల కార్మికులు 1,832 మంది అర్హత పొందారు.రమేష్, ఏడీ, జిల్లా చేనేత, జౌళిశాఖ, ఉమ్మడి చిత్తూరు జిల్లా

# కలల వారధికి నిధుల వరద

సీతానగరం : గోదావరి వరదల సమయంలో లంక గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పవు. అది గుర్తించిన అప్పటి తెదేపా ప్రభుత్వం 2018–19లో సీతానగరం మండలం ములకల్లంక–బొబ్బిల్లంక గోదావరి నదిపై వంతెన నిర్మాణానికి రూ.35 కోట్లు మంజూరు చేసింది. 18 నెలల్లో పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రావడంతో వైకాపా అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే వైకాపా వంతెన పనులు ప్రారంభించడంతో లంక గ్రామాల ప్రజలు ఎంతో సంబరపడ్డారు. కాలవ్యవధి గడువు 24 నెలలకు పెంచి అయిదేళ్ల వైకాపా పాలనలో ఆరు నెలలు చొప్పున పెంచుకుంటూ పోయారే తప్ప, నిర్మాణం పూర్తి చేయలేదు.

**రూ.4.85 కోట్ల బకాయిలు..**

300 మీటర్ల వంతెన పనులకు గుత్తేదారుడు సుమారు రూ.15 కోట్లు ఖర్చుపెట్టి 40 శాతం పనులు పూర్తి చేశారు. 2022 లోనే గుత్తేదారుకు రూ.4.86 కోట్లు బిల్లులు బకాయిలు పెట్టారు. అప్పట్లోనే గుత్తేదారుడు పనులు చేయడానికి నిరాకరించడంతో సుమారుగా రూ.20 కోట్ల పనులు (పిర్స్, గడ్డర్స్, శ్లాబు) ఆగిపోయాయి. వంతెన నిర్మాణానికి ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంకు (ఏఐఐబీ) మంజూరు



చేసిన నిధులు 2024 మార్చి 31తో గడువు ముగిసింది. ఇలా ఉండగా సార్వత్రిక ఎన్నికల వేళ వంతెన పనులకు తెచ్చిన యంత్ర సామగ్రిని తీసుకెళ్లిపోయారు.

**అసెంబ్లీలో చర్చించారు..**

కూటమి అధికారంలోకి వచ్చాక ములకల్లంక, బొబ్బిల్లంక వంతెన పనులు పూర్తిచేసేందుకు రాజానగరం ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పలుసార్లు చర్చించారు. నిధుల గడువు ముగిసిపోవడమే కాకుండా బిల్లుల బకాయిలు, పనులు చేపట్టే సమయంలో నిధులు పెంచాలని విన్నవించారు. దీనిపై అసెంబ్లీలో చర్చించారు. 'వంతెన పనులకు ఏఐఐబీ రూ.45 కోట్లు పెంచుతూ ఆదేశాలు వచ్చాయి. మార్చి 2027 వరకు పనులు చేసేందుకు గడువు పెంచారు. ములకల్లంక, బొబ్బిల్లంక 1,400 మీటర్ల అప్రోచ్ రోడ్డు పూర్తి చేసేందుకు అదనంగా వచ్చిన నిధులతో అంచనాలు సిద్ధం చేశాం. ఈనెలాఖరుకు గుత్తేదారుకు ఇవ్వాల్సిన బిల్లులు మంజూరు అవుతాయి.' డీఈ (పీఆర్) శ్రీనివాసరావు అన్నారు.

# భవన స్వాధీనంలో తాత్సారం!

చిత్తూరు : సర్కారు సొమ్ము అంటే అందరికి అలుసే.. చూసుకుందాం.. ఎవరడుగుతారు.. అడిగితే ఎదోఒకటి చెప్పి కాలం గడుపుతాం అన్న తరహాలో వ్యవసాయ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో భవన నిర్మాణ పనులు పూర్తికాగానే ఆ భవనాలను సంబంధిత శాఖల అధికారులు స్వాధీనం చేసుకోవడం పరిపాటి. ఒకవేళ గుత్తేదారుకు బిల్లులు పెండింగ్ ఉంటే.. సదరు గుత్తేదారులు భవనాన్ని అప్పగించకుండా జాప్యం చేయడం సర్వసాధారణం. అయితే ఇక్కడ బిల్లులతో పనిలేదు.. కేటాయించిన నిధులకు అనుగుణంగా పనులు పూర్తిచేశాం.. భవనాన్ని స్వాధీనం చేసుకోండంటూ పోలీసు హౌసింగ్, వ్యవసాయ శాఖ అధికారులను సదరు గుత్తేదారు ప్రాధేయపడుతున్నా వారు పట్టించుకోక పోవడం గమనార్హం. ఇది ఎక్కడో కాదు.. సీఎం చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులోని జిల్లా వ్యవసాయ శాఖ ప్రయోగశాల(అగ్రి ల్యాబ్) భవనం దుస్థితి.

**రూ.3.68 కోట్లతో నిర్మాణం..**

జిల్లా రైతులకు ఎరువులు, పురుగు మందులు నాణ్యమైనవి అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లా కేంద్రంలో గత వైకాపా ప్రభుత్వం జిల్లా స్థాయి అగ్రి ల్యాబ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులను పోలీసు హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించారు. తొలుతగా రూ.2.96 కోట్లతో పనులు చేపట్టారు. సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం ఈ ల్యాబ్ భవన నిర్మాణ పనులు చేపట్టింది. పూర్తిస్థాయిలో నిర్మాణానికి మరో రూ.2 కోట్లు అవసరమని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్.. జిల్లా వ్యవసాయ శాఖకు ప్రతిపాదనలు పంపగా దీన్ని తిరస్కరించి అందుబాటులో ఉన్న నిధులతో పనులు పూర్తిచేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు రూ.3.68 కోట్లు వెచ్చించి గ్రౌండ్ ఫ్లోర్ వరకు పూర్తిచేశారు.

**నెలలు గడుస్తున్నా..**

పనులు పూర్తయి ఐదు నెలలు కావస్తోందని, వెంటనే భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని గుత్తేదారు విన్నవించారు. దీనిపై హౌసింగ్ అధికారులు సదరు భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు లేఖ రాయడమే కాక.. జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎవరూ దీన్ని నేటివరకు పట్టించుకోలేదు. ప్రస్తుతం నూతన భవనం అలంకార ప్రాయంగా మారింది. గతంలో ఈ భవనంలో రూ.6 లక్షల విలువచేసే విద్యుత్తు తీగలు చోరీకి గురయ్యాయి. దీన్ని ఇలానే వదిలేస్తే అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. తక్షణమే భవనాన్ని స్వాధీనం చేసుకుని అగ్రి ల్యాబ్ సేవలు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

# రోడ్డే కదా.. పాడైతే మాకేంటి..?

కుప్పం : కుప్పం నియోజకవర్గంలోని గ్రానైట్ క్వారీల నుంచి టన్నుల కొద్దీ బరువైన రాతి దిమ్మెలను ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. రోడ్ల సామర్థ్యం అనుసరించి.. గరిష్ఠంగా 30 టన్నులలోపు బరువును మాత్రమే రవాణా చేయాలి. కానీ ప్రధాన మార్గాలతో పాటు గ్రామీణ రహదారుల్లో.. 40–50 టన్నుల బరువైన రాళ్లను తరలించడంతో రహదారులు దెబ్బతింటున్నాయి.

శాంతిపురం, కుప్పం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో 500 కి.మీ. పైబడి బీటీ రోడ్లున్నాయి. ఇందులో గ్రామీణ, అంతరాష్ట్ర రహదారులే అధికం. స్థానిక క్వారీల నుంచి పొరుగు రాష్ట్రాలకు టన్నుల కొద్దీ గ్రానైట్ రవాణా నిత్యకృత్యంగా మారింది. నిర్దేశిత సామర్థ్యాన్ని మించి రాతి దిమ్మెల తరలింపుతో బీటీ రోడ్లు రూపు కోల్పోతున్నాయి.

కుప్పం–కేజీఎఫ్ అంతరాష్ట్ర డబుల్ రోడ్డు నిర్మాణానికి తెదేపా హయాంలో రూ.30 కోట్లు ఖర్చు చేశారు. ఐదేళ్లకు ఓ దఫా రెన్యువల్ చేస్తున్నారు. రోడ్డు నిర్వహణకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే.. గ్రానైట్ లారీల ధాటికి ఏర్పడిన గుంతలతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. శాంతిపురం మండలం అప్పయ్య తోపు వద్ద లారీల రాకపోకల తీవ్రతకు రోడ్డు దెబ్బతింది.

రాళ్లబూదుగూరు– కోనేరు కుప్పం మార్గంలో గ్రానైట్ లారీల ధాటికి మూడు రోడ్ల కూడలి వద్ద మలుపులో గుంతలు ఏర్పడ్డాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రూ.కోట్లు కేటాయిస్తున్నా..నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో భాగంగా.. రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.కోట్లలో నిధులు కేటాయిస్తోంది. ఏడాది కాలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.53 కోట్లు, పీఆర్ రహదారులకు రూ.45 కోట్లను మంజూరు చేసింది.

# కృత్రిమ కొరత.. అన్నదాత కలత



అనంతపురం: వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో ఖరీఫ్ సాగు ఆలస్యమవుతున్న నేపథ్యంలో పుండుమీద కారం చల్లినట్లుగా కొందరు ప్రైవేటు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. రాయితీపై ఎరువులను ఆధార్ కార్డు ద్వారా విక్రయించాల్సి ఉంది. వ్యాపారులు ఎక్కడికక్కడ నిల్వలను దాచేసి డిమాండ్ పెరిగిన సమయంలో ధరలు పెంచి అమ్ముతున్నారు. ఎవరికి ఎంత విక్రయించారనే వివరాలు నమోదు చేయడం లేదు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో అధికారులు తనిఖీ చేయగా ఎరువుల దుకాణాల్లో స్టాక్ మాయం అయినట్లుగా గుర్తించారు.

**బస్తాపై రూ.50 పెంచి..**

హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువలకు నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో ఎరువులకు డిమాండ్ మొదలవుతుంది. రాయదుర్గం, బొమ్మనహాళ్, కణేకల్లు, గార్లదిన్నె, శింగనమల మండలాల్లో వరి రైతులకు యూరియా, డీఏపీ అధికమొత్తంలో ఎరువులు అవసరం అవుతాయి. ఈ నేపథ్యంలో కృత్రిమ కొరత సృష్టించి బస్తాపై రూ.50 నుంచి రూ.150 వరకు పెంచి విక్రయించేందుకు కొందరు వ్యాపారులు ప్రణాళికలు రచిస్తున్నారు. మరికొందరు తమకు కేటాయించిన ఎరువులను రైతులకు కాకుండా కాంప్లెక్స్ ఎరువులు తయారుచేసే పరిశ్రమలకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**అలంకారప్రాయంగా ఈ–పాస్ యంత్రాలు**

కేంద్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై ఎరువులు అందిస్తోంది. వ్యాపారులు అక్రమాలకు పాల్పడకుండా ఈ–పాస్ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు ఆధార్‌కార్డు నంబరుతో బయోమెట్రిక్ వేయించుకుని ఎరువులు విక్రయించాల్సి ఉంటుంది. జిల్లాలో సగానికి పైగా దుకాణాల్లో ఈ–పాస్ యంత్రాలను మూలనపడేశారు. గోదాముల్లో నిల్వలకు ఈ–పాస్‌లో వివరాలకు పొంతన ఉండటం లేదు.

రాయదుర్గంలోని ఓ ఎరువుల దుకాణంలో బుధవారం అధికారులు తనిఖీ చేశారు. అంతకుముందు రోజు 800 బస్తాలు స్టాక్ వచ్చినట్లుగా రికార్డులో ఉంది. గోదాములో 100 బస్తాలు మాత్రమే ఉన్నాయి. ఒక్కరోజులో 700 బస్తాలు ఎక్కడకెళ్లాయని ప్రశ్నించగా.. రైతులకు విక్రయించానంటూ వ్యాపారి బుకాయించాడు. అందుకు సంబంధించిన బిల్లులు మాత్రం లేవు. దీంతో అధికారులు 6ఏ కేసు నమోదు చేసి దుకాణాన్ని సీజ్ చేశారు.

అనంతపురం పరిధిలో ఎరువులు, పురుగుల మందు డీలర్ల సంఘానికి చెందిన ఓ నాయకుడి దుకాణంలో తనిఖీ చేయడానికి అధికారులు వెళ్లారు. సదరు నాయకుడు స్థానిక ప్రజాప్రతినిధికి ఫోన్ చేసి తనిఖీలు జరగకుండా అడ్డుకున్నారు.

**తనిఖీలు చేస్తున్నాం..** – ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారి

రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్క్వాడ్ జిల్లాలో తనిఖీలు చేస్తోంది. ఇటీవల రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పరిశీలనలో తేలిన అంశాలపై త్వరలోనే నివేదిక అందజేస్తారు. దాన్ని బట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# వాస్తవాలు మాయం.. అక్రమాల మయం



విశాఖపట్నం: వీఎంఆర్‌డీఏ అనుమతించిన లేఅవుట్‌లోని భూములనూ అక్రమార్కులు వదల్లేదు. ఈ లేఅవుట్‌కు సమీపంలో 'బృహత్తర ప్రణాళిక రోడ్డు' ప్రతిపాదించడంతో అక్కడున్న ఖాళీ స్థలంపై కన్నేశారు. ఆ భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి పాసుపుస్తకాలు చేయించి దర్జాగా విక్రయించేశారు. ఇదంతా చేసింది ఓ రెవెన్యూ ఉద్యోగి కావడం గమనార్హం. భీమిలి మండలంలో చోటుచేసుకున్న ఈ సంఘటన అధికారులను విస్మయానికి గురి చేసింది. భీమిలి మండలం నేరెళ్లవలసలో సర్వే నంబరు 27లో 2004లో అప్పటి 'వుడా' అనుమతితో 12.85 ఎకరాల్లో లేఅవుట్ అభివృద్ధి చేశారు. అందులో చాలా మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. 1.5 ఎకరాలు 'ఓపెన్ స్పేస్'గా వదలగా...అందులో ఉద్యానవనాన్ని అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. దీనిని వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళికలోనూ 'గ్రీన్‌బెల్ట్'గానే పేర్కొన్నారు. లేఅవుట్ నిర్వాహకులు సైతం దాన్ని అలాగే అభివృద్ధి చేశారు. 2021లో వీఎంఆర్‌డీఏ కొత్త 'మాస్టర్‌ప్లాన్' తయారు చేసింది. అందులో ఈ లేఅవుట్‌కు దగ్గరగా 70 మీటర్ల రోడ్డును ప్రతిపాదించింది. నాటి వైకాపా ప్రభుత్వంలో కీలక నేత ఇక్కడికి సమీపంలోనే ఆస్తులు కొనుగోలు చేశారు. ఈ పరిణామాలతో ఇక్కడి ఖాళీ స్థలం విలువ భారీగా పెరిగింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.కోట్లలో ఉంటుంది. అప్పటి భీమిలి తహసీల్దార్ కార్యాలయంలోని కొందరు ఉద్యోగుల కన్ను ఆ ఖాళీ స్థలం మీద పడింది. ఓ ఉద్యోగి అతని తల్లి పేరు మీద 80 సెంట్లకు తప్పుడు వివరాలతో పాసుపుస్తకం చేయించేశారు. ఇదంతా నాటి కీలక మండలాధికారి కనుసన్నల్లోనే జరిగినట్లు ఆరోపణలున్నాయి. అక్కడితో ఆగకుండా హైదరాబాద్‌లో ఓ నకిలీ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేయించేశారు. గతంలో ఈ అంశంపై ఫిర్యాదులు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు.

**పార్క్ స్థలాన్ని ధ్వంసం చేసి:** మూడు నెలల కిందట పార్క్ స్థలాన్ని స్వాధీనంలోకి తెచ్చుకోవాలనే ఉద్దేశంతో అక్రమార్కులు కచె నిర్మాణానికి ప్రయత్నించారు. ఈ సమయంలో అక్కడున్న ప్రహరీని పగులుగొట్టి కొన్ని షెడ్లను కూల్చేశారు. పార్క్ లోపలి స్థలాన్ని తవ్వేశారు. మురుగునీటి కాలువలను ధ్వంసం చేశారు. పార్క్‌ను ఆనుకొని జీవీఎంసీ నిర్మించిన తారు రోడ్డును భారీ యంత్రాలతో దర్జాగా తవ్వేశారు. అప్పట్లో భీమిలి పోలీసు స్టేషన్‌లో జీవీఎంసీ అధికారులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఇటీవల మళ్లీ కలెక్టర్‌కు ఫిర్యాదు అందగా కేసు నమోదుకు సిఫార్సు చేశారు. బుధవారం వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు ఇదే అంశంపై ఫిర్యాదు రాగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రణాళిక సిద్ధం.. కదలాలి యంత్రాంగం

రాజమహేంద్రవరం : జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేశారు. స్టేషన్ సమగ్ర పునరాభివృద్ధి(రీ–డెవలప్‌మెంట్) ప్రాజెక్టుకు రైల్వే మంత్రిత్వ శాఖ రూ.271.43 కోట్లు మంజూరు చేశారు. పనులు మాత్రం మొదలు కాలేదు. టెండర్ల దశలోనే తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎంపీ పురందేశ్వరి రైల్వే ఉన్నతాధికారులను కలిశారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**కొత్త ప్రతిపాదనలతో..**

అమృత్ భారత్‌స్టేషన్ పథకంలో తొలుత రూ.250 కోట్లతో పనులకు ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో గతంలో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత సమగ్ర పునరాభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించి కొత్త ప్రతిపాదనలు తెరపైకి వచ్చారు. పశ్చిమ, తూర్పుస్టేషన్లు అభివృద్ధి చేసేలా ఎంపీ పురందేశ్వరి, కూటమి నాయకులు రైల్వే ఉన్నతాధికారులతో చర్చించారు. తిరిగి అంచనాలతో ప్రతిపాదనలు పంపించారు. ఆ మేరకు రైల్వే మంత్రిత్వశాఖ రూ.271.43 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. టెండ్ల ప్రక్రియ మాత్రం మొదలుకాలేదు.

**భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా..**

రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లో రోజూ 90కి పైగా ఎక్స్‌ప్రెస్‌లు ఆగుతుండగా సుమారు 35 వేలమంది ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. 2071–2072 నాటికి గంటకు 9,533 మంది, రోజుకు 95,328 మంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తారనే అంచనాతో పూర్తిస్థాయిలో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు.




ఆ మేరకు వచ్చే పుష్కరాల నాటికి వసతులు సమకూరాలంటే ఇప్పటి నుంచే పనులు జరగాలి.

**చేయాల్సిన పనులు..**

పశ్చిమ వైపు రైల్వేస్టేషన్ సామర్థ్యం, ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు కొత్త జీం3 స్టేషన్ భవన నిర్మాణాలు చేపట్టాలి. తూర్పు వైపు అత్యాధునిక సౌకర్యాల కల్పన, వాణిజ్య స్థలాలతో కూడిన జీం5 స్టేషన్ భవన నిర్మాణం. పెరిగే ట్రాఫిక్‌కు అనుగుణంగా అదనపు ప్లాట్‌ఫామ్‌ల ఏర్పాటు. ప్లాట్‌ఫామ్‌ల అప్‌గ్రేడ్‌లో భాగంగా నిరంతర ఓవర్‌హెడ్ ప్యానెల్స్(సీవోపీలు)తో 17 ఎస్కలేటర్లు, ఏడు లిఫ్టుల నిర్మాణం. రిటైల్ అవుట్‌లెట్‌లు, తినుబండారాలు అందుబాటులో ఉండేలా 24 మీటర్ల వెడల్పు, 110 మీటర్ల పొడవున ప్లాజా నిర్మాణం. స్టేషన్‌కు ఇరువైపులా ఆరు మీటర్ల వెడల్పుతో రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌వోబీ)ల నిర్మాణం. పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధిలో భాగంగా రైల్వేస్టేషన్ వద్ద 300 కార్లను ఉంచే సామర్థ్యంతో నాలుగు పార్కింగ్ స్థలాల అభివృద్ధి. బహుళ–స్థాయి పార్కింగ్ సదుపాయం కల్పించాలి

# ఖరీఫ్‌లో కటకట

పి.గన్నవరం : శివారు ఆయకట్టుకు నీరందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వేసిన చోట్ల నారు మడులు ఎండిపోతున్నాయని నాట్లు వేసేందుకు దమ్ము చేద్దామంటే నీరు అందడం లేదని వాపోతున్నారు. క్లోజర్ పిరియడ్‌లో కొన్ని పిల్లకాలువల్లో పూడిక తీశారు. ప్రధాన పంట కాలువల్లో తీయకపోవడం, బోదెలను బాగు చేయని కారణంగా ఖరీఫ్‌లో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలోని పి.గన్నవరం మండలం నరేంద్రపురం, కుందాలపల్లి, ఉప్పలగుప్తం మండలం పేరాయి చెరువు శివారు ఆదిలక్ష్మీపురం, కూనవరం, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు శివారు రామాలయం పేట, దాసరివారిపేట, ఐచెరువు వంటి శివారు ప్రాంత ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బంది పడు తున్నారు. బుధవారం 'న్యూస్‌టుడే' కుందాలపల్లి, నరేంద్రపురం, పప్పుల వారిపాలెంలో పరిశీలించింది. కుందాలపల్లి నుంచి అవిడి వరకు ఉన్న పంట కాలువలో పూడికను పొక్లెయిన్‌తో తీయిస్తున్నామని, ఖర్చులు తామే భరిస్తున్నామని స్థానిక రైతులు తెలిపారు. ఇక్కడ సుమారు 250 ఎకరాల్లో ఇబ్బంది ఉందన్నారు. నరేంద్రపురంలో సొంత డబ్బులు పెట్టుకుని బోదెను బాగు చేయిస్తున్నారు. ఇక్కడ సుమారు 150 ఎకరాలకు సాగునీరు అందడం లేదని వాపోతున్నారు.

**అంతంతమాత్రంగా నిర్వహణ పనులు**

పంటకాలువల్లో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి తూడు, గుర్రపుడెక్క వంటి పనులు చేసేందుకు ఓఅండ్ఎం నిధులు కేటాయించినప్పటికీ అంతంత మాత్రంగానే చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గన్నవరం ప్రధాన పంటకాలువలో పలుచోట్ల తూడు తొలగించకుండా



తాత్సారం చేస్తున్నారు. ఈ కారణంగా ఇక్కడ ప్రవాహ వేగం తగ్గింది. వర్షాలు లేక..: జూన్ మూడో వారం నుంచి వర్షాలు ఊపందుకోవాలి. జులైలోనూ ఎండలు మండిపోతున్నాయి. వర్షాలు కురిస్తే శివారు ఆయకట్టుకు సైతం సమస్య లేకుండా ఉండేది. ప్రస్తుతం శివారు ప్రాంతాల్లో సమస్య మరింత పెరిగిందని రైతులు తెలిపారు.

**దమ్ముచేద్దామంటే వీలులేదు**

నేను మూడు ఎకరాల్లో వరిపంట సాగు చేస్తున్నాను. ఖరీఫ్ చేలు దమ్ము చేద్దామంటే నీరులేదు. మా ప్రాంతంలో సుమారు 150 ఎకరాలకు ఈ పరిస్థితి నెలకొంది. మూడు రోజులుగా అంతాకలిసి బోదెలో పూడిక తీయిస్తున్నాం. అధికారులు పరిశీలన చేసి సమస్యను పరిష్కరించాలి.

–కోట నాగభూషణం, రైతు, నరేంద్రపురం

**సొంత సొమ్ముతో బాగుచేస్తున్నాం**

ఓ వైపు సముద్రంలోకి గోదావరి జలాలను వదిలేస్తున్నారు. మాకు మాత్రం నీరు అందడం లేదు. కుందాలపల్లి నుంచి అవిడి వరకు పంటకాలువను సొంత డబ్బులు పెట్టుకుని నాలుగు రోజులుగా బాగుచేయిస్తున్నాం. శివారు ఆయకట్టు బీడును తలపిస్తోంది. ఏం చేయాలో అర్థంకావడంలేదు.

–మారిశెట్టి ధనరాజు, రైతు, కుందాలపల్లి

**సమావేశంలో చర్చిస్తాం..** సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఈ నెల 18న పి.గన్నవరం లోని ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం. ప్రధాన పంట కాలువల్లో సాగునీరు పుష్కలంగా ఉంది. –కె.వెంకటేశ్వరరావు, ఈఈ,గోదావరి సెంట్రల్ డెల్టా

# పాతవని పక్కదారి

కర్నూలు : జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో గత విద్యా సంవత్సరం ముగింపు నాటికి పది క్వింటాళ్ల బియ్యం మిగిలింది.. ఆ నిల్వలు మాయం చేశారు. ఇలా చాలా పాఠశాలల్లో గత విద్యా సంవత్సరం ఏప్రిల్ నెల వరకు సరఫరా చేసిన బియ్యం నిల్వలో మిగులు మాయమైనట్లు ఫిర్యాదులందడంతో అధికారులు లెక్కలు తీస్తున్నారు. ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభం నుంచే సన్నబియ్యంతో భోజనం పెట్టాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలకు 25 కిలోల సన్నబియ్యం ప్యాకెట్లు అందించారు. కర్నూలు జిల్లాకు ప్రతి నెలా 880 టన్నులు, నంద్యాలకు 620 టన్నుల మేర సరఫరా చేస్తున్నారు.

**ఆ సరకంతా ఏమైనట్లు**

పాత నిల్వలను జులై నెలలో వారంలో రెండు, మూడు రోజులపాటు అన్నం వండి పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు కంగుతిన్నారు. అప్పటికే సగానికి పైగా పాఠశాల



లు, వసతిగృహాలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాల్లో పాత బియ్యం నిల్వలు మాయమయ్యాయి. ఒక్కో పాఠశాల, వసతి గృహంలో కనీసం రెండు, మూడు క్వింటాళ్లు ఉండాలి. ఒక్క క్వింటా లేని పాఠశాలలు, వసతి గృహాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 160–200 మెట్రిక్ టన్నుల పాత బియ్యం నిల్వలను అమ్మేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

**డీలర్లతో ఒప్పందం**


బియ్యం నిల్వలు లేకపోవడంతో ఒకటి, రెండు బస్తాలను చౌక దుకాణాల నుంచి పాఠశాలల్లో తెప్పించి పెట్టారు. జులైలో విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు తనిఖీలకు రాకుంటే మీ బియ్యం మీకే ఇచ్చేస్తామంటూ డీలర్లతో అనధికారిక ఒప్పందాలు చేసుకున్నారు. ఆ మేరకు ఆగమేఘాలపై చౌక దుకాణాలు, ఇతర మార్గాల్లో పాత బియ్యాన్ని కొన్ని పాఠశాలల్లో నిల్వ ఉంచగా.. మరికొన్ని పాఠశాలలు, వసతిగృహాల్లో పాత నిల్వలు లేేంటూ అధికారులకు నివేదికలు ఇస్తున్నారు. మరికొందరు ఓ అడుగు ముందుకేసి విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసినప్పటి నుంచి పాత బియ్యంతోనే విద్యార్థులకు భోజనం పెడుతున్నామని కాకి లెక్కలు రాసుకుంటున్నారు. లేని బియ్యం ఉన్నట్లు రికార్డుల్లో రాసుకొని మాయ చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# అందొచ్చినా.. అందిపుచ్చుకోరేం..?

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధులు జిల్లాలో సద్వినియోగం కావడం లేదు. మొదటి విడతలో ఎంపిక చేసిన బడుల్లో అరకొరగా పనులు చేపట్టారు. ఈ పథకం కింద కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చుతుంది. గతేడాది ముందస్తుగానే పాఠశాలల ఖాతాల్లో సొమ్ము జమ చేసినప్పటికీ ప్రణాళిక ప్రకారం పనులు చేయకపోవడంతో వెనక్కి మళ్లింది. అన్నీ పక్కాగా ఉంటేనే నిధులు విడుదల చేస్తామని సమగ్ర శిక్షా అధికారులు స్పష్టం చేస్తున్నప్పటికీ కమిటీలు ముందుకు రావడం లేదు.

**ప్రతిపాదనల మేరకు వసతుల కల్పన**

పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రధానోపాధ్యాయుడు, కమిటీ ప్రతినిధులు చేసిన ప్రతిపాదనల మేరకు పీఎంశ్రీ పథకంలో నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటారు. గ్రంథాలయం, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించిన ప్రయోగశాలల నిర్మాణం, మైదానంలో వసతుల కల్పన, ఇంకుడు గుంతల ఏర్పాటుతో భూగర్భజలాల వృద్ధి, విభిన్న ప్రతిభావంతుల కోసం ర్యాంప్‌ల నిర్మాణం, పిల్లలకు ఆకుకూరలు, పౌష్టికాహారం అందించేందుకు వీలుగా కిచెన్‌గార్డెన్, శుద్ధజల ప్లాంట్, ఇతర వసతుల కల్పనకు నిధుల మంజూరుకు చర్యలు చేపట్టారు. 2024లో మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో 33 బడులు ఎంపికయ్యాయి. ముందస్తుగానే నిధులు ఖాతాల్లో జమ చేశారు.




సకాలంలో పనులు నిర్వహించకపోవడంతో ఈ ఏడాది మార్చిలో వెనక్కి మళ్లాయి.

సోంపేట ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద ప్రయోగశాల భవన నిర్మాణం పూర్తి కాగా ఇంకుడుగుంతలు, ర్యాంపులు ఇతర పనులు చేపట్టలేదు. బడి ఖాతాలో నిధులు వెనక్కి మళ్లడంతో మిగిలినవి చేపట్టడానికి చర్యలు తీసుకోవడం లేదు.

మందస మండలం హరిపురం ఉన్నత పాఠశాలలో రన్నింగ్ ట్రాక్, ఇంకుడు గుంతల ఏర్పాటు తప్ప మిగిలిన పనులు చేపట్టలేదు. గ్రంథాలయం భవన నిర్మాణం పునాది దశలోనే ఉంది. కేటాయించిన నిధుల్లో రూ.22.20 లక్షలు మూడు దశల్లో వెనక్కి మళ్లాయి.


**సకాలంలో పూర్తి చేయాలి..**

సకాలంలో పనులు చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి మళ్లాయి. పనులు చేపడితే బిల్లులు చెల్లించడానికి అవకాశం ఉంటుంది. సమగ్ర శిక్షా ఖాతాలోనే నిధులు ఉండటంతో బిల్లుల చెల్లింపునకు ఇబ్బందులు తలెత్తవు. కమిటీ సభ్యులతో మాట్లాడి మిగిలినవి చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. క్రీడా మైదానాల అభివృద్ధి విషయంలో వివాదాలు ఉండటంతో వసతుల కల్పనకు అవకాశం కలగడం లేదు.

ఎం.బెనర్జీ, ఏఈ, సమగ్ర శిక్షా

# పాలిటెక్నిక్ ప్రవేశాలకు సర్వం సిద్ధం..!

ఎచ్చెర్ల: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు కల్పించేందుకు రంగం సిద్ధమైంది. డిప్లొమా కోర్సుల్లో చేరాలనుకునేవారికి శనివారం నుంచి పది రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పాలిసెట్-2025లో అర్హత సాధించిన వారంతా ఇందులో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. హాజరయ్యే విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. జిల్లాలో ఐదు ప్రభుత్వ, నాలుగు ప్రైవేటు ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో అన్ని బ్రాంచులు కలిపి ప్రభుత్వ కళాశాలల్లో 810 సీట్లు, ప్రైవేటులో 1,520 సీట్లు భర్తీ చేయనున్నారు. జిల్లాలో సివిల్, సీఎంఈ, ఈఈఈ, ఎంఈసీ, సీసీపీ, ఈసీఈ, ఏఈఐ బ్రాంచులు అందుబాటులో ఉన్నాయి. గతేడాది అన్ని ప్రభుత్వ కళాశాలల్లోనూ శత శాతం మంది విద్యార్థులకు ప్రాంగణ ఎంపికల్లో వివిధ సంస్థల్లో ఉద్యోగాలు లభించాయి. తక్కువ విద్యార్హతతో ఉద్యోగం రావటమే కాక ఉద్యోగం చేస్తూ బీటెక్ చదువుకునే



వెసులుబాటు సైతం పలు సంస్థలు కల్పిస్తున్నాయి.

**ఇవి గుర్తుంచుకోండి..** కౌన్సెలింగ్‌లో పాల్గొనాలనుకునే విద్యార్థులు ఈ నెల 20 నుంచి 27 వరకు ప్రాసెసింగ్ రుసుం చెల్లించుకోవచ్చు. ఓసీ, బీసీ కేటగిరీ వాళ్లు రూ.700, ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి చెందితే రూ.250 చెల్లించాలి. దీంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు అందజేయాలి. ఆదాయ ధ్రువపత్రాలు 01-01-2022 తర్వాత జారీ చేసినవి మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.


**ఐచ్ఛికాల ఎంపికలో జాగ్రత్త..**

ప్రవేశాల్లో కళాశాలలు, బ్రాంచుల ఎంపికకు సంబంధించి ఈ నెల 25 నుంచి 30 వరకు ఐచ్ఛికాల ఎంపిక ఉంటుంది. వీటిల్లో విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఇంటర్‌నెట్ కేంద్రాలు, ఇతర ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తే మోసపోయే ప్రమాదం ఉంది. ఎవరికీ పాస్‌వర్డు ఇవ్వకుండా సొంత చరవాణి నంబరు ఇచ్చుకోవాలి. కళాశాలల్లోని ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాల్లోనే సిబ్బంది అన్ని విధాల ఉచితంగానే సేవలందిస్తారు. ఏ సందేహం ఉన్నా ఆయా కేంద్రాలను మాత్రమే ఆశ్రయించడం మంచిది. ఏయే రోజుల్లో ఏ ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ ఉంటుందన్న సమాచారం కళాశాలల్లో ప్రదర్శించారు.

**సహాయ కేంద్రాన్ని వినియోగించుకోండి..**

ఎచ్చెర్ల మండలం కుశాలపురంలోని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. అక్కడే పది రోజులపాటు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుంది. ఏరోజు ఎవరు కౌన్సెలింగ్ రావాలి, ఐచ్ఛికాలు ఇచ్చుకోవాలనే వివరాలు అందుబాటులో ఉంచాం. ఎలాంటి సమస్య ఎదురైనా నేరుగా సహాయ కేంద్రానికి వచ్చి సిబ్బందిని సంప్రదించవచ్చు. సహాయ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కె.నారాయణరావు, సహాయకేంద్రం జిల్లా సమన్వయకర్త

# ఆపత్కాలం.. అందని పరిహారం



విజయనగరం : కేంద్రం ప్రభుత్వం 'హిట్ అండ్ రన్' కేసులను ప్రత్యేకంగా పరిగణించి మోటారు వాహన చట్టం కింద ప్రత్యేక పరిహారానికి అవకాశం కల్పిస్తోంది. ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు.. క్షతగాత్రులకు రూ.50 వేలు అందజేస్తున్నా.. అవగాహన లేమి, అధికారులు బాధ్యతారాహిత్యంతో లబ్ధి కోల్పోతున్నారు. పదుల సంఖ్యలో దరఖాస్తులకు సైతం మోక్షం కలగడంలేదు. హిట్ అండ్ రన్ కేసుల విషయంలో కలెక్టర్ అంబేడ్కర్ ఆరు నెలల కిందట సమీక్షించారు. అలసత్వం వద్దని, త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. అయినా అధికార యంత్రాంగంలో చలనం రాలేదు. ఈ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉండడంటతో ఆ దిశగా ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్నారు.

**ఆర్డీవో నోడల్ అధికారిగా..**

ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించలేని పరిస్థితుల్లో పోలీసులు కేసు నమోదు చేసి, నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ విభాగం కింద వచ్చే కేసులకు ఆర్డీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఘటనపై ఎఫ్ఐఆర్ కాపీతో పాటు పూర్తి సమాచారాన్ని పోలీసులు అందజేయాలి. ఆర్డీవో క్షుణ్ణంగా పరిశీలించి, నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తారు. నివేదిక అందిన 15 రోజుల్లో పోలీసులు తుది ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లాలో జాతీయ రహదారులు రాజాపులోవ నుంచి కందివలస గెడ్డ, చెల్లూరు నుంచి గజపతినగరం రోడ్డు మీద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. కొందరు మృత్యువాత పడుతుంటే మరికొందరు తీవ్రంగా గాయపడి వికలాంగులుగా మిగిలిపోతున్నారు.

**దరఖాస్తుల సమర్పణ ఇలా..**

క్షతగాత్రులు, మృతుల కుటుంబ సభ్యులు తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. క్షతగాత్రులు ఫారం-1 ద్వారా వ్యక్తిగత వివరాలతో పాటు ఘటనా స్థలం, సాంకేతిక ఆధారం, సమయం, ప్రమాద తీవ్రత పత్రం, ఎఫ్ఐఆర్, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జతచేయాల్సి ఉంది. మృతుల తల్లిదండ్రులు లేదా జీవిత భాగస్వామి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. పోస్టుమార్టం నివేదిక, మరణ ధ్రువపత్రం జతచేసి సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులకు అందజేయాలి. సొంత ఖర్చులతో చికిత్స పొందిన తరువాత పరిహారం పొందాలంటే ఫారం-4 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. చికిత్సకు సంబంధించిన రశీదులు సమర్పించాలి. అధికారులు దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత విషయాలను ఫారం-2, ఫారం-3లో నమోదు చేసి కలెక్టరేటుకు పంపాలి. కలెక్టర్ పరిశీలించి ఆమోదం తెలుపుతారు.

**చర్యలు తీసుకుంటున్నాం..**హిట్ అండ్ రన్ కేసుల్లో ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు. చర్యలు తీసుకుంటున్నాం. రహదారుల మీద పెట్రోలింగ్, అంబులెన్సు వ్యవస్థ నిఘా పెట్టాలని సూచించాం. బీమా కంపెనీలకు అవసరమైన పత్రాలు ఇవ్వడానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ఎం.శ్రీనివాసరావు, డీఎస్పీ, విజయనగరం

# తవ్వేయ్.. తరలించేయ్!



గజపతినగరం : కళ్లెదుటే రోజూ ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. మండలంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కీలక నేతలు ఉన్న తుమ్మికాపల్లిలో ఇసుక తవ్వకాల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. గ్రామానికి చెందిన కొందరు రోజూ చంపావతి నదిలో ఇసుకను తవ్వేసి.. సమీపంలోని కల్లాలు, బీడు భూముల్లో కుప్పలుగా నిల్వ చేసి.. సొమ్ము చేసుకుంటున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని నారాయణపట్నం, జరజాపుపేట, నెల్లిమర్ల, కొండపేట, కుదిపి, నీలంరాజుపేట, సారిపల్లి ప్రాంతాల్లో చంపావతి నదిలో ఇసుక తవ్వకాలునిత్యం ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నీటి పథకాలు, వంతెనలకు 500 మీటర్లలోపు తవ్వకాలు చేపట్టకూడదని నిబంధనలు ఉన్నా.. కొందరు వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి తవ్వేస్తున్నారు. వంతెనలు, ఊటబావులకు అనర్థం తెస్తున్నారు. రాత్రివేళల్లో పదుల సంఖ్యలో వాహనాల్లో తరలిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ శ్రీకాంత్ వద్ద వివరణ కోరగా నదిలో తవ్వకాలను నియంత్రిస్తాం. వంతెనలు, ఊటబావులున్న చోట కందకాలు ఏర్పాటు చేస్తామన్నారు.

**రైతుల ఆవేదన..** నదిని తవ్వేయడం వల్ల భూములు స్వభావాన్ని కోల్పోతాయని, వరద వచ్చినప్పుడు తమ భూములు కోతకు గురవుతాయని సమీపంలో పొలాలున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని గ్రామంలోని నాయకులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు.

**నిబంధనలు గాలికి..**

ఇసుకను సొంత అవసరాలకు సచివాలయంలో నమోదు చేసుకుని ఉచితంగా తరలించుకోవచ్చుననే నిబంధనను ప్రభుత్వం విధించింది. దీన్ని ఎవరూ పాటించడం లేదు. నేరుగా తవ్వుకుని విక్రయించేస్తున్నారు. తుమ్మికాపల్లికి చెందిన మరిడమ్మ గుడి రహదారి నుంచి నేరుగా వెళ్తే చంపావతి నదిలో మంచి ఇసుక లభ్యమవుతుంది. ఇతర గ్రామాలవారు వచ్చినా ఇసుక లేదని పంపించేస్తున్నారు. నది పక్కన గతం నుంచి కొందరు సాగుచేసే భూముల్లో కూడా మంచి ఇసుక ఉండడంతో వాటిని కొంతమంది విక్రయిస్తున్నారు. ట్రాక్టరు ఇసుకను రూ.200 నుంచి రూ.300 వరకు కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం**రత్నకుమార్, తహసీల్దారు, గజపతినగరం

తుమ్మికాపల్లి వద్ద ఇసుక తవ్వకాలకు అనుమతుల్లేవు. నిబంధనల ప్రకారం సచివాలయంలో నమోదుచేసి, ఏ పనికి వినియోగిస్తున్నారనేది తెలియజేయాలి. కుప్పలు వేసేందుకు వీల్లేదు. నదిలో విక్రయాలు జరిపేవారిపైనా చర్యలు తీసుకుంటాం.

# మిద్దె తోటలో కాసుల కాడలు

కర్నూలు : "ఒక కుటుంబం (నలుగురు సభ్యులు) కూర చేసుకోవడానికి నిత్యం రూ.100-రూ.150 వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఇంట్లోనే కూరగాయలు పండిస్తే ఆ డబ్బులు మిగిలిపోతాయి. రోజుకు రూ.100 లెక్కన ఏడాదికి రూ.36,000 మిగులుతాయి. నెలనెలా రూ.100 మ్యూచువల్ ఫండ్ ఇతర సంస్థల్లో పొదుపు చేస్తే... ఏడాదికి 10% లెక్కకు రూ.37,696, 12% లెక్కకు రూ.38,047 అవుతాయని ఆర్థిక నిపుణుల అంచనా. డబ్బులు మిగలడమే కాదండోయ్ తోటలో ఒక గంట పని చేస్తే 300 కేలరీలు ఖర్చు చేసి ఆరోగ్యానికి బాటలేసుకోవచ్చు."ఇంట్లో తోటలు ఎలా పెంచాలనేదీ మీ సందేహం కదూ..! మీ ఇంటి మిద్దెపై సెంటు స్థలం ఉన్నా మీ ఇంటికి సరిపడా కూరగాయలు ఎంచక్కా సాగు చేసుకోవచ్చు. పురుగు మందుల అవశేషాలు లేని రుచికరమైన కూరగాయలను స్వయంగా పండించొచ్చు. తొలకరి వచ్చేసింది.. మిద్దె తోటల సాగుకు అనుకూలమైన వాతావరణం.. ఈ రోజే మొదలు పెట్టండి.!!

**బయట విషతుల్యం**ప్రతి మనిషి నిత్యం సగటున 300 గ్రాములు (విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు, పిండి పదార్థాలున్నవి) కూరగాయలు, 92 గ్రాముల పండ్లు తీసుకోవాలని ఉద్యానశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13.50 లక్షల కుటుంబాలున్నాయి. ఏటా రెండు వేల హెక్టార్ల మేర కూరగాయల పంటలు సాగవుతుండగా అన్ని రకాలు కలిపి 1,29,987 టన్నులు ఉత్పత్తి అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాకు నిత్యం వేయి టన్నులు అవసరం కాగా, నిత్యం 360 టన్నులే ఉత్పత్తి అవుతోంది. రోజువారీగా 640 టన్నుల కొరత ఉంది. దీంతో ఉత్పత్తి త్వరగా పెంచాలన్న ఉద్దేశంతో విపరీతంగా మందులు పిచికారీ చేసి విషతుల్యం చేస్తున్నారు. వాటిని తినడం వల్ల అనారోగ్య సమస్యలొస్తున్నాయి. ఐదేళ్ల కిందటి కూరగాయల ధరలు పోలిస్తే కిలోపై రూ.10 నుంచి రూ.70 వరకు పెరుగుదల కనిపిస్తోంది. సరాసరి కిలోకు రూ.60 వెచ్చించాల్సి వస్తోంది.మట్టి నింపి: మిద్దెపై సెంటు స్థలమున్నా తోటలు పెంచుకోవచ్చు అంటున్నారు అనుభవజ్ఞులు గుజరాతి ఎల్లప్ప. పీవీసీ పైపులతో స్టాండ్లు ఏర్పాటు చేసుకోవాలి. వాటిపై ఖాళీ ప్లాస్టిక్ డబ్బాలు పెట్టాలి. ఆ ఖాళీ డబ్బాల్లో ఎర్రమట్టి నింపి.. వర్మీకంపోస్టు, పశువుల పేడ నింపాలి. ఇవన్నీ మన చుట్టుపక్కలే లభిస్తాయి.. పెద్దగా ఖర్చు పెట్టాల్సిన పని ఉండదు.విత్తనం వేసి: విత్తన దుకాణాల్లో కూరగాయలు, ఆకుకూరలు విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి. ఒక ప్యాకెట్ రూ.10-20కు విక్రయిస్తారు. పండ్లు, పూల మొక్కలు అయితే నర్సరీల్లో తెచ్చుకోవాలి.ఇంటి వ్యర్థాలే ఎరువు: మొక్కల ఎండిన ఆకులు తొలగించి ఓ బకెట్‌లో నిల్వ ఉంచాలి. కూరగాయల వ్యర్థాలూ అందులో వేయాలి. వాటిపై కొద్దిగా మట్టి వేసి ఆవు మూత్రం చల్లితే కంపోస్టు ఎరువు తయారవుతుంది.సలహా బృందాలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో టెర్రస్ గార్డెన్ వాట్సప్ గ్రూపులు రెండున్నాయి. ఈ రెండు బృందాల్లో వెయ్యి మంది వరకు ఉన్నారు. 94411 37933, 94400 51336 చరవాణి నంబర్లను సంప్రదించవచ్చు నంబర్లను సంప్రదిస్తే కొత్తగా మిద్దె తోటలు పెంచుకునేందుకు ముందుకొచ్చే వారికి సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు అవసరమైన అందిస్తారు.

# కాసులిచ్చేయ్.. కానిచ్చేయ్!

ఒంగోలు : పిల్లలకు పాఠం ఎలా చెబుతున్నారో అంచనా వేయడంలో కీలకమైన బీఈడీ ప్రయోగ పరీక్షలు ప్రహసనంగా మారాయి. ముడుపులు సమర్పించుకుంటే చాలు.. ఇలా వచ్చి అలా సంతకం చేసి వెళ్లిపోతే చాలు... ఎలాంటి పరీక్షలను ఎదుర్కోనక్కర్లేదు. కొంచెం సొమ్ములు ఎక్కువగా ఇచ్చుకుంటే పరీక్ష కేంద్రానికి వెళ్లకున్నా హాజరైనట్లు మార్కులు వేసేస్తున్నారు.. పరీక్షల నిమిత్తం ఒక్కో విద్యార్థి నుంచి రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం (ఏకేయూ) అధికారులు పట్టించుకోకపోవడంతో ఇక్కడ అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది.

జిల్లాలోని వందకుపైగా బీఈడీ కళాశాలలు ఏకేయూ పరిధిలో నడుస్తున్నాయి. అధిక శాతం కళాశాలల్లో బిహార్, ఒడిశా, ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారు చదువుతున్నారు. కొన్ని కళాశాలల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులే లేకపోవడం గమనార్హం. ఒక్కొక్కరి నుంచి రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. ఫీజుల వసూళ్లే లక్ష్యంగా ఎలాంటి తరగతుల నిర్వహించకుండా కాగితాలపైనే కళాశాలలు నడుస్తున్నాయి. పర్యవేక్షణ యంత్రాంగం చోద్యం చూస్తుండడంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా విద్యా వ్యాపారం సాగుతోంది. ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఫీజులు కట్టేసి పరీక్షల సమయానికి హాజరైతే సరిపోతుంది. పరీక్షల సమయంలో బీఈడీ కళాశాలలు ఎక్కువగా ఉన్న మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి ప్రాంతాల్లో లాడ్జీలు ఉత్తరాది విద్యార్థులతో కిటకిటలాడుతుంటాయి.




వీరు రాయాల్సిన రికార్డులు, బోధన సామగ్రి వంటివి ఏమి చూపనక్కర్లేదు. అంతా ఆయా కళాశాలల నిర్వాహకులే చూసుకుంటున్నారు. ప్రస్తుతం గత మూడు రోజులుగా ప్రయోగ పరీక్షలు జరుగుతున్నాయి. కొంతమంది విద్యార్థులు మొక్కుబడిగా హాజరై వెళ్లిపోతున్నారు. ఎగ్జామినర్లు, స్క్వాడ్ బృందాలు.. ఏ మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. గతంలో బీఈడీ కళాశాలలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) పరిధిలో నడిచేవి. గతేడాది పరీక్షలు ఈ విశ్వవిద్యాలయం పరిధిలోనే జరిగాయి. పరీక్షలు మొక్కుబడిగా నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం ఏకేయూ ఆధ్వర్యంలోనే పరీక్షలు జరుగుతున్నా తీరు మారకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

**రూ.కోటిన్నర ఎవరి జేబుల్లోకి...**

ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రయోగ పరీక్షల నిమిత్తం కొన్ని కళాశాలల్లో ఒక్కో విద్యార్థి నుంచి కనీసం రూ.5 వేలు వసూలు చేస్తున్నారని బాహాటంగానే చెబుతున్నారు. విద్యార్థి నుంచి ఎంత వసూలు చేసుకున్నా గానీ ఒక్కో కళాశాల నుంచి రూ.లక్షన్నర కప్పం కట్టాల్సిందేనని కొంతమంది అధికారులు హుకుం జారీ చేసినట్లు సమాచారం. వంద కళాశాలల నుంచి వసూలు చేసిన రూ.కోటిన్నర మొత్తం ఎవరి జేబుల్లోకి వెళుతోందన్నదే ఆసక్తిగా మారింది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**

బీఈడీ కళాశాలల తీరుపై ఇప్పటికే ఫిర్యాదులొచ్చాయి. వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. ప్రయోగ పరీక్షల నిర్వహణపై ఎవరైనా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. సంబంధిత కళాశాల నిర్వాహకులైనా, విశ్వవిద్యాలయం సిబ్బంది పాత్ర ఉన్నా చర్యలు తీసుకుంటాం.డీవీఆర్‌మూర్తి, వీసీ, ఏకేయూ

# పాపం... పనిలేక కాలక్షేపం!

ఒంగోలు : జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు పని లేకుండాపోయింది. వీరందరూ ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు నుంచి మండల విద్యావనరుల కేంద్రాల వద్ద కాలక్షేపం చేస్తున్నారు. వీరిని గడిచిన విద్యాసంవత్సరంలో డిప్యుటేషన్‌పై అవసరమైన పాఠశాలల్లో నియమించారు. విద్యాసంవత్సరం చివరి రోజు రిలీవ్ చేసి సొంత ఎయిడెడ్ పాఠశాలలకు పంపారు. వీరిని తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై అధికారులు నిర్ణయం తీసుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, పురపాలక యాజమాన్యాల కింద పనిచేసే ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులతో పాటు ఇప్పటికే విద్యార్థుల్లేక మూతపడిన పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి అవసరమైన పాఠశాలల్లో నియమించాల్సి ఉంది. జిల్లాలో మూడేళ్ల కిందట విద్యార్థుల్లేక 14 ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు మూతపడ్డాయి. ఇలా మూసేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య చూస్తే.. యర్ర గొండపాలెం డీఎంబీసీ ఉన్నత పాఠశాలలో 8 మంది, కొమరోలు



మండలం నల్లగుంటలో ముగ్గురు, గిద్దలూరు వివేకానందలో అయిదుగురు, గిద్దలూరు ఎస్పీజీలో ఆరుగురు ఉపాధ్యాయులున్నారు. దొనకొండ, ఒంగోలు, మార్కాపురం, అర్ధవీడు, పమిడిపాడు ఎయిడెడ్ పాఠశాలలు మూతపడగా, వాటిల్లోని ఉపాధ్యాయులు ఖాళీగా ఉన్నారు. గడిచిన రెండేళ్లుగా వీరిని ఎంఈవోల పూల్‌లో ఉంచారు. కొందరిని ఏరోజు ఎక్కడ అవసరమైతే అక్కడకు పంపగా, మరికొందరి డిప్యుటేషన్‌పై పాఠశాలల్లో నియమించారు.

**పోస్టులు భర్తీ కాక...**ఇటీవల బదిలీల కౌన్సెలింగ్ అనంతరం పశ్చిమ ప్రాంతంలోని యర్రగొండపాలెం, అర్ధవీడు, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దొనకొండ తదితర మండలాల్లోని మారుమూల గ్రామాల పాఠశాలల్లో పోస్టులు ఖాళీగా ఉండగా, వీటిని ఎవరూ కోరుకోలేదు. విధులకు దూరంగా ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులను తాత్కాలికంగా ఆయా పాఠశాలల్లో నియమిస్తే బోధన కుంటుపడకుండా ఉంటుంది. వీరికి కౌన్సెలింగ్ జరిపి శాశ్వత పోస్టింగులు ఇచ్చేవరకు అవసరమైనచోట నియమించుకోవచ్చు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

చురకలు



# అధికారం అండతో అడ్డగోలు నిర్మాణం

కదిరి : వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఫర్వాలేదన్నట్లు.. అధికారం.. అవకాశం ఉందికదా అని.. అడ్డగోలు నిర్మాణానికి తెరలేపారు. పరిశ్రమలు స్థాపించి పది మందికి ఉపాధి చూపించాల్సిన చోట.. స్వలాభార్జనకు ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేపట్టారు. కదిరి పారిశ్రామికవాడలో యథేచ్ఛగా సాగుతోన్న తతంగమిది.

కరవుకు నెలవైన కదిరి ప్రాంతంలో వ్యవసాయంతోపాటు పరిశ్రమలను ఏర్పాటుచేసి జీవనోపాధికి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం దశాబ్దాల కిందటే చర్యలు చేపట్టింది. 1974లో మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ పరిధిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ పరిశ్రమల స్థాపనకు దాదాపు 50 ఎకరాల భూమి కేటాయించింది. 90 మందికి స్థలాలు కేటాయించి, వారికి అవసరమైన మౌలిక



వసతులు కల్పించింది.

**నిబంధనలు తుంగలో తొక్కి..**

పారిశ్రామికవాడలో ఇటుకల బట్టీ ఏర్పాటుకు కొనుగోలు చేసిన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడుతున్నారు. అడ్డుకోవాల్సిన ఓ అధికారే అండగా నిలిచారన్న ఆరోపణలున్నాయి. గతంలో నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నా.. వెనక్కి తగ్గలేదు. కొద్దిరోజులు స్తబ్దుగా ఉన్న వ్యక్తులు మళ్లీ పనులు ప్రారంభించడం గమనార్హం. పారిశ్రామికవాడలో యథేచ్ఛగా కబ్జాపర్వం సాగుతోంది. కుమ్మరవాండ్లపల్లికి శివారున ఉన్న పారిశ్రామికవాడ ప్రాంతానికి ఎగువప్రాంతంలో కొండలు, చెరువులు ఉన్నాయి. వర్షాకాలంలో కొండల్లో నుంచి ప్రవాహానికి అనుగుణంగా పెద్దకాలువలు ఉండేవి. కుమ్మరవాండ్లపల్లె పట్టణంలో కలిసిపోవడంతో స్థలాల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఫలితంగా ఆక్రమణలు పెరిగిపోయాయి. కాలువలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టేస్తున్నారు. అడ్డుకోవాల్సిన యంత్రాంగం కన్నెత్తి చూడలేదు. మూడేళ్ల కిందట కురిసిన భారీవర్షాలకు పలు పరిశ్రమలు జలమయం కావడంతో ముడిసరుకు, యంత్రాలు పాడయ్యాయి.

**ప్రభుత్వానికి నివేదిక పంపుతాం: రామ్, ఏపీఐఐసీ సీజీఎం**

కదిరి పారిశ్రామికవాడలో అక్రమ కట్టడంపై స్థానిక ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ నుంచి ఫిర్యాదు అందింది. దీంతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపాం. నివేదికను ప్రభుత్వానికి పంపుతాం.

# చిత్తశుద్ధి లేక.. రక్షిత నీరు అందక!

అనంతపురం : రక్షిత తాగునీరు సరఫరాలో చిత్తశుద్ధి కన్పించడం లేదు. క్షేత్రస్థాయిలో నిర్ణీత గడువు మేరకు ట్యాంకులను శుభ్రం చేస్తున్న దాఖలాలు లేవు. ఉమ్మడి అనంత జిల్లాలోని నగర, పురపాలికల్లో ఈ దుస్థితి నెలకొంది. వేసవిలో మలినాలు, బురద జలాశయాల్లో అడుగు భాగానికి చేరుతుంది. ప్లాంట్లలో శుద్ధి చేసిన అనంతరం ట్యాంకులకు నింపి.. నివాసాలకు సరఫరా చేసే సమయంలో స్వచ్ఛంగానే కనిపిస్తాయి. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు రావడంతో జలాశయాల్లోని మట్టి పైకి చేరడంతో పాటు కొంత మేరకు రంగు మారే అవకాశం ఉంటుంది. దీంతో ట్యాంకుల అడుగు భాగాన మట్టి చేరే ప్రమాదం ఉంటుంది. ఈనేపథ్యంలో కనీసం 15 రోజులకు ఓసారి ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉంటుంది. కొన్ని పురపాలికల్లో సిబ్బంది, నిధుల కొరతతో నిర్ణీత సమయానికి బ్లీచింగ్ పొడితో చేయకపోవడం.. మరికొన్ని చోట్ల శుభ్రం చేయకున్నా.. చేసినట్లుగా తేదీలు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

**కొనుగోలు చేస్తూ..** పురపాలిక: హిందూపురం

జనాభా: 1.78 లక్షలు ట్యాంకులు: 19

రోజూ అవసరమయ్యే నీరు: 21 మిలియన్ లీటర్లు

ప్రతి 15 రోజులకు ఓసారి ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మున్సిపల్ నీటిని ఇతర అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. వంట చేయడానికి, తాగడానికి శుద్ధి చేసిన నీరు బిందె రూ.10 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని



మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు.

**వారానికి ఓసారి చేస్తారంట!**

అనంతపురం 3,46,262 29 46.75 మిలియన్ లీటర్లు

పీఏబీఆర్ జలాశయంలో పంపింగ్ చేసిన నీటిని ముద్దలాపురం వద్ద ఉన్న ప్లాంటులో శుద్ధి చేసిన అనంతరం నగరంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులకు నింపుతారు. 40 కిలోమీటర్ల నుంచి నీరు వస్తుండటంతో వారానికి ఓసారి శుభ్రం చేయాల్సి ఉంటుంది. నగరంలోని పలు ట్యాంకుల వద్ద శుభ్రం చేసిన తేదీ, మళ్లీ చేయాల్సిన తేదీ నమోదు చేయాలి. చాలా చోట్ల ఆ వివరాలు లేవు.

**అరకొరగానే..**

ధర్మవరం 1,65 లక్షలు 14 17 మిలియన్ లీటర్లు

మున్సిపాలిటీ అధికారులు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో పలు వీధులకు కలుషితమైన నీరు సరఫరా అవుతోందని పట్టణ ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. శివారు కాలనీలకైతే సరఫరా అధ్వానంగా ఉండటంతో డబ్బులిచ్చి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

తాడిపత్రి 1.30 లక్షలు 6 16.5 మిలియన్ లీటర్లు

తాడిపత్రిలో కొన్నిచోట్ల నీరు కలుషితంగా వస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. దుర్వాసన, రంగు మారి రావడంతో తాగలేకున్నామని వాపోతున్నారు. దీంతో ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. పలు ప్రాంతాల్లో రెండు నెలలకు ఒకసారి కూడా శుభ్రం చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ (నీటి సరఫరా) తేజను వివరణ కోరగా క్రమం తప్పకుండా ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నామని, ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

# దిగుబడిలో విశిష్టం.. నాణ్యతలో శ్రేష్ఠం



అనంతపురం : బెట్ట, తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే వేరుసెనగ విత్తనాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. తిరుపతి వ్యవసాయ పరిశోధనా స్థానంలో కే-6, ఐసీజీ (ఎఫ్‌డీఆర్‌ఎస్)-79 రకాలను సంకరం చేసి అభివృద్ధి చేసిన ఈ వంగడానికి టీసీజీఎస్-1694 (విశిష్ట)గా నామకరణం చేశారు. ప్రయోగాత్మక సాగులో మంచి ఫలితాలు రావడంతో ఈ ఖరీఫ్ నుంచి విత్తనాభివృద్ధికి సన్నహాలు చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో రెండు ఎఫ్‌పీవో (రైతు ఉత్పత్తిదారుల సంఘం)ల పరిధిలో 500 హెక్టార్లలో ఈ రకాన్ని సాగు చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం రైతులకు ఉచితంగా 750 క్వింటాళ్ల విత్తనాన్ని పంపిణీ చేసే ప్రక్రియను మొదలు పెట్టారు. మరో రెండు, మూడేళ్లలో రైతులకు పూర్తి స్థాయిలో ఈ రకం విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**కే-6 కంటే**

రాష్ట్రంలో వేరుసెనగ రైతులు కదిరి-6 రకాన్ని ఎక్కువగా సాగు చేస్తున్నారు. కే-6లో వర్షధారంగా ఎకరాకు 6, బోర్ల కింద 10 క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. శాస్త్రవేత్తలు కొత్తగా అభివృద్ధి చేసిన టీసీజీఎస్-1694 (విశిష్ట) రకంలో వర్షధారంగా ఎకరాకు కనీసం 8 నుంచి 10 క్వింటాళ్లు, బోర్ల కింద అయితే 12 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని చెబుతున్నారు. అలాగే ఈ వంగడం 25-30 రోజుల వరకు బెట్ట పరిస్థితులను తట్టుకుని నిలబడుతుందని పేర్కొంటున్నారు. అనంతపురం లాంటి వర్షాభావ ప్రాంతంలో విశిష్ట రకం వంగడాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని స్పష్టం చేస్తున్నారు. కే-6 రకంతో పోలిస్తే ఇందులో గింజ దిగుబడి కూడా అధికంగానే ఉంటోంది. విశిష్ట రకంలో కాయలన్నీ ఒకేసారి పక్వానికి వస్తుండటంతో దిగుబడి నాణ్యత బాగుంటుందని గింజశాతం 75, నూనె 50 శాతం ఉంటోందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

**తెగుళ్ల సమస్య ఉండదు** వేరుసెనగలో ప్రధానంగా కనిపించే ఆకుమచ్చ తెగులును విశిష్ట రకం పూర్తిస్థాయిలో తట్టుకుంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కే-6 రకంలో ఆకుమచ్చ తెగులు సమస్య అధికంగా కనిపిస్తోంది. కే-6 రకంలో ఒకసారి తెగులు సోకితే నియంత్రించడం చాలాకష్టం. కనీసం 6 సార్లు పురుగుల మందులు పిచికారీ చేయాల్సివస్తోంది. దీంతో పెట్టుబడి భారం పెరిగిపోతుంది. పంట చివరి దశలకు వచ్చేసరికి నల్లగా మారి పశుగ్రాసానికి పనికి రాకుండా పోతోంది. విశిష్ట రకంలో పంట చివరివరకు ఆకుపచ్చగానే ఉంటుంది. రెండుసార్లు మందులు పిచికారీ చేసుకుంటే సరిపోతుంది. దీంతో కే-6తో పోలిస్తే ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు పెట్టుబడి తగ్గుతుందని కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# ఎర్రపండు ఏడిపిస్తోంది..!



పుంగనూరు: మంచి ఆదాయం వస్తుందనే ఆశతో.. ఉత్సాహంగా సాగు చేసిన టమాటా పంట రైతులకు ఊహించని నష్టాలు తెచ్చి పెట్టింది. పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో టమాటా సాగు చేసిన రైతన్నలకు ఊజీ వైరస్ కోలుకోలేని దెబ్బ తీస్తోంది. ఈ సీజన్ ప్రారంభం నుంచి ధరలు లేవు. ఈ పది రోజుల్లో స్వల్పంగా ధర కొంత పెరిగినా ఊజీ ఈగ వైరస్ ప్రభావంతో పంట నాణ్యత దెబ్బతింది. దీంతో సగానికి సగం కాయలు పారబోయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఉన్న ధరలతో పోల్చుకుంటే ఎకరాకు రూ.4.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రావాలి. అయితే పంట నాణ్యత లేక సగం కాయలు పశువులకు మేతగా రోడ్ల పక్కన, పొలాల్లో పారబోస్తున్నారు. దీంతో పెట్టుబడులు దక్కే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఐదువేల ఎకరాల్లో టమాటా తోటలు ఉన్నాయి. వాటిలో 15 వందల ఎకరాల తోటలకు ఊజీ ఈగ వ్యాపించింది. ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.2.50లక్షల వరకు వెచ్చించి పండించిన టమాటా కోతకు వచ్చిన దశలో ఇలా దెబ్బతింటుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. అమ్ముకునే దశలో ఇలా పారబోయాల్సి వస్తుండటంతో నట్టేట మునిగిపోతున్నామని రైతులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు.

**అధిక నష్టమిలా..** ఊజీ ఈగ టమాటాను ఆశించి అధిక నష్టం కలుగజేస్తోంది. కాయలను గాయపరచి కాయ లోపల గుడ్లు పెడతాయి. గుడ్ల నుంచి బయటకు వచ్చిన లార్వా కాయలను తింటాయి. వేసవిలో లోతు దుక్కులు చేయడం ద్వారా భూమి లోపల ప్యూపా దశలో ఉన్న పండు ఈగను నాశనం చేయవచ్చు.

**ధరలు లేవు..: నవీన్, రైతు**

ఊజీ ఈగతో దెబ్బతిన్న పండ్లకు ధరలు లేవు. వ్యాపారులు సైతం రంధ్రాలు ఉన్న కాయలను వేరు చేస్తేనే కొనుగోలు చేస్తామంటున్నారు. సాధారణంగా 15 కిలోల టమాటా పెట్టె రూ.220లు పలుకుతుంటే.. పంటను కొనడమే లేదు.

**గ్రేడింగ్ చేస్తేనే..: మునిరాజ, రైతు**

టమాటా ధరలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. గ్రేడింగ్ చేస్తేనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో కోసే కూలీలు కాకుండా గ్రేడింగ్‌కు అదనంగా కూలీలను పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది.

# రూ.200 మిగలబెట్టి.. రూ.30 వేలు ఖర్చుపెట్టి..



చిత్తూరు : రూ.200తో అయ్యే పని.. రూ.25-30 వేలు ఖర్చుపెట్టడమంటే అందరికీ అంత సులభం కాదు.. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులకే సాధ్యం.. వైకాపా హయాంలో ఎస్పీడీసీఎల్ అవినీతి, అక్రమాల్లో కూరుకుపోగా.. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయినా వైకాపాతో అధికారుల హవా సాగడంతో వారి అనాలోచిత నిర్ణయాలు సంస్థను మరింత అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. వినియోగదారులకు సేవలు మరింత కష్టతరం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే నియంత్రికల ఆయిల్ లీకేజీ బ్యాచ్ వ్యాన్ వ్యవస్థను ఈ ఏడాది మే నుంచి రద్దు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నియంత్రికల నిర్వహణ, మరమ్మతులకు ఏఈ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఆయిల్ లీకేజీ బ్యాచ్(బృందం) ప్రత్యేక వాహనంలో వెళ్లి గుత్తేదారుతో విద్యుత్తు సరఫరా పునరుద్ధరించేవారు. ఒక నియంత్రిక మరమ్మతుకు రూ.200 చొప్పున విద్యుత్తు సంస్థ లీకేజీ బ్యాచ్ వాహనం సంబంధిత గుత్తేదారుకు చెల్లించేది. ఈ విధానం పాతికేళ్లుగా ఎస్పీడీసీఎల్ పరిధిలో కొనసాగుతోంది. తద్వారా వినియోగదారులకు సత్వర సేవలు, సంస్థకు ఆర్థిక భారం ఉండేదికాదు.

**అనాలోచిత నిర్ణయం..** వైకాపాతో అంటకాగిన ఉన్నతాధికారులు అనాలోచిత నిర్ణయాలతో నియంత్రికల ఆయిల్ లీకేజీ బ్యాచ్ వ్యాన్ వ్యవస్థను రద్దు చేయడంతో సంస్థకు ఆర్థిక భారాన్ని తెచ్చిపెట్టడంతో పాటు ప్రజలకు సేవలను దూరం చేశాయి. ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నియంత్రికల్లో ఏ చిన్నపాటి సమస్య వచ్చినా మావల్ల కాదు.. నియంత్రికల మరమ్మతు కేంద్రానికి తీసుకెళ్లాల్సిందేనని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. దీంతో ఏం చేయలేక.. ఈ కేంద్రాల్లో చిన్నపాటి సమస్య ఉన్నా నియంత్రిక కాలిపోయిందంటూ.. నూతన వైండింగ్ చేపట్టి మరమ్మతుకు రూ.20-30 వేల వరకు ఖర్చు చేస్తున్నారని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు.

**సమయాభావంతో మరిన్ని ఇక్కట్లు..** నూతన విధానం వల్ల మరమ్మతుల పేరుతో తీసుకెళ్లిన నియంత్రికను ఎప్పుడు అమర్చుతారో తెలియదు. అప్పటి వరకు సరఫరా ఉండదు. సమయాభావంతో పంటలు ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయని.. లీకేజీ బ్యాచ్ వాహనంతో వెంటనే సేవలు నియంత్రికల నిర్వహణ బాగుండేదని రైతులు పేర్కొంటున్నారు. పాత పద్ధతినే కొనసాగించాలని వినియోగదారులు కోరుతున్నారు.

**వాహన సేవల పునరుద్ధరణకు ప్రతిపాదన..**

ఆయిల్ లీకేజీ బ్యాచ్ వాహన సేవలు బాగున్నాయి. వాటిని రద్దు చేశారు. ఈ బ్యాచ్ వాహన సేవలు పునరుద్ధరించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నాం.

ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

# నగదు జమ.. పనులు మమ..!

శ్రీకాకుళం : నిరుపేదలకు జగనన్న కాలనీల్లో ఇచ్చిన ఇంటి స్థలాలు ఊరు శివారుల్లో, కొండకోనల్లో ఉండటంతో లబ్ధిదారులు కట్టుకునేందుకు వెనకంజ వేస్తున్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నా లబ్ధిదారులకు భరోసా కల్పిస్తూ ఇంటి నిర్మాణాల పూర్తికి సహకారం అందజేస్తోంది. ఇందులో భాగంగానే అసంపూర్తిగా వదిలేసిన వారికి అదనపు సాయం ప్రకటించింది. ఈమేరకు వారి ఖాతాల్లో నగదు జమచేసినా నిర్మాణాలు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు.

**3,357 మంది ప్రారంభించలేదు..**

అదనపు సాయంలో భాగంగా నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు ఆసక్తిచూపిన వారికి తొలిదశలో 5,709 మంది లబ్ధిదారులకు రూ.13.17 కోట్లు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. వీటిలో బీసీ,



ఎస్సీ వర్గాలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున ఖాతాల్లో కొంతమొత్తం జమచేశారు. వీరిలో నగదు వినియోగించుకుని ఇంటి నిర్మాణాన్ని తలపెట్టిన వారు 1,722 మంది ఉండగా వీరిలో 1,333 మంది పూర్తి చేశారు. మిగిలిన 3,357 మంది ప్రారంభించలేదు. అదనపు సాయం పొందినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది.

జిల్లాలో 30 మండలాలు, నాలుగు అర్బన్ ప్రాంతాల్లో కలిపి మొత్తం 784 లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో 33.12 వేల మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. వీరిలో కేవలం 11.36 వేల మంది మాత్రమే గృహాలు పూర్తి చేశారు. 809 మంది ప్రారంభించనే లేదు. 20,194 నిర్మాణాలు వివిధ దశల్లోనే అసంపూర్తిగా ఉన్నాయి. గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులతో కలిపి రూ.1.80 లక్షలు సాయం అందించింది. కట్టని వాటిని రద్దు చేస్తామని ఒత్తిడి తీసుకురావడంతో కొందరు అప్పులు చేసి నిర్మించారు. మిగిలినవారు వదిలేశారు.

**చర్యలు తీసుకుంటాం..**

లబ్ధిదారులు తప్పనిసరిగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి. ఆసక్తిలేని వారి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొందరు ముందు కొచ్చి పూర్తి చేశారు. మిగిలినవారు త్వరగా పూర్తి చేయాలి. నగేష్, పీడీ, గృహనిర్మాణ సంస్థ

# అదను కుదిరింది..!

నరసన్నపేట: జిల్లాలో ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి.. గత 15 రోజులుగా కురిసిన వర్షాలకు పొలాల్లో పదును చేరింది.. దీంతో అన్నదాతలు సాగుకు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా దుక్కులు దున్నడం, వెద జల్లడం చేస్తున్నారు. జిల్లాలో 4.74 లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూమి ఉండగా, 3.6 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో వరి సాగుకు 1.10 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం. ఇందులో ప్రభుత్వం రాయితీపై 33 శాతం మేర ఏపీ సీడ్స్ ద్వారా పంపిణీ చేస్తోంది. 35,911 క్వింటాళ్లు అవసరమని మండలాల నుంచి ప్రతిపాదించగా, వ్యవసాయ శాఖ ఇప్పటికే 34,518 క్వింటాళ్లు రైతు సేవా కేంద్రాలకు తరలించింది.



ఈసారి గరిష్ఠంగా సాంబ, ఇంద్ర, స్వర్ణ, శ్రీధృతి రకాలపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇవి కాక అవసరాలకు అనుగుణంగా ప్రైవేటు వ్యాపారుల నుంచి మరో 70 వేల క్వింటాళ్ల వరకు విత్తనాలు కొనుగోలు చేసుకుంటారని అంచనా. అమూల్య, సంపద, సుభద్ర, కనెక్ట్ ప్లస్ వంటి విత్తన రకాలు వ్యాపారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

**65 శాతం వెద..** జిల్లాలో ఏటేటా వెదసాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. తక్కువ ఖర్చు, సమయం ఆదా అవుతుందనే ఉద్దేశంతో అన్నదాతలు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు. ఈసారి 65 శాతం మేర వెద సాగు చేయనున్నారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. 'వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున ఖరీఫ్ సాగు ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే నిర్దేశిత లక్ష్యంలో రాయితీపై విత్తనాలు అందజేశాం' అని వ్యవసాయ శాఖ జేడీ కె.త్రినాథస్వామి తెలిపారు.

# నల్లమల రోడ్డుకు రూ.400 కోట్లు

నంద్యాల : కల్వకుర్తి- జమ్మలమడుగు 167కే జాతీయ రహదారి నిర్మాణంలో మరో కీలక అడుగు పడింది. నల్లమల అటవీ ప్రాంతంలోని నల్లకాల్వ-వెలుగోడు పులుల అభయారణ్యంలో రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీంతో ఈ రహదారి పనులకు సంబంధించి అన్ని ప్యాకేజీలకు నిధులు కేటాయించినట్లయింది. త్వరలో నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. **ఐదో ప్యాకేజీగా గుర్తింపు** తెలంగాణలోని కల్వకుర్తి నుంచి రాష్ట్ర సరిహద్దు సోమేశ్వరం వరకు ఒక ప్యాకేజీగా, సోమేశ్వరం-సంగమేశ్వరం కేబుల్ బ్రిడ్జి రెండో ప్యాకేజీగా, ఈ వంతెన కింద అప్రోచ్ రోడ్లను మూడో ప్యాకేజీగా, సంగమేశ్వరం నుంచి నల్లకాల్వ వరకు, వెలుగోడు నుంచి నంద్యాల వరకు రహదారి నిర్మాణాలను నాలుగో ప్యాకేజీగా విభజించారు. ఇక నంద్యాల నుంచి వైఎస్సార్ కడప జిల్లాలోని జమ్మలమడుగు వరకు రహదారి పనులను ఆంధ్రప్రదేశ్‌లోని ఒకటో ప్యాకేజీగా గుర్తించి నిధులను కేటాయించారు. నల్లకాల్వ- వెలుగోడు రహదారి పనులను 5వ ప్యాకేజీగా విభజించారు. ఈ ప్రాంతం పులుల అభయారణ్యంలో ఉండటంతో పనులు చేయడానికి కేంద్రస్థాయిలో వివిధ విభాగాల నుంచి అనుమతులు అవసరం ఉంటుంది. దీంతో దీన్ని ప్రత్యేక ప్యాకేజీగా విభజించారు. కోవెలకుంట్ల నుంచి జమ్మలమడుగు వరకు నిర్మించనున్న జాతీయ రహదారి పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. తెలంగాణలో మొదటి ప్యాకేజీ పనులు ఏడాది క్రితమే పూర్తయ్యాయి. రెండు, మూడు, నాలుగో ప్యాకేజీ పనులకు టెండర్లు కూడా పూర్తి చేశారు. నాలుగో ప్యాకేజీకి సంబంధించి భూ సేకరణ పనులు చివరి దశకు వచ్చాయి.

**అనుమతులే తరువాయి** నల్లకాల్వ నుంచి వెలుగోడు వరకు అటవీ మార్గంలో 17 కి.మీల మేర రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. 10 మీటర్ల వెడల్పుతో రెండు వరుసల రహదారి వేయనున్నారు. ప్రస్తుతం ఇది ఒకే వరుస రహదారిగా ఉంది. దశాబ్దాలుగా ఈ రహదారికి మరమ్మతులు మాత్రమే చేస్తున్నారు కాని విస్తరించ లేదు. గతంలో ఈ రహదారి అభివృద్ధి కోసం పలుమార్లు నిధులు కేటాయించారు. కాని అరణ్యంలో పనులు చేయడానికి అటవీ శాఖ అభ్యంతరం తెలిపింది. దీంతో నిధులు కేటాయించి, టెండర్లు పిలిచి గుత్తేదారులతో ఒప్పందం కుదుర్చుకున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

## దేవియాని గ్లామర్ ట్రీట్

ఇన్‌స్టాగ్రామ్‌లో సోషల్ మీడియా యాక్టివిటీతో ఎప్పుడూ ఫోకస్‌లో ఉండే నార్త్ బ్యూటీ దేవియాని శర్మ తాజాగా షేర్ చేసిన గ్లామర్ ఫొటోలు ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నాయి. ఆమె ఫాలోవర్లకు అందించిన ఈ లుక్‌కు నెటిజన్లు ఫిదా అయిపోయారు. ఎర్ర రంగు బ్లౌజ్, ఆకుపచ్చ చీరతో సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన దేవియాని తన గ్లామర్ లుక్‌తో ఫొటోషూట్‌కి కొత్త డెఫినిషన్ ఇచ్చింది. ఎక్స్‌ప్రెషన్స్, ఆ అటిట్యూడ్%ౌ% చూస్తుంటే అందరి ఫోకస్ ఆమెపై యూ టర్న్ తీసుకోకుండా ఉండదు. ఫొటోలు చూసిన నెటిజన్లు 'ఫైర్' కామెంట్లతో ఫుల్ ట్రెండ్‌లోకి తీసుకొస్తున్నారు. దేవియాని శర్మ మొదటగా యూట్యూబ్ వెబ్ సిరీస్‌లతో వెలుగులోకి వచ్చారు. 'సేవ్ ది టైగర్స్', 'షైతాన్', వంటి వెబ్ కంటెంట్ ప్రాజెక్టుల్లో ఆమె నటనకు మంచి గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా సైతాన్ సిరీస్‌లో ఆమె పోషించిన



ఇంటెన్స్ క్యారెక్టర్‌కు సంబంధించిన లుక్స్, యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దేవియాని ఏ పాత్రలోనైనా ఒదిగిపోయే నైపుణ్యం ఉండటంతో ఆమెకు వరుసగా అవకాశాలు వచ్చాయి. వెబ్ సిరీస్‌లతో పాటు సినిమాలపై కూడా ఫోకస్ పెడుతున్న దేవియాని త్వరలో టాలీవుడ్‌లో ఒక మంచి పాత్రతో రాబోతున్నట్లు సమాచారం. తెలుగులో ఆమెకు పూర్తి స్థాయి గ్లామర్ రోల్స్‌తో పాటు పెర్ఫార్మెన్స్‌ను హైలైట్ చేసే పాత్రలపై ఆసక్తి ఉంది. ఈ మధ్య వచ్చిన ఓ ఫొటోషూట్‌లో కూడా ఆమె స్టన్నింగ్‌గా కనిపించడం చూస్తే, స్టార్ ఇమేజ్ కోసం ఎలా ప్లాన్ చేసుకుంటున్నదో అర్థమవుతోంది. ఇటీవల ఆమె పుట్టినరోజు సందర్భంగా చాలా సెలబ్రిటీలు, ఫ్యాన్స్ సోషల్ మీడియాలో విషెస్ చెబుతుండగా, ఆమె పోస్ట్ చేసిన స్టైలిష్ లుక్స్‌కి హృదయాలే పెట్టేశారు. దేవియాని సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే బ్యూటీ. ఇన్‌స్టా రీల్స్, ట్రెండింగ్ ఫొటోషూట్లతో ఫాలోయింగ్ పెంచుకుంటూ కెరీర్ పరంగానూ ముందుకు సాగుతోంది.

## ప్రేమలు బ్యూటీకి మరో బంపర్ ఆఫర్..!

మలయాళ భామ మమితా బైజు ప్రేమలు సినిమాతో సౌత్ లో సూపర్ క్రేజ్ ని తెచ్చుకుంది. ప్రేమలు ఒక రెగ్యులర్ లవ్ స్టోరీనే కానీ అందులో నటించిన మమితా తన క్యూట్ లుక్స్, ఎక్స్ ప్రెషన్స్ తో యువత హృదయాలను దోచేసింది. ప్రేమలు బ్యూటీకి వచ్చిన ఈ క్రేజ్ ని క్యాష్ చేసుకోవాలని దర్శక నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా టాలీవుడ్ లో మమితా బైజుకి ఉన్న ఫ్యాన్స్ దృష్టిలో ఉంచుకుని ఆమెను ఇక్కడ సినిమాల్లో తీసుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే మాస్ మహారాజ్ రవితేజ సినిమాలో మమితా నటిస్తుందని తెలుస్తుంది. కిశోర్ తిరుమల డైరెక్షన్ లో చేస్తున్న అనార్కలి సినిమాలో మమితా బైజు నటిస్తుందని టాక్. ఈ సినిమాలో కయదు లోహార్ కూడా మరో హీరోయిన్ గా నటిస్తుందని చెబుతున్నారు. ఐతే ఈ సినిమాతో పాటుగా మమితా టాలీవుడ్ లో మరో బంపర్ ఆఫర్



అందుకుందని ఫిల్మ్ నగర్ టాక్. తెలుగులో ఒక క్రేజీ సినిమాలో హీరోయిన్ గా మమితాని ఓకే చేశారట. క్రేజీ హీరో స్టార్ డైరెక్టర్ కాంబినేషన్ లో రాబోతున్న ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని తెలుస్తుంది. మమితా కూడా స్టోరీ వినగానే కనెక్ట్ అయ్యిందట. తెలుగులో ఎప్పటి నుంచో నటించాలని ఉన్నా సరైన కథ దొరక్క సైలెంట్ గా ఉంది మమితా బైజు. ఐతే ఇప్పుడు అమ్మడు వరుస తెలుగు సినిమాలు చేసేందుకు రెడీ అయ్యింది. రవితేజ సినిమాలో మంచి రోల్ చేస్తుందని తెలుస్తుండగా ఈ సినిమాతో పాటు మరో కొత్త సినిమాకు లాక్ అయినట్టు తెలుస్తుంది. స్క్రీన్ మీద మమితా క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ కుర్రాళ్లను గిలిగింతలు పెట్టిస్తుంది. అందుకే యూత్ లో ఆమెకు ఉన్న ఈ క్రేజ్ ని పర్ఫెక్ట్ గా వాడుకోవాలని చూస్తున్నారు. మమితా బైజు తెలుగుతో పాటుగా తమిళ్, మలయాళ సినిమాల్లో రాణిస్తుంది. ప్రస్తుతం అమ్మడు దళపతి విజయ్ జన నాయగన్ లో కూడా ఇంపార్టెంట్ రోల్ చేస్తుంది. ఆ సినిమాలో పూజా హెగ్డే కూడా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. సౌత్ లో తన మార్క్ నటనతో ఆకట్టుకుంటున్న మమితా తెలుగులో బిజీ హీరోయిన్ గా ఛాన్స్ లు అందుకోవాలని చూస్తుంది. ప్రేమలుతో ఆల్రెడీ మమితాకు తెలుగు ఆడియన్స్ కనెక్ట్ అయ్యారు. సో రాబోయే సినిమాలు కూడా ఆమె అదరగొట్టేస్తుందని ఫిక్స్ అయ్యారు.




## ఎన్టీఆర్ నీల్ మూవీలో బాలీవుడ్ భామ?



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ గతేడాది దేవర సినిమాతో బాక్సాఫీస్ వద్ద చేసిన హంగామా అంతా ఇంతా కాదు. దేవరతో కలెక్షన్ల సునామీ సృష్టించిన ఎన్టీఆర్ ఆ సినిమాకు సీక్వెల్ కూడా చేయాల్సి ఉంది. కానీ దానికంటే ముందే ఎన్టీఆర్ మరో రెండు సినిమాలతో ఆడియన్స్ ను పలకరించనున్నాడు. అందులో ఒకటి వార్2 కాగా, రెండోది డ్రాగన్. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా వార్2. భారీ అంచనాలతో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ ను ఎన్టీఆర్ ఇప్పటికే పూర్తి చేశాడు. వార్2 సినిమాతోనే ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో వార్2 సినిమాపై ఎన్టీఆర్ ఫ్యాన్స్ తో పాటూ అందరికీ దానిపై మంచి ఆసక్తి నెలకొంది.

ఇక రెండోది ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ చేస్తున్న సినిమా. ఎన్టీఆర్‌నీల్ వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో రూపొందిస్తుంది. ఈ సినిమాకు డ్రాగన్ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నట్టు సమాచారం. పాన్ ఇండియా లెవెల్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా గురించి ప్రస్తుతం ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ వినిపిస్తోంది. డ్రాగన్ మూవీలో బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ఓ కీలక పాత్రలో నటించనుందని టాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. సెకండాఫ్ లో వచ్చే ఆమె పాత్ర సినిమాకే హైలైట్ కానుందని సమాచారం. అయితే ఈ సినిమా కోసం ఆల్రెడీ కన్నడ భామ రుక్మిణి వసంత్ ను తీసుకున్నారని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు సడెన్ గా శ్రద్ధా కపూర్ పేరు వినిపించడంతో ఏ వార్త నిజమని కొందరు అయోమయంలో పడితే, మరికొందరు ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉంటారని, అందులో ఒకరు రుక్మిణి వసంత్ కాగా, మరొకరు శ్రద్ధా కపూర్ అయుండొచ్చని జోస్యం చెప్తున్నారు. ఏదేమైనా ఈ విషయంలో మేకర్స్ నుంచి క్లారిటీ వచ్చే వరకు ఏదీ నమ్మడానికి లేదు.

## నవంబర్ వరకూ బన్నీ-అట్లీ అక్కడేనా?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 22వ చిత్రం ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా మారుతోంది. అట్లీ 'జవాన్' తర్వాత టేకప్ చేసిన ప్రాజెక్ట్ కావడంతో బజ్ పీక్స్ కి చేరింది. సినిమా ప్రారంభోత్సావానికి ముందే ఓ రేంజ్ లో హైప్ క్రియేట్ అవుతుంది. దుబాయ్ లో స్టోరీ సహా ప్రీ ప్రొడక్షన్ పనులు జరగడం...న్యూయార్క్ స్టూడి యోలను ఇరువురు చుట్టేయడంతో ఇద్దరు ఏం చేస్తున్నారో? అర్దం కాని పరిస్థితి ఏర్పడింది. ఈసారి అట్లీ కథను టెక్నికల్ గా హైలైట్ చేస్తున్నట్లు ముందే క్లారిటీ వచ్చేస్తుంది. ప్రీ ప్రొడక్షన పనులే కొన్ని నెలలు పాటు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. చిత్రాన్ని నవంబర్ లో ప్రారంభోత్సవం చేయాలని ప్లాన్ అట. అప్పటి వరకూ ప్రీ ప్రొడక్షన్ తో పాటు అవసరమైన వర్క్ షాపులు కూడా నిర్వహిస్తారుట. వర్క్ షాపుల కోసమే నాలుగు నెలలు సమయం కేటాయిస్తున్నారుట. ఇంత వరకూ అట్లీ ఏ సినిమాకు వర్క్ షాపులు నిర్వహించలేదు. బాలీవుడ్ హీరో షారుక్ ఖాన్ తో 'జవాన్' తెరకెక్కించిన సమయంలో ఇలాంటి ఛాన్స్ తీసుకోలేదు. నేరుగా సెట్స్ కి వె ళ్లిపోయారు. చకాచకా ముగించి రిలీజ్ కు వచ్చేసారు. కానీ బన్నీ చిత్రం టెక్నికల్ గానూ కీలకం కావడంతో వర్క్ షాపులు ప్లాన్ చేసారు. ఇందులో బన్నీతో పాటు హీరోయిన్లు ఇతర టీమ్ అంతా పాల్గొం టుంది. అలాగే సినిమాలో అండర్ వాటర్ సీన్స్ కొన్ని ఉన్నాయట. సినిమాలో ఇవి చాలా కీలకమైన సన్నివేశాలని అంటున్నారు. అండర్ వాటర్ సీన్స్ మేకింగ్ అంటే అంత సులభం కాదు. అవసరం మేర విదేశీ బృందాన్ని దించాల్సి ఉంటుంది. ప్రఖ్యాత స్టూడియల్లో ఆ సన్నివే శాలకు సంబంధించి విఎఫ్ ఎక్స్ , సీజీ పనులు నిర్వహించాల్సి ఉంటుంది. చిత్రీకరణ అనంతరం సీజీ కోసమే ఆరేడు నెలలు సమయం తీసుకుంటారని సమాచారం. అలాగే సినిమాలో ముగ్గురు హీరోయిన్లు ఉంటారు? అన్న ప్రచారం ఇప్పటికే తారా స్థాయికి చేరింది.

## 'సింగిల్స్'తో హాట్ లేడీ ఇక ట్రాక్‌లోకి వచ్చేసినట్టేనా?


డబుష్మాష్ వీడియోలతో నెట్టింట పాపులర్ అయిన ఢిల్లీ భామ కేతికశర్మ. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మంచి క్రేజ్‌ని సొంతం చేసుకున్న కేతిక వెర్సటైల్ డైరెక్టర్ పూరి దృష్టిని ఆకర్షించి తొలి అవకాశాన్ని దక్కించుకుంది. పూరి తనయుడు ఆకాష్ పూరి హీరోగా నటించిన రొమాంటిక్ మూవీతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది. కానీ తొలి మూవీతో హాట్ బేబీగా గుర్తింపుని తెచ్చుకుందే కానీ హిట్‌ని మాత్రం దక్కించుకోలేకపోయింది. హాటీగా పూర్తి ఎఫర్ట్ పెట్టినా కథ, కథనాలు ఆకట్టుకోలేకపోవడంతో కేతికకు తొలి అడుగులోనే పరాభవం ఎదురైంది. ఆ తరువాత నాగశౌర్యతో చేసిన లక్ష్య, వైష్ణవ్ తేజ్‌తో చేసిన రంగ రంగ వైభవంగ%-% కూడా అదే కోలలో చేరి కేతికని తవ్రంగా నిరాశకు గురి చేసింది. పవర్‌స్టార్‌తో కలిసి సాయిధరమ్ తేజ్ చేసిన బ్రో కూడా కేతిక కెరీర్‌ని ట్రాక్‌లో పెట్టలేకపోయింది. అయితే ఇటీవల నితిన్ నటించిన రాబిన్ హుడ్‌లో



అదిదా సర్‌ప్రైజ్ అంటూ ఐటమ్ నంబర్‌లో హీటెక్కించింది. శేఖర్ మాస్టర్ వివాదాస్పద స్టెప్పులతో వార్తల్లో నిలిచింది. సినిమా హిట్ కాకపోయినా కేతికని మాత్రం వార్తల్లో నిలిపేలా చేసింది. అయితే కేతిక ఐటమ్ నంబర్లకే పరిమితమా? హీరోయిన్‌గా సక్సెస్‌ని దక్కించుకోలేదా? అనే కామెంట్‌లు వినిపించాయి. ఎంతగా ప్రయత్నిం చినా తనకు కమర్షియల్ విజయం లభించకపోవడంతో కేతిక కూడా కొంత నిరుత్సాహానికి గురైంది. అయితే తాజాగా శ్రీవిష్ణుతో కలిసి చే సిన సింగిల్ రీసెంట్‌గా విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకుం ది. హీట్ సమ్మర్‌లో కూల్‌హిట్‌గా నిలిచి శ్రీవిష్ణుతో పాటు కేతికకు, లవ్ టుడే ఫేమ్ ఇవానకు మంచి విజయాన్ని అందించింది. చాలా రోజుల తరువాత కేతిక శర్మకు సింగిల్‌తో సక్సెస్ లభించింది. దీంతో హాట్ లేడీగా పేరు తెచ్చుకున్న కేతిక ఇక ట్రాక్‌లోకి వచ్చేసినట్టేనా? అనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకున్న సింగిల్ వసూళ్ల పరంగానూ మంచి ఫిగర్లని నమోదు చేస్తుండటంతో ఇక కేతిక కెరీర్ టర్న్ అయినట్టేనని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఈ మూవీ తరువాత కేతిక తమిళ డైరెక్టర్ రాజేష్ ఎం.సెల్వ డైరెక్షన్‌లో ఓ మూవీ చేస్తోంది. ఇది కూడా హిట్ అనిపించుకుంటే తెలుగులో కేతికకు ఇక తిరుగుండదన్నమాటే.

## సీతమ్మ జీవితాన్నే మార్చేసిన ఘటన!

మృణాల్ ఠాకూర్ అలియాస్ సతీమ కెరీర్ దేదీప్యమానంగ సాగిపోతున్న సంగతి తెలిసిందే. 'సీతారామం' సక్సెస్ తర్వాత గ్యాప్ వచ్చినా? వరుస ప్రాజెక్ట్ లతో ఒక్కసారిగా బిజీ అయింది. ప్రస్తుతం బాలీవుడ్ లోనే ఐదారు సినిమాలు చేస్తోంది. ఇందులో 'డెకాయిట్' చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీలోనూ తెరకెక్కి స్తున్నారు. తెలుగులో అవకాశాలు వస్తున్నా? కథలు నచ్చకపోవడంతో అంగీకరించడం లేదు. అలా చాలా ప్రాజెక్టులే వదులుకుంది. పారితోషికంతో పనిలేకుండా కేవలం కథాబలం...సవాల్ విసిరే పాత్రలే కావాలం టోంది. కథల విషయంలో అంత బలంగా నిలబడింది కాబట్టే సక్సెస్ లు అందుకుం టుంది. అయితే నటిగా ఇంత బిజీ అవ్వడానికి కారణమైన కెరీర్ మూలాలను మృణాల్ మరోసారి గుర్తు చేసుకుంది. నటన పట్ల తనకు ఉత్సాహం ఉన్నా? దాన్ని ఎలా ఆచరణలో పెట్టాలో తెలియక చాలా ఇబ్బంది పడిందిట. తన కలను ఎలా స్వీకరిస్తారో తెలియక తనలో



ఫ్యాషన్ ను గురించి ఎప్పుడూ కుటుంబ సభ్యులతో పంచు కోలేదుట. అనుకోకుండా ఓ రోజు ఓ స్నేహితురాలు మరాఠీ షో ఆడిషన్ గురించి చెప్పడంతో అక్కడ పాల్గొందిట. మరాఠీ మాతృ భాష కావడంతో పెర్ఫార్మెన్స్ తో ఇరగదీసిందట. ఆ సక్సెస్ ఓపాత్రను తెచ్చి పెట్టిందదంది. నటన ప్రయాణంలో తొలి అడుగు పడేలా చేసిందదంది. కెరీర్ లో ఎంతో మంది ప్రేక్షకుల ప్రేమను పొందడానికి కారణమైన ఆ క్షణాలు ఎప్పటికీ ప్రత్యేకమని గుర్తు చేసుకుంది. మృణాల్ తొలు మరాఠీలో 'హలో నందన్' అనే చిత్రంలో నటించింది. ఆ సినిమా రిలీజ్ అయిన నాలుగేళ్లకు లవ్ సోనియాతో బాలీవుడ్ లో అడుగు పెట్టింది. తెలుగులో సీతారామంతో స్టార్ హీరోయిన్ గా వెలిగిపోయింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536